ప్రభాతనవ
SINGIDI తెలుగు దినపత్రిక
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
singidinews.com
శుక్రవారం 11 సెప్టెంబర్ 2026 సంపుటి: 1 సంచిక: 86 పేజీలు 12 వెల: 6.50
Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

## టీవీకే పార్టీకి అధికారిక గుర్తింపు

**రాష్ట్ర పార్టీ హోదా కల్పిస్తూ ఈసీ నిర్ణయం**



ప్రముఖ నటుడు విజయ్ నేత త్వంలోని 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పార్టీకి భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) రాష్ట్ర పార్టీగా అధికారిక గుర్తింపుని చ్చింది. పార్టీకి శాశ్వత ఎన్నికల గుర్తుగా 'విజిల్'ను కేటాయిస్తూ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

**న్యూఢిల్లీ (సింగిడి)** 2



## ట్రంప్ డివిడెండ్

**రిపబ్లికన్లు గెలిస్తే ప్రతి అమెరికన్‌కు 5 వేల డాలర్లు**

**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన హామీ** 2

# సావు రాజకీయాలు

## కేసీఆర్ చావు చుట్టూ రాజకీయ దుమారం

**కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలతో కొత్త వివాదం.. హరీశ్‌రావుపై మహేశ్ గౌడ్ పాత ఆరోపణలు**

కేసీఆర్ ఆరోగ్యంపై మల్లు రవి వ్యాఖ్యలు.. గవర్నర్‌కు కేటీఆర్ ఫిర్యాదుతో మరింత హీట్



**కేసీఆర్ చావు చుట్టూ తెలంగాణ రాజకీయాల్లో మరోసారి మాటల మంటలు చెలరేగాయి. కాంగ్రెస్ చేపట్టిన చావు డప్పు నిరసన.. కేసీఆర్ చావును కోరుతున్నారనే ఆరోపణల వరకు వెళ్లింది. దీనిపై బీఆర్ఎస్ తీవ్రంగా స్పందించగా.. కాంగ్రెస్ నేతలు మాత్రం తాము కేసీఆర్ వందేళ్లు ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నామని వివరణ ఇచ్చారు. దీంతో ఒక నిరసనగా మొదలైన కార్యక్రమం.. ఇప్పుడు వ్యక్తిగత ఆరోగ్యం, మరణం చుట్టూ రాజకీయ చర్చగా మారింది.**

**హైదరాబాద్ బ్యూరో - సింగిడి:**

### చావు డప్పు నుంచి..

కేసీఆర్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ చేపట్టిన చావు డప్పు నిరసనతోనే ఈ వివాదానికి తెరలేచింది. ఆ కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలు కేసీఆర్ చావును కోరుతున్నట్టుగా ఉన్నాయంటూ బీఆర్ఎస్ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో నిరసన వెనుక ఉన్న రాజకీయ అంశం కంటే.. అక్కడ వినిపించిన మాటలే ప్రధాన చర్చగా మారాయి.

### కవర్ చేసుకునే ప్రయత్నమా..

ఆరోపణలు తీవ్రం కావడంతో కాంగ్రెస్ నేతలు తమ వైఖరిని స్పష్టం చేశారు. కేసీఆర్ వందేళ్లు ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నామని చెబుతూనే.. అయితే గియితే ఆయన ఆరోగ్యం చెడిపోవాలని కోరుకునేది హరీశ్‌రావేనంటూ టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పాత ఆరోపణలను మళ్లీ ప్రస్తావించారు. ఆ వివరణ తర్వాత కూడా హరీశ్‌రావుపై మహేశ్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు మరో చర్చకు దారితీశాయి.

### మల్లు రవి వ్యాఖ్యలతో..

ఇదే సమయంలో కేసీఆర్ ఆరోగ్యంపై కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి చేసిన వ్యాఖ్యలు కూడా చర్చకు వచ్చాయి. దీంతో ఇప్పటికే వేడెక్కిన అంశం.. మరింత సున్నితమైన దిశలోకి వెళ్లింది. కేసీఆర్ ఆరోగ్యం కూడా ఇప్పుడు ఇరుపక్షాల మధ్య రాజకీయ చర్చలో భాగమైంది.

### కేటీఆర్ ఫిర్యాదుతో..

మరోవైపు కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గవర్నర్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ అంశం మరో స్థాయికి చేరింది. ఒకవైపు కాంగ్రెస్ నేతల వివరణలు.. మరోవైపు బీఆర్ఎస్ అభ్యంతరాలు.. మధ్యలో పరస్పర ఆరోపణలతో కేసీఆర్ ఆరోగ్యం, మరణం చుట్టూ చర్చ కొనసాగుతోంది.

### రాజకీయాల్లో ఇదెక్కడి భాష..

ప్రజా సమస్యలపై అధికార, ప్రతిపక్షాలు పోరాడటం ప్రజాస్వామ్యంలో సహజం. విధానాలను ప్రశ్నించొచ్చు.. నిర్ణయాలను విమర్శించొచ్చు.. నేతల పనితీరును ఎండగట్టొచ్చు. కానీ వ్యక్తుల ఆరోగ్యం.. మరణం వంటి అంశాలు రాజకీయ విమర్శల్లోకి వచ్చినప్పుడు అసలు ప్రజా సమస్యలు వెనక్కి వెళ్లిపోతాయి. కేసీఆర్ చావు చుట్టూ మొదలైన ఈ మాటల యుద్ధం.. చివరకు కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ మధ్య మరో రాజకీయ పోరుగా మారింది. విమర్శలు ఉండొచ్చు..



## బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టండి

**అసెంబ్లీ కార్యకలాపాలను అడ్డుకుంటోంది**

**అధికారం పోయినా అహంకారం పోలేదు**
**వారి కుట్రలను సమర్థంగా ఎదుర్కోవాలి**
**ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**
**బీఆర్ఎస్‌పైనే ప్రజల్లో వ్యతిరేకత ఉంది**
**కాంగ్రెస్‌కు నష్టం చేసేందుకు కుట్రలు**
**బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్ రెడ్డి ధ్వజం!**
**సభ్యుల పనితీరే గెలుపునకు మూలం**
**తెలంగాణ కులగణన దేశానికే ఆదర్శం**
**సర్‌పై అందరూ అప్రమత్తంగా ఉండండి**
**సీఎల్పీ సమావేశంలో రేవంత్ వ్యాఖ్యలు**
**ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ దిశానిర్దేశం**
**అసెంబ్లీ ఘటనపై సర్కార్ ఫ్లాష్ సర్వే..**

తెలంగాణ అసెంబ్లీ వేదికగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ వివాదం మరింత వేడెక్కింది. అసెంబ్లీ కమిటీ హాల్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశంలో ఇటీవల అసెంబ్లీ వద్ద చోటుచేసుకున్న పరిణామాలు, ప్రతిపక్షాల వ్యవహారశైలి, ప్రభుత్వ భవిష్యత్ వ్యూహంపై కీలకంగా చర్చించినట్లు సమాచారం. ఈ సందర్భంగా గత మూడు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా జరిగిన పరిణామాలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించినట్లు చెబుతున్న ఓ ఫ్లాష్ సర్వే ఫలితాలను సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేల ముందు ప్రస్తావించినట్లు తెలుస్తోంది.

**హైదరాబాద్ (సింగిడి)** 2

## ఉద్యోగుల పక్షాన ఉంటా

**ఆరు డీఏలు త్వరలో ప్రకటిస్తాం**



2

**పీఆర్సీ నివేదికను వెంటనే అందాలి**
**డీఏలపై సీఎం రేవంత్ కీలక హామీ**
**సమస్యలపై సీఎంతో జేఏసీ చర్చలు**

ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రతినిధులు ప్రభుత్వ ఆహ్వానం మేరకు సీఎంను కలిసి తమ సమస్యలను వివరించారు. క్షేత్రస్థాయిలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు, పెరుగుతున్న పని ఒత్తిడిని ఆయన ద ష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఆరు డీఏలు పెండింగ్‌లో ఉండటంతో ఉద్యోగులకు జరుగుతున్న ఆర్థిక నష్టాన్ని వివరించారు.

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (సింగిడి)**

## పంచాయతీరాజ్ బిల్లుకు ఆమోదం

**సెక్షన్ 70 లోని సబ్ సెక్షన్ 3ను సవరించేలా బిల్లు**



2

పంచాయతీల సొంత వనరుల ద్వారా వచ్చే ఆదాయం, ప్రభుత్వ ట్రెజరీలో కాకుండా బ్యాంకు ఖాతాల్లో జమ చేసుకునేలా చట్ట సవరణ బిల్లుకు శాసనసభ ఆమోద ముద్ర వేసింది. తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టం–2018లోని సెక్షన్ 70 లోని సబ్ సెక్షన్ 3ను సవరించేలా మంత్రి సీతక్క ప్రవేశ పెట్టిన బిల్లుపై చర్చ జరిపి ఆమోదించింది.

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (సింగిడి)**

## లడఖ్‌కు త్వరలోనే ప్రత్యేక హోదా

**ఆర్టికల్ 371 సవరణకు కేంద్రం కసరత్తు**

గత నాలుగేళ్లుగా లడఖ్ ప్రజలు చేస్తున్న డిమాండ్ నెరవేరే సూచనలు కనిపిస్తున్నాయి. లడఖ్ ప్రాంతానికి ఆర్టికల్ 371 కింద రాజ్యాంగ పరిరక్షణలు కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. అలాగే హిమాలయ ప్రాంతమైన లడఖ్ పాలన కోసం భారతదేశంలోనే మొదటిసారిగా 'సూర జెనెరిస్' నమూనాలో ఒక ఎన్నికైన పాలక మండలిని ఏర్పాటు చేయనున్నారు. ఎన్డీటీవీకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో లడఖ్ చీఫ్ సెక్రటరీ ఆశిష్ కుంద్రా మాట్లాడుతూ.. లడఖ్‌కు తగిన రాజ్యాంగ పరిరక్షణలు కల్పించేందుకు పార్లమెంట్ ఆర్టికల్ 371ని సవరిస్తుందని తెలిపారు.

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 10 (సింగిడి)** 2

## పదవి ఇచ్చేది అధిష్ఠానం.. రేవంత్‌రెడ్డి కాదు

**రాజగోపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు**

సీఎం, తాను ఎప్పుడూ తిట్టుకోవాలని కొందరి చూస్తున్నారని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. సీఎంతో తనకు భిన్నాభిప్రాయాలు మాత్రమే ఉన్నాయన్నారు.

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (సింగిడి)**





2

## రూ.2 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుకు రూ.లక్ష లంచం

**తెలంగాణ సచివాలయంలో ఏసీబీ దాడులు**

తెలంగాణ సచివాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు చేపట్టిన ట్రాప్ కలకలం రేపింది. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన రూ.2 లక్షల మెడికల్ రీయింబర్స్‌మెంట్ చెక్కును ఇప్పించేందుకు రూ.లక్ష లంచం డిమాండ్ చేసినట్లు అందిన ఫిర్యాదు ఆధారంగా ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు.

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (సింగిడి)**

## కొండల్ రెడ్డికి అక్రమ కేటాయింపులు

నిబంధనలకు విరుద్ధంగా భూముల కేటాయింపు

**200 కోట్ల విలువైన ఐదెకరాల భూమిని ఇచ్చారు**
**ఈ భూదోపిడీని అసెంబ్లీ వేదికగా ప్రశ్నించాం**
**ప్రశ్నించినందుకే ఎమ్మెల్యేలను సస్పెండ్ చేశారు**
**బినామీ కంపెనీల లబ్ధికోసమే సిఎం పనిచేస్తున్నారు**
**'ఇజ్రాయెల్ ఇన్నోవేషన్'తో అక్రమ ఒప్పందాలు**
**సొంత తమ్ముళ్లకు మాత్రం అద్భుతమైన ఉపాధి**
**నిజాయతీ ఉంటే వెంటనే కేంద్రం స్పందించాలి**
**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు**
**రేవంత్ రెడ్డికి సొంత ఊరి నుంచే కౌంట్‌డౌన్ షురూ**
**ఫ్యూచర్ సిటీలో కొండల్ రెడ్డి భూముల పరిశీలన**
**ఫ్యూచర్ సిటీ భూముల వద్ద తీవ్ర ఉద్రిక్తత..**
**కేటీఆర్, హరీశ్ రావు ఆధ్వర్యంలో భారీ నిరసన!** 2



## కాంగ్రెస్ పార్టీ ఫేక్ అకౌంట్లు సృష్టిస్తోంది

**ఫేక్ సోషల్ మీడియా ద్వారా మాపై దాడిచేస్తోంది**
**ఫేక్ వార్తను అసెంబ్లీలో రేవంత్ ప్రస్తావిస్తున్నారు**
**సభకు, ప్రజలకు సిఎం రేవంత్ క్షమాపణ చెప్పాలి**
**నీళ్లు ఉండి మోటార్లు నడపడం చాతకాని సిఎం**
**ఇలాంటి ముఖ్యమంత్రిని నిన్నే చూస్తున్నా..**
**రేవంత్ రెడ్డి మార్షల్స్‌తో మమ్మల్ని ఎత్తడం కాదు..**
**మోటార్లు ఆన్ చేసి రైతులకు నీళ్లు ఎత్తు రేవంత్**
**బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు వెల్లడి**

కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వేదికగా ఫేక్ అకౌంట్లను స ష్టించి ప్రతిపక్షాలపై అత్యంత దుర్మార్గమైన దాడికి పాల్పడుతోందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నాయకులే స్వయంగా నిర్వహిస్తున్న ఒక ఫేక్ అకౌంట్‌లోని పోస్టులను పట్టుకుని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా ప్రస్తావించడం కన్నా దౌర్భాగ్య పరిస్థితి మరొకటి లేదని ఎద్దేవా చేశారు.

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (సింగిడి)** 2

## గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి హైడ్రా వ్యతిరేకం కాదు

**సోషల్ మీడియాలో దుష్ప్రచారాలు నమ్మొద్దు**

**హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెల్లడి** 2

## హైదరాబాద్‌లో బుల్లెట్ ట్రైన్ హబ్

**ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల**

**796.28 ఎకరాల భూమి కేటాయింపు** 2

తెలంగాణ రవాణా రంగాన్ని సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రతిష్ఠాత్మక అడుగులు వేస్తున్నాయి. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న బుల్లెట్ ట్రైన్ హబ్‌కు మొదటి అడుగు పడింది.

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (సింగిడి)**

ప్రభాతనవ సింగిడి తెలుగు దినపత్రిక
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శుక్రవారం 11 సెప్టెంబర్ 2026

# ట్రంప్ డివిడెండ్

**రిపబ్లికన్లు గెలిస్తే ప్రతి అమెరికన్‌కు 5 వేల డాలర్లు**
**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన హామీ**



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 10 (సింగిడి):**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్ర చర్చనీయాంశమైన ప్రకటన చేశారు. రాబోయే మధ్యంతర ఎన్నికల్లో తమ రిపబ్లికన్ పార్టీ విజయం సాధించి, కాంగ్రెస్‌లోని ఉభయ సభలపై నియంత్రణ సాధిస్తే.. దేశంలోని ప్రతి వయోజన అమెరికన్ పౌరుడికి 5,000 డాలర్లు (సుమారు రూ.4.2 లక్షలు) ఇస్తామని డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ సంక్షేమాన్ని ఆయన "ట్రంప్ డివిడెండ్ గా పేర్కొన్నారు. టెక్సాస్‌లోని డల్లాస్‌లో జరిగిన రిపబ్లికన్ పార్టీ మధ్యంతర ఎన్నికల సభలో డొనాల్డ్ ట్రంప్ ఈ ప్రతిపాదన చేశారు. డెమొక్రాట్లతో పోటీలో రిపబ్లికన్ పార్టీ ఓటింగ్ సర్వేల్లో వెనుకబడి ఉన్న నేపథ్యంలో, ఓటర్లను ఆకర్షించేందుకు ట్రంప్ ఈ అసాధారణ హామీ ఇచ్చినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ సభలో ట్రంప్ మాట్లాడుతూ.. "అమెరికా అద్భుతమైన ఆర్థిక విజయం కారణంగా ఈ హామీ నేను మాత్రమే చేయగలను. నవంబర్ 3న జరిగబోయే ఎన్నికల్లో రిపబ్లికన్లు గెలిస్తే, మీరు మాకో కలిసి గెలుస్తారు. మీకు 5,000 డాలర్లు లభిస్తాయి. నవంబర్ బ్యాలెట్‌లో నేను స్వయంగా పోటీలో ఉన్నట్లే భావించి ఓటు వేయండి" అని మద్దతుదారులను కోరారు.ట్రంప్ డివిడెండ్ హామీ అమలుపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం అమెరికాలో దాదాపు 27 కోట్ల మంది వయోజనులు ఉన్నారు. ప్రతి ఒక్కరికీ 5,000 డాలర్ల చొప్పున పంపిణీ చేయాలంటే ప్రభుత్వానికి సుమారు 1.35 ట్రిలియన్ డాలర్లు ఖర్చవుతుందని విశ్లేషకులు తెలిపారు. అయితే, ఈ భారీ మొత్తం నిధులు ఎక్కడి నుంచి వస్తాయనే దానిపై ట్రంప్ స్పష్టత ఇవ్వలేదు. "మన దేశం చాలా డబ్బు సంపాదిస్తోంది" అని మాత్రమే ట్రంప్ చెప్పారు. ఈ చెల్లింపు ప్రక్రియ ఎలా పని చేస్తుంది, అసలు ఇలా డబ్బులు పంచడం చట్టబద్ధమేనా అనే అంశాలపై ఇంకా స్పష్టత లేదు.మధ్యంతర ఎన్నికల్లో గెలవడం కోసం ట్రంప్ బహిరంగంగా ఓట్లకు లంచం ఇస్తున్నారని విమర్శకులు, సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తున్నాయి. "రిపబ్లికన్లకు ఓటు వేస్తే 5,000 ఇస్తానంటూ డివిడెండ్ ఎంతమాత్రం కాదు.. అది పక్కా లంచం" అని ఎక్స్ వేదికగా నెటిజన్లు ఆరోపించారు. ప్రముఖ అమెరికన్ స్టాక్ బ్రోకర్ పీటర్ షిఫ్ స్పందిస్తూ.. "ఓట్లను ఆకట్టుకోవడానికి ట్రంప్ ఈ లక్ష్యమైన ప్రతిపాదన చేశారు. ఈ ఉచిత డబ్బు కోసం ఫెడరల్ రిజర్వ్ భారీగా కరెన్సీ నోట్లను ముద్రించాల్సి వస్తుంది. ఫలితంగా బైడెన్ హయాంలో చూసిన దానికంటే అతి తీవ్రమైన ద్రవ్యోల్బణం వచ్చే ప్రమాదం ఉంది" అని హెచ్చరించారు. ఓట్ల కోసం ట్రంప్ చేసిన ఈ 1 ట్రిలియన్ డాలర్ల వాగ్దానం ఇప్పుడు అమెరికా వ్యాప్తంగా తీవ్ర రాజకీయ, ఆర్థిక చర్చకు దారితీసింది.

## టీవీకే పార్టీకి అధికారిక గుర్తింపు



ఇటీవల జరిగిన 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే కనబరిచిన అద్భుత పనితీరు ఆధారంగా కేంద్ర ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది. తొలిసారి ఎన్నికల బరిలో నిలిచిన టీవీకే, మొత్తం 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 108 స్థానాలను కైవసం చేసుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. రాష్ట్రవ్యాప్తంగా పోలైన ఓట్లలో 34.92 శాతం సాధించి తన సత్తా చాటింది. ఎన్నికల నిబంధనల ప్రకారం, ఒక పార్టీకి రాష్ట్ర పార్టీ హోదా దక్కాలంటే కనీసం 6 శాతం ఓట్లతో పాటు రెండు అసెంబ్లీ స్థానాలు గెలవాలి లేదా మొత్తం ఓట్లలో 8 శాతం సాధించాలి. టీవీకే ఈ నిబంధనలను సునాయాసంగా అధిగమించి ఈ గుర్తింపును సొంతం చేసుకుంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీవీకేకు 'విజిల్'ను ఉమ్మడి గుర్తుగా ఈసీ కేటాయించగా, ఎన్నికల్లో సాధించిన ఘన విజయం నేపథ్యంలో ఇప్పుడు అదే గుర్తుకే శాశ్వతంగా ఖరారు చేసింది. తాజా గుర్తింపుతో భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ టీవీకే ఇదే గుర్తుపై పోటీ చేసే అవకాశం లభించింది. తమిళనాడులో ఇప్పటికే గుర్తింపు పొందిన డీఎంకే, ఏఐఏడీఎంకే, సీపీఐ, వీసీకే, నామ్ తమిళర్ కట్చి, డీఎండీకే వంటి పార్టీల సరసన ఇప్పుడు టీవీకే కూడా చేరింది. ఫలితంగా రాష్ట్రంలో గుర్తింపు పొందిన పార్టీల సంఖ్య ఏడుకు చేరుకుంది. ఈ పరిణామం తమిళ రాజకీయాల్లో టీవీకేను ఒక ప్రధాన శక్తిగా ఆవిష్కరించింది.

## లడఖ్ కు త్వరలోనే ప్రత్యేక హోదా

లడఖ్‌కు రాజ్యాంగ పరిరక్షణలు కల్పించడం, ఎన్నికైన మండలిని ఏర్పాటు చేసే ప్రక్రియను కేంద్ర హోం శాఖ ఇప్పటికే ప్రారంభించిందని ఆయన చెప్పారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 371 నిర్దిష్ట రాష్ట్రాల ప్రత్యేక ప్రాంతీయ, సామాజిక అవసరాలను తీర్చడానికి తాత్కాలిక, పరివర్తన, ప్రత్యేక అధికారాలను అందిస్తుంది. "మేము ఒక ప్రత్యేకమైన పాలనా నమూనాపై పనిచేస్తున్నాం... ఇది 'సూర జెనెరిస్' మోడల్, లడఖ్‌లో ఎన్నికైన పాలక మండలి ఉంటుంది, కానీ ఇది శాసనసభ ఉన్న కేంద్రపాలిత ప్రాంతంగానీ లేదా రాష్ట్రంగానీ కాదు" అని కుండా వివరించారు. 'సూరజెనెరిస్' అనేది ఒక ప్రత్యేక పద్ధతిని నిర్వహించడానికి రూపొందించిన ఒక ప్రత్యేకమైన చట్టపరమైన వ్యవస్థ. ఈ లాటిన్ పదానికి 'తనదైన శైలి' లేదా 'ప్రత్యేకమైన' అని అర్థం. లడఖ్ నాయకులతో చర్చలు జరుపుతున్న కేంద్ర ప్రభుత్వ బృందంలో అజీజ్ కుండా భాగస్వామిగా ఉన్నారు. మంగళవారం ఢిల్లీలో ఇరు వర్గాల మధ్య చర్చలు జరిగాయి. ఆర్టికల్ 370 రద్దు చేసిన కేంద్రం జమ్మూ కశ్మీర్, లడఖ్‌గా విభజించి ప్రత్యేక కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రారంభంలో లడఖ్‌లోని ఒక వర్గం కేంద్ర నిర్ణయాన్ని స్వాగతించినప్పటికీ, కాలక్రమేణా అధికారం పాలనకు వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టారు. వారు రాష్ట్ర హోదాతో పాటు రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్ కింద ప్రత్యేక హోదా కావాలని డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఆరో షెడ్యూల్ ప్రకారం భూమి, అడవులు, నీరు, వ్యవసాయంపై చట్టాలు చేసే అధికారాలతో స్వయంప్రతిపత్తి కలిగిన స్థానిక కౌన్సిళ్లను ఏర్పాటు చేయవచ్చు. ఇది ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధిలో స్థానిక సమాజాలకు ప్రత్యక్ష భాగస్వామ్యాన్ని అందిస్తుంది. గతేడాది లో భద్రతా బలగాలు, పౌరుల మధ్య జరిగిన ఘర్షణల్లో నలుగురు మరణించగా, పలువురు గాయపడ్డారు. ఈ హింస తర్వాత సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక సహా పదుల సంఖ్యలో ప్రజలను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో మెజారిటీ ప్రజలపై కేసులను ఇప్పటికే ఉపసంహరించుకున్నట్టు ప్రభుత్వం తెలిపింది. చార్జిషీట్ దాఖలైన కేసులపై లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ త్వరలోనే నిర్ణయం తీసుకుంటారని కుండా తెలిపారు.

## పదవి ఇచ్చేది అధిష్ఠానం.. రేవంత్‌రెడ్డి కాదు

మంచి జరిగితే మంచి, చెడు జరిగితే చెడు అని చెప్పడం తన నైజమని వివరించారు. అసెంబ్లీలో సీఎల్పీ సమావేశం అనంతరం ఆయన మీడియా చిట్‌చాట్ నిర్వహించారు. మంత్రి పదవి కోసం రాజీపడేటట్లు ప్రచారం చేస్తున్నారని, కానీ కలిస్తే కాంప్రమైజ్, కలవకపోతే గ్యాప్ పెరిగిందని ప్రచారం చేయడం సరికాదు. మంత్రి పదవి ఇచ్చేది అధిష్ఠానం కానీ రేవంత్‌రెడ్డి కాదని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు.

## ఉద్యోగుల పక్షాన ఉంటా

పీఆర్సీ కమిటీ నివేదిక ఆలస్యం కావడంతో ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనను కూడా జేఏసీ నేతలు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగ సంఘాల నాయకులపై పెరుగుతున్న ఒత్తిడి గురించి కూడా వివరించారు. సమస్యలపై సుదీర్ఘంగా చర్చించిన సీఎం... తాను ఎప్పుడూ ఉద్యోగుల పక్షానే ఉంటానని హామీ ఇచ్చినట్లు 'తెలంగాణ రెవెన్యూ ఎంప్లాస్ సర్వీసెస్ అసోసియేషన్' (టీజీఆర్ఈఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు కె. గౌతమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రమేశ్ రెడ్డి తెలిపారు. ఆర్ డీఏపై త్వరలోనే ప్రకటన చేస్తామని సీఎం చెప్పినట్లు వారు వెల్లడించారు. పీఆర్సీ కమిటీ నివేదిక కూడా వెంటనే తనకు అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని సీఎం స్పష్టం చేసినట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. సీఎం సానుకూలంగా స్పందించి హామీలు ఇవ్వడంపై టీజీఆర్ఈఎస్ఏ రాష్ట్ర నాయకత్వం హర్షం వ్యక్తం చేసింది. ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని నేతలు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో టీజీఆర్ఈఎస్ఏ గౌరవాధ్యక్షుడు వంగా రవీందర్‌రెడ్డి ఉన్నారు.

# బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టండి

అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనలపై ప్రభుత్వం.. ఫ్లాష్ సర్వే చేయించిందని సీఎం రేవంత్‌రెడ్డి సమావేశంలో తెలిపారు. ఆ సర్వేలో రాష్ట్ర ప్రభుత్వంపై పెద్దగా వ్యతిరేకత కనిపించలేదని.. బదులుగా బీఆర్ఎస్ నేతల వ్యవహారశైలినే ప్రజలు తప్పుబట్టినట్లు తేలిందని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 7వ తేదీన అసెంబ్లీ గేటు వద్ద చోటుచేసుకున్న పరిణామాలు, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వివాదం.. ఎర్రవల్లిలో చోటుచేసుకున్న శుద్ధీకరణ కార్యక్రమం వంటి అంశాలను సీఎం రేవంత్ రెడ్డి ఈ సమావేశంలో ప్రస్తావించినట్లు సమాచారం. ఈ ఘటనలపై ప్రభుత్వం తీసుకున్న చర్యలను కూడా ఎమ్మెల్యేలకు వివరించినట్లు తెలుస్తోంది. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ అసెంబ్లీ కార్యకలాపాలను సజావుగా సాగనివ్వకుండా కుట్ర చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించినట్లు సమాచారం. మాజీ సీఎం కేసీఆర్ అధ్యక్షతన ఫామ్‌హౌస్‌లో సమావేశమై సభను అడ్డుకునే వ్యూహాన్ని రూపొందించారని ఆయన విమర్శించినట్లు తెలుస్తోంది. అధికారం కోల్పోయినప్పటికీ బీఆర్ఎస్ నేతలు తమ అహంకార వైఖరిని మార్చుకోలేదని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించినట్లు సమాచారం. పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధుల పట్ల అనుచితంగా వ్యవహరించారని.. మహిళా పోలీసు అధికారుల ఎదుట టీషర్టులు విప్పడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయని ఆయన ఆరోపించినట్లు తెలుస్తోంది. అలాగే శాసనసభాపతిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని సీఎం పేర్కొన్నట్లు సమాచారం. అసెంబ్లీ వద్ద జరిగిన పరిణామాలను



ఎదుర్కొని ప్రభుత్వానికి మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను రేవంత్‌రెడ్డి అభినందించినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేల పనితీరుపైనా సీఎం రేవంత్‌రెడ్డి సమావేశంలో దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. ప్రజలు అప్పగించిన పదవిని బాధ్యతగా నిర్వహించాలని, అసెంబ్లీ జరిగే అన్ని రోజుల్లో సభ్యులు పూర్తి స్థాయిలో హాజరై చర్చల్లో పాల్గొనాలని సూచించినట్లు తెలుస్తోంది. తమ తమ నియోజకవర్గాలకు సంబంధించిన సమస్యలను సభలో ప్రస్తావించాలని ఎమ్మెల్యేలకు సూచించినట్లు సమాచారం. ఎమ్మెల్యేల వ్యక్తిగత పనితీరు, ప్రవర్తన భవిష్యత్ రాజకీయ విజయాలపై ప్రభావం చూపుతుందని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించినట్లు తెలుస్తోంది. మొదటిసారి ఎన్నికైన ఎమ్మెల్యేల ప్రవర్తన రెండోసారి గెలుపుపై ప్రభావం చూపుతుందని.. వ్యక్తిగత పనితీరే గెలుపు, ఓటములను నిర్ణయిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి శాసన సభ్యులకు సూచించారు. కాంగ్రెస్ నుంచి రాజకీయంగా ఎదిగి ప్రస్తుతం ఆ పార్టీపై విమర్శలు చేస్తున్న కొందరు నేతల వ్యవహారశైలిని కూడా సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ అవకాశం ఇవ్వకపోతే సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి వంటి నేతలు రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగేవారా అని ఆయన ప్రశ్నించినట్లు సమాచారం. పోలీసు సిబ్బందిపై జరిగిన ఘటనను ప్రస్తావిస్తూ.. కేటీఆర్‌కు పోలీసు అధికారుల్లో రేవంత్‌రెడ్డి కనిపించినట్లుగా ఉందని, అందుకే వారిపై అంత ఆగ్రహంతో వ్యవహరించారని సీఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేసినట్లు తెలుస్తోంది. తెలంగాణలో నిర్వహించిన కుల గణన దేశానికి రోల్ మోడల్‌గా నిలిచిందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నట్లు సమాచారం. తెలంగాణ నమూనాలో దేశవ్యాప్తంగా కులగణన చేపట్టేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సూచించినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో కులగణన ద్వారా వచ్చిన అంశాలను జాతీయ స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని.. దీనిపై పార్టీ ప్రజాప్రతినిధులు విస్త తంగా మాట్లాడాలని సీఎం సూచించినట్లు సమాచారం. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) పేరుతో ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించినట్లు సమాచారం. మరోసారి

# కొండల్ రెడ్డికి అక్రమ కేటాయింపులు

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (సింగిడి):**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సోదరుడు కొండల్ రెడ్డికి చెందిన షెల్ కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా రూ.200 కోట్ల విలువైన ఐదెకరాల భూమిని కట్టబెట్టారని, ఈ భూదోపిడీని అసెంబ్లీ వేదికగా ప్రశ్నించినందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను వరుసగా సస్పెండ్ చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. టెస్సరాక్ట సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించిన భూములను పరిశీలించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ నేత హరీశ్ రావు నేత త్వంలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బ ందం క్షేత్రస్థాయికి చేరుకుంది. కొండల్ రెడ్డికి అనుకూలంగా ప్రభుత్వం ఈ భూములను కట్టబెట్టిందని ప్రధానంగా ఆరోపిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, వివాదాస్పద భూములను స్వయంగా పరిశీలించేందుకు తుక్కుగూడ పరిసర ప్రాంతాలకు భారీ కాన్వారుతో చేరుకోవడంతో ఒక్కసారిగా అక్కడ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ పరిశీలన పర్యటనలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు. చేతుల్లో ప్లకార్డులు, భారీ బ్యానర్లు పట్టుకుని నేతలు ఆందోళన నిర్వహించారు. ప్రజాధనంతో ముడిపడి ఉన్న విలువైన ప్రభుత్వ భూములను నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ వ్యక్తులకు కేటాయించారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై వారు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ సంఘటనా స్థలంలో నిరసన చేపట్టారు. ఈ భూముల అంశం అసెంబ్లీలోనూ తీవ్ర గందరగోళానికి దారితీసింది. సభలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నంలో భాగంగా పోడియం వద్దకు దూసుకెళ్లిన బీఆర్ఎస్ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాలను ఖండిస్తూ పోడియం వద్ద పేపర్లు చింపి పైకి ఎగురవేయడంతో సభలో గందరగోళం తలెత్తింది. సభ్యుల ఆందోళన అదుపు తప్పడంతో స్పీకర్/చైర్మన్ జోక్యం చేసుకుని, సభా మర్యాదలను కాపాడేందుకు మార్షల్స్‌ను రంగంలోకి దించాలని ఆదేశాలు జారీ చేశారు. అసెంబ్లీలో నిరసనల అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన కోసం కేటీఆర్, హరీశ్ రావు నేత త్వంలోని ఎమ్మెల్యేలు తుక్కుగూడలోని టెస్సరాక్ట సైట్‌కు చేరుకోవడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు పేరుతో జరుగుతున్న భూకేటాయింపులపై పూర్తిస్థాయి వాస్తవాలను ప్రజల ముందుకు తెస్తామని, ఈ అంశంపై న్యాయపరమైన, ప్రజా పోరాటం కొనసాగిస్తామని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు. నాయకుల రాకతో స్థానిక పరిసరాల్లో భారీగా మోహరించిన పోలీసులు శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు. పర్యవేక్షించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రోజుకు 18 గంటలు పనిచేస్తున్నానని నిత్యం చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి, ఆ సమయాన్నంతా తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం కాకుండా తన సొంత సోదరులు, బినామీ షెల్ కంపెనీల లబ్ధి కోసమే కేటాయిస్తున్నారని ఎద్దేవా చేశారు. కేవలం రూ. లక్ష మూలధనంతో నడిచే కంపెనీకి ఐదెకరాల విలువైన భూమిని ఎలా కేటాయిస్తారని కేటీఆర్ నిలదీశారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ఎవరైనా కేవలం లక్ష రూపాయలతో స్టార్టప్ పెడితే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాగే వందల కోట్ల విలువైన భూములు ఇస్తుందా.. అని సూటిగా ప్రశ్నించారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ ఇజ్రాయెల్ వ్యాపార భాగస్వామ్యాలపై ప్రధాని మోదీని ప్రశ్నిస్తుంటే, ఇక్కడ తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రేవంత్ రెడ్డి సోదరుడి కోసం 'ఇజ్రాయెల్ ఇన్నోవేషన్' సంస్థతో ఒప్పందాలు కుదుర్చుకుని ఏరోస్పేస్, డిఫెన్స్ వెంచర్ల పేరుతో భూములు కొల్లగొడుతోందని ఆరోపించారు. నెలకు రూ.4,000 పింఛన్, మహిళలకు రూ.2,500, నిరుద్యోగ భ తి ఇస్తామని హామీ ఇచ్చి ప్రజలకు మొండిచేయి చూపించిన కాంగ్రెస్, సీఎం సొంత తమ్ముళ్లకు మాత్రం అద్భుతమైన ఉపాధి, వందల కోట్ల ఆస్తులు కట్టబెడుతోందని దుయ్యబట్టారు. ఈ భారీ భూ కుంభకోణంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి నిజాయతీ ఉంటే తక్షణమే ప్రవర్తన, పత్రాలపై ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలతో సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను వెలికితీసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత గ్రామం కొండారెడ్డిపల్లి సమీపంలోనే రైతులు కరెంట్ కోసం రోడ్డెక్కడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిలువెత్తు నిదర్శనమనిమాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లి సమీపంలోని శ్రీశైలం--హైదరాబాద్ జాతీయ రహదారిపై రైతులు మెరుపు ధర్నాకు దిగడం, ట్రాక్టర్లతో రాస్తారోకో చేయడం ప్రభుత్వ వైఫల్యానికి అద్దం పడుతూ రేవంత్

## పంచాయతీరాజ్ బిల్లుకు ఆమోదం

ప్రస్తుతం గ్రామ పంచాయతీలు తమ సొంత ఆదాయ వనరుల ద్వారా సమకూర్చుకునే నిధులను ప్రభుత్వ ట్రెజరీ ఖాతాలో జమ చేయాల్సి వస్తోంది. ఆ తర్వాత గ్రామ అవసరాలకు ఆ నిధులను వినియోగించుకోవాలంటే ట్రెజరీ ద్వారా నిధులను నిర్దిష్టమైన ప్రక్రియ ద్వారా డ్రా చేసుకోవాల్సి ఉంటుంది. అనుమతులు, అవసరమైన పత్రాల వల్ల కొన్నిసార్లు నిధుల వినియోగంలో ఆలస్యం జరుగుతోంది. కేంద్ర, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ నిధులను బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్లుగానే జీపీ సొంత ఆదాయం కూడా బ్యాంకు ఖాతాలో జమ అయ్యేలా చట్టాన్ని సవరిస్తున్నట్లు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. గ్రామపంచాయతీల కోసం ప్రతీ నెల ప్రభుత్వం 50 కోట్ల రూపాయలు వెచ్చిస్తోందని సీతక్క తెలిపారు. ఎన్నికలు జరగకపోవడంతో నిలిచిపోయిన కేంద్ర నిధుల్లో ఇంకా రూ.619 కోట్లు రావాల్సి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన వీజీజీ రాంజీ పథకం వల్ల 2 వేల కోట్ల అదనపు భారం పడుతున్నప్పటికీ ఇంకుడు గుంతలు, పంట కుంటలు, ఊట కుంటలను నిర్మిస్తున్నామని తెలిపారు. హ్యామ్ విధానంలో వేల కిలోమీటర్ల గ్రామీణ రోడ్లను నిర్మిస్తున్నామని సీతక్క తెలిపారు.పంచాయతీ రాజ్ చట్ట సవరణపై మంత్రి సీతక్క వివరణ ఇచ్చారు. రెండేళ్లుగా 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయన్న మంత్రి సీతక్క ఎన్నికల తర్వాత పెండింగ్ నిధులు ఇప్పుడిప్పుడే విడుదల అవుతున్నాయని తెలిపారు. కేంద్రం నుంచి దాదాపు రూ.700 కోట్ల పెండింగ్ నిధులు రావాల్సి ఉందని, స్టాంపుడ్యూటీని 2018లోనే తొలగించటం స్థానిక సంస్థలు కొంత సంక్షోభంలో పడ్డాయని చెప్పారు. గ్రామ పంచాయతీలకు ప్రతినెలా రూ.54 కోట్లు విడుదల చేస్తున్నామన్న మంత్రి సర్పంచ్‌లకు పెండింగ్ ఉన్న నిధుల్లో పంచాయతీరాజ్‌శాఖ నుంచి ఏమీ లేవని స్పష్టం చేశారు. ఎంపీ, ఎమ్మెల్యేల ఫండ్స్ పనులు చేసి పంచాయతీరాజ్‌శాఖను అడుగుతున్నారని తెలిపారు. వివాదాల వల్ల ఎన్నికలు జరగని గ్రామాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే నిధులు ఇస్తోందని సభకు వివరించారు. గ్రామపంచాయతీలకు సహకార బ్యాంకుల్లో నిధులు జమచేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. బీజేపీ సభ్యులు పాయల్ శంకర్, పాల్వాయి హరీష్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు విజయ రమణరావు, శంకర్ తదితరులు చర్చలో పాల్గొని సూచనలు ఇచ్చారు.

## హైదరాబాద్‌లో బుల్లెట్ ట్రైన్ హబ్

హైదరాబాద్ మహా నగరాన్ని దేశంలోనే మొట్టమొదటి హైస్పీడ్ బుల్లెట్ ట్రైన్ కనెక్టివిటీ కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో బుల్లెట్ ట్రైన్ హబ్‌ను శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో భారీ ఇంటిగ్రేటెడ్ మొబిలిటీ హబ్ పేరిట (సమీకృత సమగ్ర రవాణా కేంద్రం) ఏర్పాటు చేయబోతున్నారు. ఈ మెగా మల్టీ మోడల్ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారులు అధికారికంగా ప్రారంభించారు. ఈ భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టు కోసం శంషాబాద్-తుక్కుగూడ ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డును ఆనుకుని ఉన్న బహదూర్‌గూడ పరిధిలో 796.28 ఎకరాల భూమిని సేకరించనున్నారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఈ ప్రక్రియ కోసం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నోటిఫికేషన్ ప్రకారం సేకరిస్తున్న మొత్తం స్థలంలో సర్వే నంబర్లు 28, 62 పరిధిలోని 750 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, మిగిలిన 46.28 ఎకరాలు ప్రైవేటు, పట్టా భూములుగా అధికారులు గుర్తించారు. నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో కలెక్టర్ ముందస్తు అనుమతి లేకుండా ఈ భూముల్లో ఎలాంటి లావాదేవీలు లేదా ల్యాండ్ డెవలప్‌మెంట్ పనులు చేపట్టరాదని రెవెన్యూ యంత్రాంగం స్పష్టం చేసింది. ఈ ప్రతిపాదనలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే 60 రోజుల్లోగా లిఖితపూర్వకంగా తెలియజేయవచ్చని పేర్కొంది. సీఎం రేవంత్ రెడ్డి సరిగ్గా ఆరు నెలల క్రితం తీసుకున్న నిర్ణయం మేరకు ఈ ప్రాంతాన్ని ఎంపిక చేశారు. విమానాశ్రయ రన్‌వేకు అత్యంత సమీపంలో ఉండటం వల్ల భవిష్యత్తులో విమాన ప్రయాణికులు నేరుగా బుల్లెట్ రైలు సేవలను వినియోగించుకోవడానికి వీలవుతుంది. ఈ బహదూర్‌గూడ హబ్ కేంద్రంగా హైదరాబాద్-ముంబయి, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై (వయా అమరావతి) వంటి 3 ప్రధాన హైస్పీడ్ బుల్లెట్ రైలు కారిడార్ల కార్యకలాపాలను నిర్వహించనున్నారు. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నుంచి ముంబయి, బెంగళూరు, చెన్నై నగరాలకు ప్రయాణ సమయం కేవలం 2 గంటలకు తగ్గిపోనుంది.

## గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి హైడ్రా వ్యతిరేకం కాదు



**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (సింగిడి):**
హైదరాబాద్ మహానగరంలో వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై సోషల్ మీడియాలో వస్తున్న ఊహాగానాలు, వ్యతిరేక ప్రచారాలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు. చెరువుల్లో గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి హైడ్రా ఎప్పుడూ వ్యతిరేకం కాదని, తాము పునరుద్ధరణ పనులు చేపడుతున్న చెరువుల వద్ద నిమజ్జనాలకు ఎలాంటి ఆంక్షలు విధించలేదని ఆయన ఫుల్ క్లారిటీ ఇచ్చారు. అసత్య ప్రచారాలను ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నోటిఫై చేసిన నాలుగైదు సున్నితమైన చెరువుల వద్ద మాత్రమే ఆంక్షలు అమలులో ఉన్నాయని తెలిపారు. దేశంలోనే ప్రప్రథమంగా బయో డైవర్సిటీగా గుర్తించిన అమీన్‌పూర్ చెరువు, నేచురల్ వెట్‌ల్యాండ్‌గా రక్షణ పొందిన కాప్రా చెరువులు ఇందులో ఉన్నాయని గుర్తుచేశారు. కాప్రా చెరువులో ప్రస్తుతం నీరు లేనందున అక్కడ ఎవరూ సమస్యలు స ష్టించవద్దని కోరారు. నగరంలోని మిగిలిన అన్ని చెరువులు, జలాశయాల్లో వినాయక నిమజ్జనాలు ఎప్పటిలాగే యథావిధిగా సాగుతాయని స్పష్టం చేశారు. ప్రధాన నీటి వనరులు, చెరువుల పర్యావరణం దెబ్బతినకుండా ఉండేందుకు, భక్తులు, ఉత్సవ కమిటీలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు విస్త తంగా 'బేబీ పాండ్స్' ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హైడ్రా సుందరీకరిస్తున్న చెరువుల వద్ద ఎటువంటి నిషేధాలు లేవని, వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, పర్యావరణ హితంగా నిర్వహించుకునేలా భాగ్యనగర ప్రజలు, ఉత్సవ సమితి ప్రతినిధులు సహకరించాలని కోరారు.

## కాంగ్రెస్ పార్టీ ఫేక్ అకౌంట్లు సృష్టిస్తోంది

తాజాగా సోషల్ మీడియాలో కలకలం రేపుతున్న 'సంధ్యా రావు' అనే ఫేక్ అకౌంట్ వెనుక కాంగ్రెస్ పార్టీ హ్యాండ్లర్లే ఉన్నారని హరీశ్‌రావు ఆరోపించారు. ఆ నకిలీ ఖాతాలో చేసిన వ్యాఖ్యల ఆధారంగా ముఖ్యమంత్రి శాసనసభను తప్పుదోవ పట్టించారని, దీనికి బాధ్యత వహిస్తూ రేవంత్ రెడ్డి వెంటనే సభకు, ప్రజలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సదరు ఫేక్ అకౌంట్‌పై తక్షణమే సమగ్ర విచారణ జరిపించి, దాని వెనుక ఉన్న ముఠాను అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అసెంబ్లీని తప్పుదోవ పట్టించిన అంశంపై ముఖ్యమంత్రిపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇస్తామని... అలాగే ఈ పరువు నష్టం, నకిలీ ఖాతాల వ్యవహారంపై పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేయనున్నట్లు స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి మార్షల్స్‌తో మమ్మల్ని ఎత్తడం కాదు.. మోటార్లు ఆన్ చేసి రైతులకు నీళ్లు ఎత్తు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు సవాల్ విసిరారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అదే మహబూబ్ నగర్ జిల్లాలో భీమా ప్రాజెక్టులో 3 మోటార్లు ఉంటే ఒక్క మోటార్ మాత్రమే నడుపుతున్నారు. నికర జలాల కేటాయింపులున్న ప్రాజెక్ట భీమా. కానీ ఏ జలాల కేటాయింపులు లేని, బేసిన్ లేని వెలిగొండకి మాత్రం చంద్రబాబు నీళ్లు తీసుకుపోతడు.. బేసిన్లు ఉన్న నికర జలాల కేటాయింపులు ఉన్న అన్ని అనుమతులున్న భీమా మోటార్లు ఎందుకు నడపడం లేదు రేవంత్ రెడ్డి.. ఇదేనా నీకు పాలమూరు మీద ఉన్న ప్రేమ అని హరీశ్ రావు అడిగారు.కరువు పీడిత ప్రాంతం నడిగడ్డ, గద్వాల, అలంపూర్ ప్రాంతానికి నీళ్లిచ్చే నెట్టంపాడులో 4 మోటార్లు ఉంటే ఒకటే నడుపుతున్నారన్నారు హరీశ్ రావు . కోయిల్ సాగర్‌లో 3 మోటార్లు ఉంటే ఒక్కటే నడుపుతున్నారు. రెండు మోటార్లు నడిపితేనే కోయిల్ సాగర్ నిండడానికి 3 నెలలు పడుతుంది.. ఇప్పుడు నువ్వు ఒక్కటే మోటార్ నడిపితే అది నిండడానికి 6 నెలలు పడుతుంది. 6 నెలల వరకు జూరాల ప్రాజెక్టులో నీళ్లు ఉంటాయా.. కోయిల్ సాగర్ నిండుతదా అని ప్రశ్నించారు. నీళ్లు ఉండి మోటార్లు నడపలేని చాతకాని ముఖ్యమంత్రిని నిన్నే చూస్తున్నానన్నారు. బీఆర్ఎస్ ఉన్నప్పుడు 2014-15 నుండి 2023-24 వరకు ప్రతి సంవత్సరం వచ్చిన క ష్ణ నది నీళ్లలో 45 శాతం నుండి 30 శాతం ఎత్తామని.. కాంగ్రెస్ ప్రభుత్వం 2024-25లో 28.49 శాతం నీళ్లు ఎత్తారు, 2025-26లో 25 శాతం మాత్రమే ఎత్తారని హరీశ్ రావు తెలిపారు. దీన్ని బట్టి ఎవరు తెలంగాణ ప్రయోజనాలు కాపాడారో అర్థం కావడం లేదు. తెలంగాణ ఏర్పడిన తర్వాత క ష్ణ జలాల్లో అతి తక్కువ సాగు నీరు వాడుకున్నది ఈ మూడు సంవత్సరాలలోనేనన్నారు.



## రూ.2 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుకు రూ.లక్ష లంచం

సచివాలయ ఆవరణలోని దేవాలయం సమీపంలో లంచం తీసుకుంటుండగా ఓ ఉద్యోగిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు తెలుస్తోంది. ఈ లంచం తీసుకోవడంలో మరో ఉద్యోగి హస్తం కూడా ఉన్నట్లు గుర్తించిన ఏసీబీ అధికారులు.. వారిద్దరినీ అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. వారిద్దరినీ నాంపల్లిలోని ఏసీబీ కార్యాలయానికి తరలించి.. విచారిస్తున్నారు. సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.2 లక్షల ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కు కోసం బాధితుడు సంబంధిత ఉద్యోగులను సంప్రదించినట్లు తెలుస్తోంది. ఈ సమయంలో చెక్కును అందించేందుకు రూ.లక్ష లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీకి ఫిర్యాదు అందింది. బాధితుడి ఫిర్యాదును స్వీకరించిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో ట్రాప్ నిర్వహించినట్లు సమాచారం. ఇందులో భాగంగా సచివాలయ ఆవరణలోని దేవాలయం వద్ద బాధితుడి నుంచి లంచం తీసుకుంటున్న సమయంలో ఉద్యోగిని అధికారులు పట్టుకున్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో సచివాలయంలోని సీఎంఆర్ఎఫ్ విభాగానికి సంబంధించిన సెక్షన్ ఆఫీసర్ వినోద్‌తో పాటు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి రాఘవేంద్రను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో మొదటి విడతగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి రాఘవేంద్ర రూ.5 వేల నగదు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత మిగిలిన మొత్తంలో భాగంగా రూ.లక్ష తీసుకునే సమయంలో సీనియర్ అసిస్టెంట్/సెక్షన్ ఆఫీసర్ స్థాయి ఉద్యోగి ఏసీబీ ట్రాప్‌లో చిక్కినట్లు తెలుస్తోంది. ఈ లంచం వ్యవహారంలో ఎవరి ఆదేశాల మేరకు డబ్బులు డిమాండ్ చేశారు.. ఇంకా ఎవరైనా ఉద్యోగులు, అధికారులు ఇందులో భాగస్వాములుగా ఉన్నారా.. అనే కోణాల్లో ఏసీబీ అధికారులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ట్రాప్ తర్వాత ఏసీబీ అధికారులు సీఎంఆర్ఎఫ్‌కు సంబంధించిన విభాగంలో సోదాలు నిర్వహించినట్లు తెలుస్తోంది. బాధితుడి దరఖాస్తు, సీఎంఆర్ఎఫ్ మంజూరు ప్రక్రియ, చెక్కు విడుదలకు సంబంధించిన ఫైళ్లు, ఉద్యోగుల పాత్రపై వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. లంచం డిమాండ్ వెనుక మరెవరైనా రెగ్యులర్ అధికారులు ఉన్నారా అనే అంశంపైనా దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ట్రాప్‌లో పట్టుబడిన ఇద్దరు ఉద్యోగులను నాంపల్లిలోని ఏసీబీ కార్యాలయానికి తరలించి విచారిస్తున్నట్లు సమాచారం. లంచం డిమాండ్‌కు సంబంధించిన పూర్తి వివరాలు, డబ్బుల లావాదేవీలు, సీఎంఆర్ఎఫ్ ఫైల్ ప్రాసెసింగ్‌లో వారి పాత్ర వంటి అంశాలపై అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత కీలకమైన కార్యాలయమైన సచివాలయంలోనే సీఎంఆర్ఎఫ్‌కు సంబంధించిన వ్యవహారంలో లంచం తీసుకుంటూ ఉద్యోగులు పట్టుబడినట్లు వార్తలు రావడం ఉద్యోగ వర్గాల్లో చర్చకు దారితీసింది. పేదలు, అనారోగ్యంతో బాధపడుతున్నవారికి ఆర్థిక సాయం అందించేందుకు ఉద్దేశించిన ముఖ్యమంత్రి సహాయ నిధికి సంబంధించిన ప్రక్రియలో లంచం డిమాండ్ చేశారన్న ఆరోపణలు రావడం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.

## స్పీకర్‌ను దూషించిన వారి సభ్యత్వం రద్దు చేయాలి



### బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీల తీరుపై భగ్గుమన్న కాంగ్రెస్ శ్రేణులు

**నాచారం, సెప్టెంబర్ 10(సింగిడి):** అసెంబ్లీ స్పీకర్ ను దూషించిన బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సభ్యత్వాన్ని రద్దు చేయాలని పలువురు కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. దళితుడైన స్పీకర్ ను ఎలా దూషిస్తారంటూ ప్రశ్నించారు. కేసులు నమోదు చేయడం, సభ నుంచి సస్పెషన్ చేయడం కాదు ఏకంగా సభ్యత్వాన్నే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి పిలుపు మేరకు నాచారం సర్కిల్ పరిధిలోని నాచారం, మల్లాపూర్, శక్తిసాయినగర్, హెచ్ఎంటీనగర్, హెచ్‌బీ కాలనీ డివిజన్ లలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు స్పీకర్ పట్ల వ్యవహరించిన తీరుకు నిరసనగా ఆందోళన కార్యక్రమాలను చేపట్టారు. దళితుడైన స్పీకర్ ప్రసాద్‌కుమార్ పట్ల దురుసుగా, అమార్యదగా, దుర్భాషలాడిన ఎమ్మెల్సీలు తాత మధు, నవీన్‌కుమార్‌రెడ్డిల సభ్యత్వాన్ని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కేవలం ఈ సెషన్ సమావేశాలకు మాత్రమే రాకుండా సస్పెండ్ చేయడం సరైన చర్య కాదన్నారు. దీనికి పూర్తి బాధ్యత కేటీఆర్, హరీష్‌రావునే వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాచారం డివిజన్, హెచ్ఎంటి నగర్ డివిజన్, మల్లాపూర్ డివిజన్, శక్తిసాయి నగర్ డివిజన్, హెచ్ బి కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రూ. 21 కోట్లతో తెల్లాపూర్‌లో ఆర్‌యూబీ

- మెదక్ ఎంపీ రఘునందన్ రావు
- రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవతో భేటీ
- ఈ నెలాఖరు నుంచే తెల్లాపూర్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు
- నాగులపల్లి, ఆర్‌సీపురం వరకు ఎంఎంటీఎస్ విస్తరించాలని వినతి



**రామచంద్రపురం, సెప్టెంబర్ 10(సింగిడి):** పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని తెల్లాపూర్‌లో రూ. 21 కోట్ల వ్యయంతో రైల్వే రోడ్ అండర్ బ్రిడ్జి నిర్మాణాన్ని మంజూరు చేయించినట్లు మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు వెల్లడించారు. సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ (జీఎం) సంజయ్ కుమార్ శ్రీవాత్సవతో ఎంపీ భేటీ అయ్యారు. ఆర్‌యూబీ మంజూరు చేసినందుకు జీఎంకు కృతజ్ఞతలు తెలిపిన అనంతరం, మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పలు రైల్వే సమస్యలు, కొత్త ప్రతిపాదనలపై ఆయనతో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు విలేకరులతో మాట్లాడుతూ.. మెదక్ లోక్‌సభ స్థానం పరిధిలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. ఇందులో భాగంగానే తెల్లాపూర్, భెల్ ప్రాంత ప్రజలు దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న ఆర్‌యూబీ సమస్యను పరిష్కరించామని, అతి త్వరలోనే పనులు మొదలు పెడతామని స్పష్టం చేశారు. పనుల ప్రారంభానికి సంబంధించి శనివారం రైల్వే, రెవెన్యూ తదితర సంబంధిత శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో స్థల పరిశీలన నిర్వహిస్తామని తెలిపారు. ఈ పరిశీలనకు ప్రజాప్రతినిధులు, స్థానిక అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. తెల్లాపూర్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా నూతనంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జిని కూడా మంజూరు చేయించినట్లు ఎంపీ తెలిపారు. ఈ నెలాఖరు నుంచే దీని నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని, దీంతో తెల్లాపూర్, భెల్ వాసుల రవాణా ఇబ్బందులు పూర్తిగా తొలగిపోతాయని పేర్కొన్నారు. పశ్చిమ హైదరాబాద్‌లో జనాభా, వాహనాల రద్దీ విపరీతంగా పెరిగిన దృష్ట్యా ప్రస్తుతం లింగంపల్లి వరకే నడుస్తున్న ప్రతి ఎంఎంటీఎస్ రైలును ఇటు రామచంద్రాపురం, అటు నాగులపల్లి వరకు పొడిగించాలని రైల్వే జీఎంను కోరినట్లు ఎంపీ తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణకు, సామాన్య ప్రయాణికులకు మెరుగైన ప్రయాణ వసతి కల్పించేందుకు ఈ విస్తరణ అత్యంత ఆవశ్యకమని వివరించారు. అయితే ఈ విస్తరణ ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని జీఎం తన దృష్టికి తీసుకువచ్చారని, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఈ ప్రతిపాదనలను రైల్వే శాఖకు పంపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంగ్వరెడ్డి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, తెల్లాపురం డివిజన్ బిజెపి అధ్యక్షుడు రాంబాబు గౌడ్, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులే... సమాజ మార్గ నిర్దేశకులు

- విజ్ఞానమనే ఖని... వెలికి తీయడం ఉపాధ్యాయుల పని
- రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి



**జవహర్ నగర్, సెప్టెంబర్ 10(సింగిడి):** ఉపాధ్యాయులే సమాజ మార్గ నిర్దేశకులని విజ్ఞానం అనే ఖని వెలికి తీయడమే ఉపాధ్యాయుల పని అని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎన్నికైన మేడ్చల్ జిల్లా మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ కు చెందిన గీతాంజలి హై స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ కర్నే సురేందర్ కు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికవ్వగా తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో ఉపాధ్యాయ బహుమతి ప్రధానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి హాజరై ఉత్తమ ఉపాధ్యాయులకు బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధ్యాయులే సమాజానికి మార్గ నిర్దేశకులని, సమాజాన్ని ఉత్తమ మార్గంలో నడిపించాలంటే దానికి సమర్థులైన గురువుల ఉత్తమ బోధనే మార్గం అన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని బాలలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. సమ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, వారి సేవలు భావి తరానికి అందించినప్పుడే నవ భారతం ఏర్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన టిపిటిఎల్ఎఫ్ ప్రతినిధులు జవహర్ నగర్ గీతాంజలి స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సస్పెన్షన్లతో గొంతు నొక్కలేరు.. ప్రజల కోసం చేసే పోరాటాన్ని ఆపలేరు

**బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మెతుకు ఆనంద్**



**వికారాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 10 (సింగిడి):** న్యాయం కోరితే సస్పెండ్ చేస్తారా.. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే సస్పెండ్ చేస్తారా.. హామీలపై నిలదీస్తే సస్పెండ్ చేస్తారా అంటూ బిఆర్ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. ప్రజల సమస్యలను శాసనసభలో ప్రస్తావిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై నిలదీస్తున్న బి ఆర్ ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన అన్నారు. మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసుల వ్యవహారంపై ప్రశ్నిస్తే సస్పెండ్ చేస్తారా ప్రజల సమస్యలపై మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని కోరితే సస్పెండ్ చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనపై చర్చ జరపాలని డిమాండ్ చేయడంతో ఈ విధంగా సస్పెండ్ చేయడం సభామర్యాద కాదని అన్నారు. న్యాయం కోరితే సస్పెండ్ చేసే సాంప్రదాయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించడం విడ్డూరమన్నారు. ఆడబిడ్డలకు న్యాయం చేయమంటే ప్రజా సమస్యలపై మాట్లాడితే ప్రభుత్వ హామీలపై ప్రశ్నిస్తే సస్పెండ్ చేస్తారా అంటూ ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, 6 గ్యారంటీల అమలు, రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, పెండింగ్ హామీలు వంటి అంశాలపై అసెంబ్లీలో సమగ్ర చర్చ జరగాలని బి ఆర్ ఎస్ డిమాండ్ చేస్తోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను పూర్తి చేసుకున్న నేపథ్యంలో, ఇచ్చిన హామీలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతిపక్షంగా బాధ్యతని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా విమర్శలు నిరసనలు చేపట్టిందని అన్నారు. అదేవిధంగా 22ఏ అంశంపై చర్చకు అవకాశం కల్పించాలని కోరుతున్న సమయంలో కూడా ప్రతిపక్ష సభ్యుల గొంతు నొక్కే ప్రయత్నం చేయడం సరికాదని ఆయన అన్నారు. ఇటీవల అసెంబ్లీ వద్ద జరిగిన పరిణామాలపై మహిళా ప్రజా ప్రతినిధుల పట్ల పోలీసులు అనుచితంగా వ్యవహరించారని ఈ అంశంపై ప్రభుత్వం నివేదిక కోరినట్లు కూడా అసెంబ్లీలో ప్రకటించబడిందని అన్నారు. అసెంబ్లీలో ప్రతిపక్షం ఉండేది ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడానికి కాదని ప్రజల తరఫున ప్రశ్నించడానికని అన్నారు. ప్రజల సమస్యలను ప్రస్తావించే అవకాశం కల్పించడం, ప్రభుత్వ హామీలపై సమాధానం చెప్పడం అధికార పక్షం బాధ్యతని డాక్టర్ మెతుకు ఆనంద్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న బి ఆర్ ఎస్ గొంతును సస్పెన్షన్లతో అణచివేయాలని చూడటం సమంజసం కాదని అన్నారు. ప్రజల గొంతును సస్పెండ్ చేయలేరని అన్నారు. ప్రశ్నించే హక్కును అణచలేరని, హామీలపై సమాధానం చెప్పాల్సిందేనని అన్నారు.

## ఆశా వర్కర్ల అరెస్టులకు వ్యతిరేకంగా రాస్తారోకో



**కొల్చారం సెప్టెంబర్ 10 (సింగిడి):** ఆశా వర్కర్ల సమస్యల పై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని, ఫిక్స్ వేతనం రూ,,18,000/చేయాలని కోరుతూ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సెప్టెంబర్ 8 వ తేదీన ఇందిరా పార్క్ దగ్గర ధర్నా నిర్వహించడానికి శాంతి యుతంగా ర్యాలీగా వెళ్తున్న ఆశా వర్కర్ల పై రాష్ట్ర ప్రభుత్వం లాఠీ ఛార్జీ చేయడం,అక్రమంగా ముందస్తు అరెస్టులు చేయడాన్ని సీఐటీయు జిల్లా కోశాధికారి కే నర్సమ్మ అన్నారు. సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడాలని,ఎన్నికల కంటే ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆశా వర్కర్లు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి ఇందిరా పార్క్ దగ్గర ధర్నా నిర్వహించి,ప్రభుత్వానికి వినతి పత్రం ఇవ్వడానికి కూడా అనుమతించకుండా ప్రభుత్వం మహిళలు అని కూడా చూడకుండా పిడి గుద్దులు గుద్దుతూ,రక్తాలు వచ్చేలా లాఠీ ఛార్జీ చేయడాన్ని ఆమె ఖండించారు. బుధవారం కూల్చారం మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటివరకు ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించడం లో విఫలమైందన్నారు. ఆశా వర్కర్లు గ్రామాలలో ఎన్నో ఆరోగ్య సేవలు అందిస్తున్నారన్నారు. ఆశా వర్కర్లు గత 20 సంవత్సరాల నుంచి పని చేస్తున్నప్పటికి ఇప్పటివరకు ఫిక్స్ వేతనం లేదన్నారు. చాలీ చాలని వేతనాలతో కుటుంబాలను గడుపుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని,లేకపోతే దీర్ఘ కాలిక సమ్మెకు వెళ్తామని ఆమె ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్ లు రాములమ్మ, సబిత,నాగమణి,సంశీల పాల్గొన్నారు.

## భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలి

**జిల్లా కలెక్టర్ హైమావతి**



**సిద్ధిపేట బ్యూరో, సెప్టెంబర్ 10(సింగిడి):** వర్షపు నీటిని సంరక్షించి, భూగర్భ జలాలను పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్మిస్తున్న రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్టక్చర్ పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జలసిరి కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పొలానికి పంటకుంట, ప్రతి గ్రామానికి నీటి సంరక్షణ నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షపు నీరు వృథాగా పోకుండా అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్ని వినియోగించుకుని భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలన్నారు. రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్టక్చర్ గ్రామాల్లో, మండలాల్లో అధికారులు అన్ని ప్రభుత్వ భవనాలలో ఏర్పాటు చెయ్యాలని, తద్వారా ప్రజలు వారి గృహాలలో ఏర్పాటు చేసుకోవడానికి ఒక మెడల్ గా ఉంటుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలను భాగస్వాములను చేస్తూ నీటి సంరక్షణపై విస్తృతంగా అవగాహన కల్పించాలని, చేపట్టిన పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షపు నీటిని సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించవచ్చని తెలిపారు. జలసిరి కార్యక్రమాన్ని ప్రజా భాగస్వామ్యంతో విజయవంతం చేసి జిల్లాను నీటి సంరక్షణలో ఆదర్శంగా నిలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ డిఆర్డిఓ రమేష్, కొండపాక ఎంపీడిఓ వెంకటేశ్వర్లు, దుద్దేడ సర్పంచ్ శివ కుమార్, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భూసేకరణ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలి

**రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి గంగాధర్**



**సిద్ధిపేట బ్యూరో, సెప్టెంబర్ 10 (సింగిడి):** రీజనల్ రింగ్ రోడ్ భూ సేకరణ ప్రక్రియ వేగంగా పూర్తి చేసి, నేషనల్ హైవే అధికారులకు భూమిని అప్పగించాలని రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి గంగాధర్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గజ్వేల్ పట్టణంలోని సమకృత కార్యాలయ సముదాయంలో రీజినల్ రింగ్ రోడ్ భూ సేకరణ నేషనల్ హైవే, రెవెన్యూ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ హైమావతి తో కలిసి రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి గంగాధర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సంయుక్తంగా మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రీజనల్ రింగ్ రోడ్ ను ప్రతిష్టాత్మకంగా తీసుకుందని ఈ పెద్ద ప్రాజెక్టును జిల్లాలో రాయపోల్, వర్గల్, మర్కుక్, గజ్వేల్, జగదేవ్ పూర్ మండలాల ద్వారా వెళ్తుందని భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చెయ్యాలని ఆదేశించారు. ఆర్బిటరేషన్ ప్రక్రియ వేగవంతం చెయ్యాలని, భూ సేకరణలో ఎలాంటి అవరోధాలు ఎదురైన పరిష్కరించుకోవాలని, రీజినల్ రింగ్ రోడ్డు వల్ల కలిగే అభివృద్ధిని ప్రాంత ప్రజలకు తెలపాలని, ఈ మొత్తం ప్రక్రియలను ఆర్డీఓ ఆధ్వర్యంలో తహసిల్దార్లు ఇతర సిబ్బంది భూ సేకరణ యుద్ధ ప్రాతిపదకన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూ సేకరణ పూర్తయిన ప్రాంతంలో డ్రోన్ సర్వే నిర్వహించి రైతులు ఎలాంటి క్రాప్ వేయకుండా భూమిని స్వాధీనం చేసుకోవాలని రెవెన్యూ అధికారులను, భూ సేకరణ పూర్తి చేసిన నేషనల్ హైవే అధికారులకు నియమావళి ప్రకారం వారికి అప్పగించాలని ఆదేశించారు. రీజనల్ రింగ్ రోడ్డు కోసం అప్పగించిన భూమి బాధ్యత పూర్తిగా నేషనల్ హైవే అథారిటీ వారిదేనని ఎల్లపుడు మానిటర్ చెయ్యాలని సూచించారు. రెవెన్యూ, నేషనల్ హైవే అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ చంద్రకళ, నేషనల్ హైవే అధికారులు, ఆయా మండలాల తహశీల్దార్లు, సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఫారెస్ట్ ఎఫ్ఆర్ఓ పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ కు ఫిర్యాదు



**వికారాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 10(సింగిడి):** జిల్లా పరిధిలోని కొడంగల్ నియోజకవర్గం లోని ఉరెంటతాండకు చెందిన గిరిజనులకు సంబందించిన ఇల్లును ఆటవి శాఖ అధికారులు ధ్వంసం చేశారని వారిపై చర్యలు తీసుకోవాలని సీ పి ఎం జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్, జిల్లా కమిటీ సభ్యుడు సతీష్, ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం నియోజ కవర్గంలోని బొంరాస్పేట మండలం ఉరెంట తాండ పంచాయతీ పరిధిలోని గిరిజనులు ఇల్లు కూల్చివేసిన ఫారెస్ట్ పోలీస్ అధికారులపై చర్యలు తీసుకొని, గిరిజనులకు ఇండ్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, 50 లక్షల పరిహారం ఇవ్వాలని కోరారు. పాలకులు 2006 ఫారెస్ట్ అడవి హక్కుల చట్టాన్ని అమలు చేయకుండా గిరిజనులకు సమాచారం, నోటీసులు ఇవ్వకుండా పోలీసు బలగాలు పెట్టి గిరిజనుల నిర్బంధించి జేసీబీలతో 16 పిల్లర్ల ఇల్లు ధ్వంసం చేసిన ఫారెస్ట్, పోలీసు అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇళ్ళు కూల్చడం ప్రభుత్వానికి తగదని జిల్లా అధికారులు ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలన్నారు. రెవెన్యూ, ఫారెస్టు అధికారులు జాయింట్ సర్వే చేసి గిరిజనులకు ఇళ్ల పట్టాలు పట్టా సర్టిఫికెట్స్ ఇవ్వాలని కోరారు. పరిహారం 50 లక్షలు ఇవ్వాలనీ రాష్ట్ర, జిల్లా ఫారెస్టు అధికారులకు మానవహక్కుల కమిషన్ కు మండల జిల్లా అధికారులకు మెమొరాండం ఇచ్చినట్లు తెలిపారు. ఈ గిరిజనల్ల ఇల్లు సమస్య పరిష్కారం చెయ్యని పక్షంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్ జిల్లా కమిటీ సభ్యులు సతీష్ సుదర్శన్, నాయకులు లక్ష్మయ్య నర్సింలు రాములు నాయక్ రవి నాయక్ సుశీల భాయ్ విజయ్ చందు ముకేష్ రుక్మి బాయ్ రమేష్ యాదయ్య దశరథ్ చందు ముకేష్ బై తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా సంబంధిత అధికారులు నిర్మాణాన్ని నిలిపి వేయాలని సూచించినట్లు తెలిసింది. అయినప్పటికీ ఉన్నఫలంగా నిర్మాణం చేయడంతో వారు చర్యలు తీసుకున్నట్లు తెలిసింది.

## రేణుక ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన



**రామచంద్రపురం, సెప్టెంబర్ 10(సింగిడి):** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం, తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఈదుల నాగులపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించతలపెట్టిన రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పటాన్‌చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి హాజరై, వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా భూమి పూజ నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరియాలని, అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఆలయ నిర్మాణానికి తన వంతుగా సంపూర్ణ సహకారం ఎల్లవేళలా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు చేపట్టిన ఈ బృహత్తర కార్యం త్వరితగతిన పూర్తి కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, మాజీ ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కామేశ్వర్, శ్రీపాల్ రెడ్డి, నర్సింగ్, కొమరయ్య, ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## టివిఆర్ విద్యాసంస్థలలో ఘనంగా కాళోజి నారాయణరావు జన్మదిన వేడుకలు

- కాళోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించిన వంశీకృష్ణారెడ్డి





**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 10(సింగిడి):** కాళోజి నారాయణరావు జన్మదిన తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలు టివిఆర్ విద్యాసంస్థలలో ఘనంగా నిర్వహించారు. కాళోజి నారాయణ రావు పుట్టినరోజును తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలు నిర్వహించుటకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించారు. సుభాష్‌రెడ్డి డివిజన్ ఎస్ ఆర్ నాయక్ నగర్ లోని సత్యవాణి విద్యానికేతన్ లో, అపురూప కాలనీలోని పివిఆర్ మోడల్ హైస్కూల్లో ను మేనేజింగ్ డైరెక్టర్ టి వంశీకృష్ణ రెడ్డి కాళోజి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ వైతాళికుడు, కవి పితామహులు కాళోజి నారాయణరావు 112 వ జన్మదిన వేడుకలను తెలంగాణ భాషా దినోత్సవం గా ఆనాటి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. నాటినుండి తెలంగాణ యాస, భాష, బ్రతుకు, గౌరవం, భాషలో ఇమిడి ఉన్న గొప్పతనాన్ని వెలికి తీసిన తెలంగాణ కవి పితామహులు కాళోజి నారాయణరావు అని పేర్కొన్నారు. ఉద్యమ స్ఫూర్తిని తనదైన రచన శైలితో కలముగలంతో శత్రువులపై కవిత్వాన్నిసంధించి పుట్టుక నీది-చావు నీది- బ్రతుకంతా దేశానిది అని ప్రాంతేతరులు దోపిడి చేస్తే పోలిమేర దాకా తన్ని తరుముదాం, ప్రాంతం వాడే దోపిడి చేస్తే ప్రాంతంలోనే పాతర వేస్తాం " అని యావత్ తెలంగాణ యువతను, ప్రజానీకాన్ని , జాగృతి పరిచిన మహనీయుడు కవి కాళోజి చురుకలు పెట్టే కవిత్వంతో ""అన్నపు రాశులు ఒకచోట - ఆకలి మంటలు ఒకచోట హంస తూలికలు ఒకచోట - అలసిన దేహాలు ఒకచోట " అని తనదైన కవిత్వంతో ప్రజాకవి కాళోజీ తెలంగాణ ఉద్యమ ఊపిరై చివరకు 2002 నవంబర్ 13 తేదీన తెలంగాణ ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసుకుని అనంత లోకాలకు వెళ్లాడు. అలాంటి మహాకవి జన్మదినాన్ని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకోవడం ఆనందదాయకమని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం జయరాజ్ విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. టివిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ టి కోటి రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ సూర రవిచంద్రా రెడ్డి, దీప్తి రెడ్డి తెలంగాణ భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

# 9 వ జాతీయ పోషణమాసం

**మా అంగన్వాడి మా బాధ్యత**

**ఐసిడిఎస్ సూపర్వైజర్ సత్యమ్మ**





**ఉప్పల్, సెప్టెంబర్ 10(సింగిడి):** భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం సెప్టెంబర్ నెలను జాతీయ పోషణ మాసంగా నిర్వహిస్తుంది. సెప్టెంబర్ 9 2026 నా కేంద్ర మహిళా,శిశు వికాస శాఖ మంత్రి అన్నపూర్ణా దేవి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వారణాసిలో ఈ 9వ జాతీయ పోషణ మాసాన్ని అధికారికంగా ప్రారంభించారు. రాష్ట్రంలో సీతక్క మంత్రి ప్రారంభించారు. జాతీయ పోషణ మాసం ప్రధాన నినాదం మన అంగన్వాడి మన బాధ్యత గా ఈ ప్రోగ్రాం బుధవారం బయన్న గూడా బోడుప్పల్ 1శ్రీశీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసిడిఎస్ సూపర్వైజర్ సత్యమ్మ పాల్గొన్నారు. అనంతరం వారు గర్భిణీ స్త్రీలతో ప్రతిజ్ఞ చెప్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఏడాది పోషణ్ అభియాన్ లో ప్రధానంగా ఐదు అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. 1, ఆహార వైవిధ్యం ప్రోటీన్ ప్రాముఖ్యత 2, తాజా వేడి వండిన భోజనం 3, సామాజిక యజమాన్యం, జవాబుదారితనం 4, తొలి బాల్య వికాసం 5, ప్రధానమంత్రి మాతృ వందన యోజన కార్యక్రమం 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తల్లుల ప్రత్యేక ఆరోగ్యం పై ప్రచారం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు పిల్లల రోజువారీ భోజనంలో తృణధాన్యాలు, చిరుధాన్యాలు మిల్లెట్స్ పప్పుధాన్యాలు,పాలు, గ్రుడ్లు,ఆకుకూరలు చేర్చడం ద్వారా తగినంత ప్రోటీన్ అందేలా చూడటం. అంగన్ వాడీ కేంద్రాలలో స్థానిక చిరుధాన్యాలు, కాలానుగుణ కూరగాయలతో తయారు చేసిన శుభ్రమైన, వేడి భోజనాన్ని లబ్దిదారులకు నిరంతరం అందించడం. బిడ్డ జీవితంలోని మొదటి 1,000 రోజులలో లభించే పోషణ, వారి శారీరక, మానసిక మరియు మేధో వికాసానికి ఎలా పునాది వేస్తుందో అవగాహన కల్పించడం. గర్భిణీ స్త్రీలకు ఆర్థిక పోషకాహార మద్దతునిచ్చే 'ప్రధాన మంత్రి మాతృ వందన యోజన కార్యక్రమం 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తల్లుల ఆరోగ్యంపై ప్రత్యేక ప్రచారం నిర్వహించడంఈ కార్యక్రమం ద్వారా దేశంలో పోషకాహార లోపాన్ని పూర్తిగా నిర్మూలించి, సుపోషిత భారత్ సాధించడమే ప్రభుత్వ లక్ష్యం లక్ష్యమని ఈ సందర్భంగా వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ సులోచన గర్భిణి స్త్రీలు తల్లులు తదితరులు పాల్గొన్నారు.

Editorial

ఎడిటోరియల్

# హక్కుల పేరుతో దౌర్జన్యానికి చోటెక్కడ?


## ట్రాన్స్‌జెండర్ల గౌరవం ఎంత ముఖ్యమో... ప్రజల భద్రత, స్వేచ్ఛ కూడా అంతే ముఖ్యం

సమాజంలో శతాబ్దాలుగా అణచివేత, వివక్ష, అవమానాలను ఎదుర్కొన్న వర్గాల్లో ట్రాన్స్‌జెండర్ సమాజం ఒకటి. కుటుంబాల నుంచి వెలివేత, విద్యా--ఉపాధి అవకాశాల కొరత, సామాజిక వివక్ష వంటి అనేక సమస్యలను వారు ఎదుర్కొంటున్నారన్నది వాస్తవం. అందుకే వారికి గౌరవంగా జీవించే హక్కు, విద్య--ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ సంక్షేమం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. అయితే ఇక్కడ ఒక కీలకమైన ప్రశ్న ఉంది. ఒక వర్గానికి రాజ్యాంగం, చట్టం హక్కులు కల్పించిందంటే అదే చట్టం ఇతరుల హక్కులను హరించే స్వేచ్ఛను కూడా ఇచ్చిందా? సమాధానం స్పష్టంగా...లేదు. ఎవరైనా వ్యక్తి ట్రాన్స్‌జెండర్ అయినా, పురుషుడైనా, మహిళైనా, ఏ వర్గానికి చెందినవారైనా సరే...ఇతరులపై బెదిరింపులు, బలవంతపు డబ్బు వసూళ్లు, దూషణలు, కుటుంబ పరువు తీస్తామని బెదిరించడం, శారీరక దాడులు చేయడం వంటి చర్యలకు చట్టపరమైన రక్షణ ఉండదు.

భారతదేశంలో ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల హక్కుల రక్షణకు ప్రత్యేక చట్టపరమైన వ్యవస్థ ఉంది. 2019 చట్టం ట్రాన్స్‌జెండర్ వ్యక్తులపై వివక్షను నిరోధించడంతో పాటు వారి సంక్షేమం, జీవనోపాధి, విద్య, ఆరోగ్యం వంటి అంశాలకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని నిర్దేశించింది.

అదే సమయంలో, చట్టంలోని నేర నిబంధనలు కూడా స్పష్టంగా ఉన్నాయి. ట్రాన్స్‌జెండర్ వ్యక్తిపై శారీరక, లైంగిక, మానసిక, మాటల ద్వారా లేదా ఆర్థిక వేధింపులు చేయడం నేరంగా పరిగణించబడుతుంది. అలాగే బలవంతపు లేదా బానిస కార్మికత్వానికి గురిచేయడాన్ని కూడా చట్టం నిషేధిస్తుంది.

ఇక్కడ మరో ముఖ్యమైన విషయం ఉంది. "డబ్బులు అడగడం" మరియు "బలవంతంగా డబ్బులు వసూలు చేయడం" రెండూ ఒకటే కావు. ఎవరికైనా స్వచ్ఛందంగా దానం చేయాలనిపిస్తే అది వేరే విషయం. కానీ డబ్బులు ఇవ్వకపోతే బెదిరించడం, అవమానించడం, ఇంటి విషయాలు బయట పెడతామని భయపెట్టడం, అడ్డుకోవడం లేదా దాడి చేయడం జరిగితే అది సాధారణంగా "దానం అడగడం" అనే పరిధిలో ఉండదు. పరిస్థితిని బట్టి భారతీయ న్యాయ సంహిత (దీఘీ) తదితర క్రిమినల్ చట్టాల కింద కూడా చర్యలు ఉండవచ్చు. అయితే ఇలాంటి ఘటనల్లో "హిజ్రాలు అంటే అందరూ ఇలాగే ఉంటారు" అనే నిర్ణయానికి రావడం కూడా ప్రమాదకరం. కొంతమంది వ్యక్తుల ప్రవర్తనను మొత్తం సమాజానికి ఆపాదించడం ఎంత తప్పో, ట్రాన్స్‌జెండర్ అనే గుర్తింపును




కారణంగా చూపి వారి మీద వచ్చిన ప్రతి ఫిర్యాదును కొట్టిపారేయడం కూడా అంతే తప్పు.

**పోలీసుల స్పందన ఎందుకు ఆలస్యం అవుతోంది?**

కొన్ని సందర్భాల్లో పోలీసులు ఇలాంటి ఫిర్యాదులపై వెంటనే స్పందించకపోతున్నారనే ప్రజల ఆరోపణలు వినిపిస్తాయి. దీనికి ఒక్కటే కారణం ఉందని చెప్పడం సరికాదు. ఫిర్యాదు స్వరూపం, సాక్ష్యాలు, సంఘటన స్థలం, బాధితుల సహకారం, స్థానిక పోలీసుల స్పందన, చట్టపరమైన సెక్షన్ల ఎంపిక వంటి అనేక అంశాలు ప్రభావితం చేస్తాయి.

కానీ ఒక విషయం మాత్రం స్పష్టం...బాధితుడు ఎవరు? నిందితుడు ఎవరు? వారి లింగ గుర్తింపు ఏమిటి? అనే ప్రశ్నలకు అతీతంగా, ఫిర్యాదును చట్ట ప్రకారం స్వీకరించి విచారణ చేయడం పోలీసుల బాధ్యత.

ఇదే కారణంగా కేంద్ర హోంశాఖ కూడా రాష్ట్రాలకు ట్రాన్స్‌జెండర్ వ్యక్తులపై జరిగే నేరాల విషయంలో రక్షణ, విచారణ, ప్రాసిక్యూషన్‌కు చర్యలు తీసుకోవాలని సూచించింది. తెలంగాణలో కూడా ట్రాన్స్‌జెండర్ ప్రొటెక్షన్ సెల్ Pride Place' ఏర్పాటు చేసి, పోలీసు సిబ్బందికి అవగాహన, నైపుణ్యాభివృద్ధి, ఫిర్యాదుల పరిష్కారం వంటి చర్యలు చేపడుతున్నట్లు తెలంగాణ హైకోర్టు రికార్డుల్లో నమోదైంది.

అందువల్ల ప్రశ్న "పోలీసులు హిజ్రాలకు ఎందుకు భయపడుతున్నారు?" అని కాకుండా...

"ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే పోలీసులు ఎందుకు సమానంగా వ్యవహరించకూడదు?" అని ఉండాలి.

కుటుంబ పరువు తీస్తామని బెదిరిస్తే?

ఇది అత్యంత సున్నితమైన అంశం. ఒక వ్యక్తి వ్యక్తిగత జీవితం, కుటుంబ సమాచారం, ఫోటోలు, వీడియోలు లేదా ఇతర విషయాలను బయట పెడతామని బెదిరించి డబ్బులు డిమాండ్ చేస్తే, అది కేవలం "బెదిరింపు"గానే కాకుండా సంఘటన వివరాల ఆధారంగా ఇతర క్రిమినల్ నేరాల కోణంలో కూడా పరిశీలించాల్సి ఉంటుంది.

అటువంటి బాధితులు భయంతో డబ్బులు ఇస్తూ పోవడం పరిష్కారం కాదు. తేదీ, సమయం, ప్రదేశం, ఫోన్ నంబర్లు, మెసేజీలు, ఆడియో/వీడియోలు, డబ్బు బదిలీ ఆధారాలు వంటి వివరాలను భద్రపరచుకుని పోలీసులకు ఫిర్యాదు చేయాలి. నేరం జరిగిందని భావిస్తే దర్యాప్తు చేయడం పోలీసుల పని. వ్యక్తిగతంగా ప్రతీకారం తీర్చుకోవడం కాదు.

"వారు పనులు చేసుకుని బ్రతకలేరా?"

ఈ ప్రశ్నకు సమాధానం...ఖచ్చితంగా బ్రతకగలరు. కానీ అందుకు సమాజం అవకాశాలు కల్పించాలి. అదే సమయంలో అవకాశాలు కల్పించినప్పుడు బాధ్యత కూడా ఉండాలి. కేంద్ర ప్రభుత్వావీ×ాజు పథకంలో ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల కోసం విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, ఆర్థిక అనుసంధానం, పునరావాసం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తోంది. తెలంగాణలోనూ ట్రాన్స్‌జెండర్ వ్యక్తులకు నైపుణ్య శిక్షణ, ఉపాధి, స్వయం ఉపాధి దిశగా చర్యలు తీసుకోవాలని చట్టపరమైన వ్యవస్థలోనే ప్రస్తావించబడింది. అందుకే ప్రభుత్వ విధానం "డబ్బులు అడగకుండా ఉండండి" అనే స్థాయిలో ఆగిపోకూడదు. "ఇదిగో నైపుణ్య శిక్షణ... ఇదిగో ఉద్యోగ అవకాశం – ఇదిగో స్వయం ఉపాధికి రుణం – ఇదిగో మార్కెట్" అనే స్థాయికి వెళ్లాలి.

**హిజ్రాల ముసుగులో రాష్ట్రంలో "వసూల్ రాజా గ్యాంగ్" ఉందా?**

ఇది అత్యంత జాగ్రత్తగా చూడాల్సిన ప్రశ్న.

ఏదైనా ప్రాంతంలో ట్రాన్స్‌జెండర్‌ల పేరుతో కొందరు గుంపుగా తిరుగుతూ బలవంతపు వసూళ్లు చేస్తున్నారని ఫిర్యాదులు వస్తే, పోలీసులు వ్యక్తుల గుర్తింపును, గ్యాంగ్ కార్యకలాపాలను, డబ్బుల లావాదేవీలను, బాధితుల వాంగ్మూలాలను, సీసీటీవీ/ఫోన్ ఆధారాలను పరిశీలించాలి. కానీ "రాష్ట్రంలో హిజ్రాల ముసుగులో వసూల్ రాజా గ్యాంగ్ ఉంది" అని అధికారిక దర్యాప్తు లేకుండా చెప్పడం బాధ్యతాయుతమైన జర్నలిజం కాదు. అది నిజమైన నేరస్తులను బయట పెట్టకపోగా, అమాయక ట్రాన్స్‌జెండర్ సమాజంపై సామూహిక ముద్ర వేయవచ్చు.

అందువల్ల ప్రశ్నను ఇలా మార్చడం మంచిది:

"ట్రాన్స్‌జెండర్ సమాజం పేరును అడ్డుపెట్టుకుని ఎవరైనా బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారా? ఉంటే వారి వెనుక ఎవరు ఉన్నారు? పోలీసులు ఎందుకు గుర్తించలేకపోతున్నారు?"

ఇది మరింత బాధ్యతాయుతమైన ప్రశ్న.

ప్రభుత్వం చేయాల్సింది ఏమిటి?

ప్రభుత్వం మూడు దిశల్లో చర్యలు తీసుకోవాలి.

మొదటిది – ఉపాధి. అర్హత ఉన్నవారికి విద్య, నైపుణ్య శిక్షణ, ఉద్యోగాలు, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలి. రెండోది చట్టపరమైన బాధ్యత. ట్రాన్స్‌జెండర్ అయినందుకు ఎవరినీ వేధించకూడదు. అదే సమయంలో ట్రాన్స్‌జెండర్ అని చెప్పుకుని ఇతరులను బెదిరించినా, వసూలు చేసినా చట్టం నుంచి మినహాయింపు ఉండకూడదు. మూడోది – పోలీసు వ్యవస్థలో స్పష్టమైన ప్రోటోకాల్. ఇలాంటి ఫిర్యాదులపై వెంటనే స్పందించే ప్రత్యేక వ్యవస్థ ఉండాలి. బాధితుడు సాధారణ పౌరుడైనా, ట్రాన్స్‌జెండర్ వ్యక్తైనా – ఫిర్యాదుకు ఒకే విలువ ఉండాలి. ట్రాన్స్‌జెండర్ సమాజానికి గౌరవం కావాలి – ప్రత్యేక న్యాయం కాదు. ప్రజలకు భద్రత కావాలి – భయంతో జీవించే పరిస్థితి కాదు. పోలీసులకు చట్టం ఉంది...దాన్ని సమానంగా అమలు చేయాల్సిన బాధ్యత ఉంది. ప్రభుత్వానికి సంక్షేమం అందించాల్సిన బాధ్యత ఉందిఅదే సమయంలో చట్టాన్ని గౌరవించే సామాజిక బాధ్యతను కూడా పెంపొందించాలి. హక్కులు అడిగే ప్రతి వ్యక్తిని గౌరవించాలి. హక్కుల పేరుతో దౌర్జన్యం చేసే ప్రతి వ్యక్తిపై చట్టం పనిచేయాలి. ఇదే నిజమైన సమానత్వం.



**ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్**
**ఫ్రీలాన్స్ జర్నలిస్ట్**
**9440287170.**

# తెలంగాణ సాయుధ పోరాట వీరుడు, ధీరుడు

**(చింతలపూరి రాంరెడ్డి (రేణిగుంట)**

**కాగడా తానై... కారుమబ్బులు తొలగించి –**
**ప్రచండం తానై... ప్రతాపాలను రగిలించి –**
**ఉద్యమం తానై... ఉరికొయ్యలను ప్రేమించి –**
**అతడు.. చింతలపురి రామిరెడ్డి !**
**"రామా రామిరెడ్డి.....**
**మా చింతలపూరి రామిరెడ్డి...**
**నీ కొడుకు రంగారెడ్డి...**
**యుద్ధాన ఎదురొడ్డి... "**

అంటూ జానపదులు నేటికిని పాటలుగా పాడుకునే తెలంగాణ సాయుధ పోరాట వీరుడు చింతలపురి రామిరెడ్డి.... రేణికుంట రామిరెడ్డిగా ప్రసిద్ధి చెందాడు.

వివరాలు:తెలంగాణ నేలపై ఉద్యమాల ఖిల్లాగా పేరు పొందిన నల్లగొండ జిల్లా రేణుకుంట వీరి స్వగ్రామం. ఇక్కడ పూర్వం నుండి పేరెన్నిక గల భూస్వామ్య కుటుంబంలో 1903 లో రాంరెడ్డి జన్మించాడు. నల్లగొండ – భువనగిరి మధ్యలో రేణుకుంట గ్రామం ఉంటుంది. సమీపంలోనే రాజపేట సంస్థానం ఉంటుంది.

నిజాం సర్కర్ హయాంలో తెలంగాణ ప్రాంతంలో గ్రామాలు దొరల ఏలుబడిలో కొనసాగుతుండేవి. దొరల్లో చిన్న, పెద్ద, దొరలు ఉండేవారు. రామిరెడ్డి కుటుంబం చిన్న దొరలుగా పరిగణించబడింది. మొత్తం దొరల సమూహాన్ని నిజాం తన బలగంగా భావించేవాడు. కానీ కొందరు దొరలు నిజాం రాజరికానికి వ్యతిరేకంగా ప్రజా బంధువులుగా మారి ప్రజా పోరాటాలు మొదలెట్టారు. ఇటువంటి ప్రజా బంధువుల్లో రామిరెడ్డి కుటుంబం ఒకటి.

పోరాట స్వభావం :చింతలపురి రాంరెడ్డికి చిన్నప్పటి నుండే పోరాట స్వభావం ఉన్నది. ప్రజా పక్షం వహిస్తూ ప్రజల తరుపున మాట్లాడే నాయకత్వ లక్షణం కూడా ఉన్నది. ఎందుకు ప్రధాన కారణం పుట్టి పెరిగిన భూస్వామ్య కుటుంబం కావచ్చు, రాజపేట సంస్థానంతో తన గ్రామానికి కొనసాగిన రాజకీయ సంబంధ బాంధవ్యాలు కావచ్చు.. రాజాపేట సంస్థానాదీషులు తమ పాలనా వ్యవహారాల్లో భాగంగా సమీప గ్రామల పొలిమేరల్లో సైనిక శిబిరాలు ఏర్పాటు చేయడం, శిక్షణలు ఇవ్వడం, గుర్రాల పోషణ, ఇవన్నీ రాంరెడ్డి మీద ప్రభావం చూపించాయి.కాబట్టే తర్వాత కాలంలో రాజులు ఎక్కి తిరిగే మేలుజాతి గుర్రాన్ని ఉపయోగించాడు. ముఖ్యంగా 1914 లో రాజాపేట సంస్థానాదీషుడు రాజేశ్వరరావు కాలం చేసాడు. . అయన కాలం చేసేనాటికి సంతానం చిన్నపిల్లలుగా ఉండటంతో భార్య జానకమ్మ పాలనకు వచ్చింది. అప్పటికి సంస్థానం అప్పుల్లో కూరుకుపోయి ఆర్థికభారంతో ఉన్నది. ఈ పరిస్థితుల్లో సంస్థానాన్ని నిజాం ప్రభుత్వ సహాయ సహకారాలతో ముందుకు నడిపించడానికి జానకమ్మ ఎంతో కష్టపడాల్సి వచ్చింది. ఈ విధంగా జానకమ్మ పరిపాలన గురించి ప్రజలు కథలు కథలుగా మాట్లాడుకుంటూ ఒకవైపు సానుభూతి చూపిస్తున్నప్పటికీ.... .మరోవైపు ఆత్మస్థయిర్యాన్ని మెచ్చుకునేవాళ్లు. ఈ కథల ప్రభావం కూడా రాంరెడ్డి మీద చాలా వరకు ఉన్నది. ఈ విధంగా తాను పుట్టి పెరిగిన వాతావరణంలో పరిస్థితులే కాలక్రమంలో అతనిలో నాయకత్వ లక్షణాలను పోరాట స్వభావాన్ని పెంపొందింపజేసాయి అని కూడా చెప్పవచ్చు.

బేగంపేట సంఘటన :చింతలపురి రాంరెడ్డి పటేల్ గా కొనసాగుతూ గ్రామ పరిపాలన వ్యవహారంలో, భూ తగాదాల్లో, కుటుంబ కలహాల్లో , పెద్ద మనిషిగా జోక్యం చేసుకుంటూ పంచాయత తీర్పులు చెబుతూ ధర్మాన్ని పాటించేవాడు. ఆ విధంగా రేణికుంట గ్రామంలోనే కాదు చుట్టుపక్కల గ్రామాల్లో కూడా ధర్మబద్ధుడుగా పేరు గడించాడు. చుట్టుపక్కల గ్రామాల నుండి కూడా కీలకమైన సమస్యలు రాంరెడ్డి వద్దకు ఆయా గ్రామ పెద్దల సమక్షంలో వచ్చేవి. ఇటువంటి పరిస్థితుల్లో జరిగిన బేగంపేట వుదంతం ... సాయుధ పోరాటానికి ముందే రాంరెడ్డి ధైర్య సాహసాలకు నిదర్శనంగా నిలిచింది. వివరాల్లోకి వెళ్తే....రేణిగుంటకు మూడు కిలోమీటర్ల దూరంలో బేగంపేట పేరుతో ఒక జాగిర్ గ్రామం ఉండేది. జాగిర్ గ్రామాలను ముక్తే గ్రామాలు అని, జాకీర్దారును ముక్తేదారు అని పిలిచేవాళ్ళు. బేగంపేట జాగిర్దారు ముస్లిం ఉండేవాడు. అతడు మరణించాడు. జాగిర్దారు మరణంతో అతడి సంతానం మధ్య ఆస్తులు తగాదా ఏర్పడింది. అతడి కూతురుకు కుమారుల మధ్య ఏర్పడిన గొడవ రాంరెడ్డి వరకు వచ్చింది.. గొడవలు న్యాయాన్యాయాన్ని విచారించిన రాంరెడ్డి, ముక్తేదార్ కూతురు పక్షాన నిలబడ్డాడు. ఆమె భాగానికి వచ్చిన భూమిని సాగు చేయించాడు. ఇదంతా ముక్తేదారు కొడుకులకు నచ్చలేదు. రాంరెడ్డిని అడ్డు తొలగిస్తే, తమ వ్యవహారానికి ఏ అడ్డు ఉండదని భావించారు. ఈ క్రమంలో హైదరాబాదు నుండి అరబ్బుల దళాన్ని గ్రామానికి రప్పించారు. నిజాం కాలంలో అరబ్బుల దళం ప్రత్యేకంగా ఉండేది. నిజాం ప్రభుత్వానికి సంబంధించిన స్థిర చరాస్తుల



కాపలాదారులుగా అరబ్బుల దళాలు కొనసాగేవి. దళాల్లో వ్యక్తులు సాయుధులుగా ఉండేవారు. ఆస్తుల ఆక్రమణ నియంత్రణ వంటి వ్యవహారాల్లో దళాలకు కొన్ని అధికారాలు ఉండేవి. ఏమాత్రం తేడా వచ్చినా ప్రాణాలు తీయడానికి కూడా దళాలు వెనకాడేవి కాదు. కాబట్టి సామాన్య జనాలకు దళాలు అంటే భయం ఉండేది. ఇటు పోలీసు వ్యవస్థ కూడా దళాల విషయంలో జాగ్రత్తగా ఉండేది. ఇటువంటి అరబ్బుల దళానికి రాంరెడ్డి ఎంత మాత్రం భయపడలేదు. తన అనుచరుల, గ్రామస్తుల, సమక్షంలో అరబ్బులతో సమావేశం ఏర్పాటు చేశాడు. ఇరువురు మధ్య వాగ్వాదం జరిగింది. అరబ్బుల దళం దాడికి ప్రయత్నం చేసింది. వాళ్ల స్వభావం తెలిసి అప్పటికే అప్రమత్తంగా ఉన్న రాంరెడ్డి, తన సమూహంతో సిద్ధంగా ఉంచుకున్న గుత్పలు కర్రలు గడ్డపారలు కత్తులతో ఎదురుదాడికి స్వయంగా సిద్ధమయ్యాడు. వెనకాలే గ్రామస్తులు నిలిచారు. అయినా అరబ్బులు పంతం మార్చుకోలేదు. పరస్పర ఘర్షణ జరిగింది. ఘర్షణలో రాంరెడ్డి ఒకరిద్దరు అరబ్బులను దొరకపుచ్చుకుని ముక్కు చెవులు కోసినట్టుగా స్థానికులు చెబుతుంటారు. ఇది గమనించకుండా అరబ్బులు అక్కడినుండి పలాయనం చిత్తగించినట్టుగా కూడా చెబుతారు. ఈ ఘటన 1923ది 30 ప్రాంతంలో జరిగినట్టు స్థానికులు చెబుతున్నారు. తర్వాత గ్రామాల ప్రజలకు రాంరెడ్డి పైన అభిమానం రెట్టింపు కావడంతో పాటుగా, రాంరెడ్డి పేరు కూడా హైదరాబాద్ వరకు పాకింది.

ఆంధ్రమహాసభలో :క్రమంగా గ్రామాల్లో పరిస్థితులు మారిపోయాయి. నిజాం వ్యతిరేక పోరాట ప్రభావం గ్రామాల్లోకి పాకింది. కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆంధ్ర మహాసభ సభ్యులు గ్రామాల్లో పర్యటిస్తూ ఉద్యమ ప్రచారం మొదలుపెట్టారు. రాంరెడ్డికి చిన్నప్పటి నుండి ధైర్య సాహసాలతో పాటుగా అభ్యుదయ భావాలు కూడా ఎక్కువ. ఈ క్రమంలో మొదట్లో సంస్కరణాభిలాషిగా 1940 ప్రాంతంలో ఆంధ్రమహాసభ ప్రేరణతో చైతన్యం పొందాడు. ఆంధ్ర మహాసభలో ఒక సభ్యుడుగా అడుగు పెట్టి సంఘం కోసం పనిచేయడం మొదలెట్టాడు. 1940 –1945 మధ్య కాలంలో నిజాం ప్రభుత్వం పన్నులు పెంచి ప్రజలను పీడిస్తున్న సమయంలో ఆంధ్ర మహాసభ తరపున ప్రశ్నించడం మొదలెట్టాడు. ఆరుట్ల రామచంద్రారెడ్డి దళంతో కలిసి గ్రామాలు తిరిగాడు. ఆయుధ శిక్షణ కూడా తీసుకున్నాడు.

గ్రామరక్షణ దళాలు: పోరాటకాలంలో గ్రామాలపై రజాకర్ల దాడులు మెరుపువేగంతో జరిగేవి. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుండేవి. గ్రామ ప్రజలు రజాకర్ల నుండి కాపాడుకోవడానికి స్వయంగా గ్రామరక్షక దళాలను ఏర్పాటు చేసాడు. అరవై తుపాకులను రక్షణ దళాల తర్ఫీదు కోసం తెప్పించాడు. తన కోసం ట్వెల్వ్‌బోర్ తుపాకిని తెప్పించుకున్నాడు. కొలిపాక గ్రామస్తులు పగడాల సత్తెయ్య, వేచల్ల పుల్లారెడ్డిలతో కలిసి స్వయంగా ఆయుధాల శిక్షణ ఇచ్చాడు. ఆయుధ శిక్షణతో సామాన్యుడిని సైతం సాయుధ వీరుడుగా మార్చాడు. రజాకార్లు గ్రామాల్లోకి ప్రవేశించే ప్రయత్నం చేసినప్పుడు, తన దళాలతో కలిసి రజాకార్లను గడగడా వణికించాడు. ఈ క్రమంలో రాజాకార్ల రాకను పెట్టడానికి గ్రామంలో రాంరెడ్డి ఇల్లే ఒక బురుజుగా ఉపయోగపడింది.. ఈ భవంతి మీద నుండి నలుదిశల్ని గమనిస్తూ వంతుల వారిగా గ్రామ రక్షణ దళ సభ్యులు కాపలా ఉండేవాళ్ళు. రజాకార్లతో అప్పటికే ఆధునిక ఆయుధాలు ఉన్నాయి. కాగా రాంరెడ్డి దళం కర్రలు గుత్పలు పారలు నుండి పోరాటాన్ని ప్రారంభించింది. ఈ క్రమంలో తన దళానికి నాటు తుపాకులు సమకూర్చుకోవడంలో రాంరెడ్డి ప్రాణాలకు తెగించి శ్రమించాడు.

ప్రత్యక్షంగా పరోక్షంగా శత్రువును పసిగట్టడంలో రాంరెడ్డి దిట్ట. ఇందుకు అవసరమైన పరిజ్ఞానం రాంరెడ్డికి జన్మతా సొంతం. దళం సభ్యులకి ఈ విషయమై ప్రత్యేక తరగతులు నిర్వహించి నేర్పించాడు. అట్లా స్వయంగా వేలాది గుత్పల సైన్యాన్ని తయారుచేసుకున్నాడు. కోవర్టుల్ని కూడా నియమించుకున్నాడు.

ఇల్లే ఉద్యమ కేంద్రం

తన ఇంటినే ఉద్యమ కేంద్రంగా మార్చుకున్నడు రాంరెడ్డి. తన ఇంట్లోనే రహస్యంగా సమావేశాలు ఏర్పాటు చేశాడు. సమావేశం ఏర్పాటు చేసిన ప్రతిసారీ, ఇంట్లో ఏదో పండుగనో పబ్బమో జరుగితున్నట్టుగా భ్రాంతి కలిగించే వాడు. అంటరాని తనానికి వ్యతిరేకంగా కులం మతం తేడా లేకుండా అందరినీ ఇంట్లోకి రప్పించాడు.. అట్లా దళం అంటే కుటుంబం అని అర్థం చెప్పాడు.

ఊరు వదిలిన కుటుంబం

1947–1948 సంవత్సర కాలాల్లో నిజాం ప్రయివేటు సైన్యం రజాకార్ల అకృత్యాలు మితిమీరి పోయాయి. ఈ అకృత్యాలపై తన తిరుగుబాటును ధైర్యంగా ప్రకటించుకున్నాడు రాంరెడ్డి. ఈ నేపథ్యంలో నిజాం సర్కారుకు సింహ స్వప్నంగా మారాడు. తమకు తలనొప్పిగా తయారైన రాంరెడ్డి మీద సర్కారు ఓ కన్నేసింది. అయినప్పటికీ ఎప్పటిలా రాంరెడ్డి భయపడలేదు. కానీ మకాం అడవుల్లోకి మార్చాడు. పోరాట పరిస్థితుల్లో రాంరెడ్డి కుటుంబానికి రక్షణ కరువైయ్యింది. తాను ఉద్యమంలో భాగంగా అడవుల వెంబడి తిరగడం, ఇంట్లో కుటుంబానికి రజాకర్ల వల్ల రక్షణ లేకపోవడం సమస్యగా పరిణమించింది. ఈ పరిస్థితిలో పెద్ద కొడుకు రంగారెడ్డిని తన వద్ద ఉంచుకుని, భార్యను మిగతా పిల్లలను తెనాలి పంపించాడు.

మారు వేషంలో ఆఖరి ప్రయాణం:

అడవుల నుండి ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలకు మరింత పదును పెంచాడు. కనిపిస్తే కాల్చివేత్త ఉత్తర్వుల్ని ఎదురుకుంటూ సర్కారుకు దొరకకుండా చుక్కలు చూపించాడు. ఇటువంటి పరిస్థితితుల్లో ఒకరోజు ఉద్యమ కార్యాచరణ విషయమై తన కొడుకు రంగారెడ్డితో కలిసి తన గ్రామం రేణికుంటకు మారు వేషంలో వచ్చాడు.. అదే అతడి ఆఖరి ప్రయాణం.

**వీరుడి మహాప్రస్థానం :**
**రామిరెడ్డి మరణ ఘట్టం ఒక మహాసంగ్రామం !**

**1948 మార్చి 2 వ తారీఖు.**

**మారు వేషంలో ఉన్న రాంరెడ్డి కార్యాచరణ గురించి ఉద్యమ కేంద్రమైన తన ఇంట్లో దళం సభ్యులతో మాట్లాడుతున్నాడు. రాంరెడ్డిని ప్రభుత్వానికి పట్టించి నిజాం మెప్పుపొందాలని... తద్వారా సర్కరునుండి తాయిలాలు పొందాలని.... కాచుకుని కూచున్న తహసీల్దారుకు , రాంరెడ్డి గ్రామంలోకి ప్రవేశించిన సమాచారం అందింది. ఈ విషయం రాంరెడ్డి నియమించుకున్న కోవర్టులు కూడా పసిగట్టలేక పోయారు. మొత్తానికి తహసీల్దారుకు సమయం అనుకూలంగా మారింది. ఆలస్యం లేకుండా అదే అదనుగా రజాకర్లకు వార్తను చేరవేసాడు. ఇంకేముంది? ఆ సమయం కోసమే ఎదురు చూస్తున్న రజాకార్ సైన్యం నాలుగు బృందాలుగా నాలుగు వైపుల నుండి ఆకస్మికంగా రేణికుంట బయలుదేరింది. రాంరెడ్డి నామరూపాలు లేకుండా మట్టుపెట్టాలని నిర్ణయించుకున్నారు కాబట్టి సైన్యం ఆషామాషీగా లేదు. ఎనిమిది లారీల్లో వందల సంఖ్యలో బయలుదేరి వున్నది.**

ఎదురుతిరిగే దళాన్ని సమూలంగా కాల్చి చంపి, ఆ తర్వాత రేణికుంట గ్రామాన్ని పూర్తిగా తగుల బెట్టి ఒక్కరు కూడా మిగలకుండా చేయాలి అనేది రజాకార్ల పన్నాగం . . ఈ క్రమంలో వాళ్ళతో మరతుపాకులు మెషీన్ గన్నులు భారీ ఎత్తున వున్నాయి. గ్రామ భవంతి మీద నుండి పరిస్థితుల్ని కనిపెట్టుకుని వుండే దళ సభ్యులు గ్రామాన్ని చేరుకుంటున్న రజాకార్ల సైన్యాన్ని పసిగట్టారు. .గ్రామాన్ని అప్రమత్తం చేస్తూ బురుజు మీద గంట మోగించారు . ప్రమాద సంకేతం రాంరెడ్డికి చేరింది. రజాకార్ల సైన్యం చేస్తున్న భీకర అరుపులు దూరం నుండే ప్రమాద తీవ్రతను తెలియజేశాయి. కానీ సమయానికి సైన్యం అందుబాటులో లేదు 16 మంది మాత్రమే ఉన్నారు. అయినప్పటికీ రాంరెడ్డి దళం పోరాటానికి సిద్ధమయ్యింది. అప్పటికి ప్రజలు పారిపోయి ప్రాణాలు కాపాడుకోవాలని సూచిస్తూనే ఉన్నారు . పారిపోయే అవకాశం కూడా ఉన్నది. కానీ రాంరెడ్డి ప్రజల మాట వినలేదు. పెద్దఎత్తున ముంచుకొస్తున్న ప్రమాద పరిస్థితుల్లో, తాను తప్పించుకుంటే ప్రజలకు ముప్పు తప్పదని అంచనా వేసుకున్నాడు. కాబట్టి ప్రజలనే పారిపోయి ప్రాణాలు కాపాడుకోమని ఆదేశించాడు. రాంరెడ్డి సూచనతో ప్రజలు భయతో ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని గ్రామం చుట్టూ సహజ సంరక్షణగా వున్న గుట్టల్లోకి పారిపోయారు.

**విజయమో వీరస్వర్గమో....**

రాంరెడ్డి ముందు వరసలో నిలబడి తన వెనుక సైన్యాన్ని నడిపించాడు. వెంటే కుమారుడు రంగారెడ్డి కూడా ఉన్నాడు. రజాకార్లని ఎదుర్కోవడానికి అనువైన చోటుగా ఒక మిద్దె ఎక్కి చండ ప్రచండుడై అరవీర భయంకరుడై నిలబడ్డాడు. చూస్తుండగానే రజాకార్లు గ్రామాన్ని చేరుకున్నారు. అరుపులు హాహాకారాలతో యుద్ధ భీభత్సం మొదలయ్యింది. వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది . రాంరెడ్డి తుపాకీ ఎక్కుపెట్టాడు. తొలి తూటా గురి చూసి వదిలాడు. వెనకడుగు లేకుండా..... ఏమాత్రం జంకు లేకుండా... తన దళంలో వున్న 16 మంది సభ్యులతో 15 తుపాకులతో రజాకర్లతో పోరాటానికి తెగబడ్డాడు రాంరెడ్డి. రెండు గంటల పాటు జరిగిన భీకర పోరాటంలో 40 మంది రజాకర్లు చనిపోయారు. రాంరెడ్డి దళంలో ఒక్క సభ్యుడు మాత్రమే చనిపోయాడు. ఇది రజాకర్లకు అవమానంగా తోచింది. రాంరెడ్డి పోరాట పటిమను రజాకార్లుతట్టుకోలేకపోయారు. ఒక్క రజాకార్లే కాదు, రజాకర్ సైన్యాన్ని రెచ్చగొట్టి తీసుకొచ్చిన తహసిల్దారు కూడా తట్టుకోలేక పోయాడు. ఒక దగ్గర నక్కి పోరాటాన్ని గమనిస్తున్న వాడల్లా.... రాంరెడ్డిని దొంగచాటుగా చంపి నిజాం మెప్పు పొందాలనుకున్నాడు. అందుకు అనువైన సమయం కోసం ఎదురు చూడటం మొదలెట్టాడు. చూస్తుండగానే రాంరెడ్డికి సంబంధించిన తుపాకుల్లో మందుగుండు దాదాపు అయ్యిపోయింది. దళ సభ్యుల్లో అందోళన మొదలయ్యింది. అయినా రాంరెడ్డి పోరాటం ఆగలేదు. ఇదే అదనుగా భావిస్తూ తహసిల్దారు తన ప్రయత్నం మొదలు పెట్టాడు. రాంరెడ్డి నిలబడి వున్న మిద్దెకు వెనక వున్న చింతచెట్టు ఎక్కి...అక్కడి నుండి రాంరెడ్డిపై వీపు భాగంపై కాల్పులు జరిపాడు. రాంరెడ్డి భారీ శరీరం నెమ్మదిగా కుప్పకూలింది. రాంరెడ్డిపై కాల్పులు జరగగానే దళసభ్యులు ఒక్కసారిగా బలం తగ్గినట్టుగా వణికిపోయారు. అది గమనించిన రజాకార్ల సైన్యం దళాన్ని చుట్టుముట్టి పట్టుకుని వరుసగా నిల్చోబెట్టి క్రూరంగా కాల్చి చంపింది. అప్పటికి రాంరెడ్డి కొన ప్రాణంతో కొట్టుమిట్టాడుతున్నాడు. అయినప్పటికీ పరిస్థితుల పట్ల స్పృహ కోల్పోలేదు. తన మరణం తర్వాత తన కొడుకు రంగారెడ్డి శతృవుల చేతికి చిక్కకూడదని భావించాడు. అంతే !

మరణం కళ్ళముందు తచ్చర్లాడుతుంటే....

శత్రువు వికటాట్టహాసం గుండెను తొలుస్తుంటే... ఆఖరి శ్వాసను బలవంతంగా ఆపుకుంటూ... కొడుకును కాల్చి చంపాడు. తర్వాత ప్రాణాన్ని నెమ్మదిగా మృత్యు దేవతకు అప్పగించాడు. ఆ తర్వాత అనుకున్న ప్రకారం రజాకర్లు గ్రామాన్ని నిర్దాక్షిణ్యంగా తగుల బెట్టారు. కాలిన శవాలను గుట్టలుగా లారీల్లో తరలించారు.

ఒళ్ళు గగుర్పొడిచే రాంరెడ్డి వీరత్వం ...
కఠిన శిలను సైతం కరిగించే రాంరెడ్డి అమరత్వం...
దళ సభ్యల బలి దానం....ఇవన్నీ ప్రజలు మరిచిపోలేదు. నేటికిని పాటలుగా పాడుకుంటున్నారు. కథలు కథలుగా చెప్పుకుంటున్నారు.

వీరుల విస్మృతి బాధాకరం :

తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర అనగానే ఏ కొందరి పేర్లో గుర్తుకు వస్తాయి. చరిత్రలో కూడా ప్రముఖంగా ఆ కొందరికే ప్రాధాన్యత దక్కింది. కానీ చింతలపురి రాంరెడ్డి ప్రత్యక్ష పోరాటం చేసినప్పటికీ.... ప్రాణాలకు తెగించి సర్కారుకు సవాలుగా మారినప్పటికీ....మరణించేవరకు పోరాటమే ఊపిరిగా బతికినప్పటికీ.... పోరాటంలో తన వారసుడిని సైతం కోల్పోయినప్పటికీ...చరిత్రలో పెద్దగా స్థానం దొరకలేదు. సందర్భానుసారంగా వారి పేరును చరిత్రలో ఒకరిద్దరు పేర్కొన్నారు తప్ప వారు చేసిన పోరాటం గురించిన వివరాలు ఎవ్వరూ పెద్దగా పొందుపరచబడలేదు. ఇది బాధాకరమైన విషయం. తెలంగాణ ఉద్యమ చరిత్రను ముఖ్యంగా మలి విడత ఉద్యమచరిత్రలో భాగంగా వచ్చిన గేయసాహిత్యాన్ని గమనిస్తే...తెలంగాణ పోరాట వారసత్వంగా కొందరి పేర్లే ప్రముఖంగా వినిపించాయి. వాళ్ళల్లో –ఆదివాసీల అడుగుజాడ కొమరంభీం,బహుజన రాజ్యం ఆశాజ్యోతి సర్వాయిపాపన్న , కాకతీయ ప్రతాపరుద్రుడిని ఎదురించిన సమ్మక్క సారలమ్మలు ,సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య , దేశ్ముఖ్ అనుచరుల దురాగతానికి బలైన షేక్ బందగీ ,భూమి హక్కుని ప్రశ్నిస్తూ...ఆంధ్రమహాసభ కార్యకర్తల అండదండలతో దొరకు వ్యతిరేకంగా ముందుకు నడిచిన చాకలి ఐలమ్మ , వీళ్ళను మాత్రమే ఉద్యమ కవులు పోరాట వారసత్వంగా స్మరించుకున్నారు. కానీ రాంరెడ్డి వంటి వీరుడిని చరిత్ర పుటల్లో ఎక్కడో మరుగున పడిపోయాడు. ఉద్యమ కవిత్వాలు రాసిన కవులు రాంరెడ్డి వంటి యోధులను ఉద్దేశ్యపూర్వకంగా స్మరించుకోలేదా? లేకా వాళ్ళు వీరులు కాదని భావిస్తూ పక్కకు పెట్టారా? లేకా తెల్వక తలుచుకోలేదా ? ఇవన్నీ మిలియన్ డాలర్ల ప్రశ్నలు.

విగ్రహమై :పోరుబాటైనావు రామిరెడ్డీ...
త్యాగధనమైనావు ఎదురొడ్డీ..
రజాకర్ గుండాలను తరిమికొట్టి...
వీరుడవైనావు తుపాకి పట్టి...
పోరాటకథల్లో నీ పేరు తలిచి...
నిలుపుకుంటాము నిన్ను మా గుండెలు తెరిచి...
అంటూ ప్రజలు రామిరెడ్డిని ఊర్లో విగ్రహంగా నిలబెట్టుకుని తమ అభిమానాన్ని గుండెల నిండుగా చాటుకున్నారు.

**–పందిరి శ్రీనివాసులు. ఎంఏ ( జాగ్రఫీ), బీఈడీ,**
**ఎంసీజే (జర్నలిజం), పిజిడిసిజే (జర్నలిజం)**
**ఉస్మానియా యూనివర్సిటీ.**

ప్రభాతనవ SINGIDI తెలుగు దినపత్రిక
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శుక్రవారం
11-9-2026

# గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

- శాంతిభద్రతలే ప్రధాన లక్ష్యం..
- నిర్వాహకులు పోలీసు మార్గదర్శకాలు తప్పక పాటించాలి
- సీపీ గౌష్ ఆలం



**కరీంనగర్, సెప్టెంబర్ 10(సింగిడి):** గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు నిర్వాహకులు పోలీసుల సూచనలు, భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్ సూచించారు. కరీంనగర్‌లోని అస్త్ర కన్వెన్షన్ హాల్‌లో గురువారం గణేష్ ఉత్సవ కమిటీల నిర్వాహకులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన మార్గదర్శకాల పోస్టర్‌ను పోలీసు అధికారులు, కమిటీ సభ్యులతో కలిసి విడుదల చేశారు. వివాదాస్పద ప్రాంతాల్లో మండపాల ఏర్పాటుకు అనుమతి ఉండదని, కొత్తగా మండపాలు ఏర్పాటు చేసేవారు ముందుగా దరఖాస్తు చేసుకోవాలని సీపీ సూచించారు. సంబంధిత పోలీసు అధికారి క్షేత్రస్థాయి పరిశీలన అనంతరమే అనుమతిపై నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. ఒకే ప్రాంతంలో పోటీగా మండపాలు ఏర్పాటు చేసి వివాదాలకు తావివ్వరాదన్నారు. ప్రతి మండపం వద్ద అగ్నిమాపక పరికరాలు, ఇసుక బకెట్లు అందుబాటులో ఉంచాలని, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు ఏర్పడితే నీటిని ఉపయోగించరాదని సూచించారు. రాత్రివేళ మండపాలను ఖాళీగా ఉంచకుండా పెద్ద మండపాల వద్ద కనీసం ముగ్గురు వాలంటీర్లు ఉండేలా చూడాలన్నారు. మండపాల వద్ద నిఘా కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. రహదారులకు ఆటంకం కలగకుండా, అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా రోడ్డుకు ఒకవైపు మాత్రమే మండపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తుల రద్దీ నియంత్రణకు ప్రత్యేక ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు ఏర్పాటు చేసి, క్యూలైన్ల వద్ద బారికేడ్లు లేదా తాళ్లను ఉపయోగించాలన్నారు. ఉత్సవాల్లో డీజేలకు పూర్తిగా అనుమతి లేదని సీపీ స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం గరిష్టంగా రెండు సాధారణ శబ్ద పరికరాలను మాత్రమే వినియోగించాలని, భక్తి గీతాలు మాత్రమే ప్రసారం చేయాలని తెలిపారు. రెచ్చగొట్టే పాటలు, వ్యాఖ్యలు ప్రసారం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆసుపత్రులు తదితర నిశ్శబ్ద ప్రాంతాల్లో శబ్ద కాలుష్యానికి తావివ్వరాదన్నారు. మహిళల భద్రత కోసం రద్దీ సమయాల్లో షీ బృందాలు, మహిళా కానిస్టేబుళ్లతో ప్రత్యేక నిఘా ఉంటుందని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలంటే ముందుగా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సెప్టెంబర్ 16 తర్వాత వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మండపాల్లో నీరు చేరకుండా, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిమజ్జన మార్గాలు, సమయాల్లో చివరి నిమిషంలో మార్పులు చేయరాదని, వాహన డ్రైవర్లు మద్యం సేవించకుండా నిర్వాహకులు పర్యవేక్షించాలని సూచించారు. నిమజ్జన ఘాట్లు, చెరువుల వద్ద చిన్నారులు, వృద్ధుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే తప్పుడు ప్రచారాలు, మతసామరస్యానికి భంగం కలిగించే సమాచారాన్ని నమ్మవద్దని, ఇతరులకు పంపవద్దని సీపీ కోరారు. అత్యవసర పరిస్థితుల్లో చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా 100 లేదా 112కు, స్థానిక పోలీసు అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు, ఉత్సవ కమిటీలు పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. సమావేశంలో అదనపు డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు వెంకటస్వామి, విజయకుమార్, సతీష్, యాదగిరిస్వామి, ఉత్సవ సమితి అధ్యక్షుడు కె. మహేశ్వర్, పండితులు శ్రీనివాస శర్మ, విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర ప్రముఖ్ రాధాకృష్ణరెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలు స్వరూప, కార్యదర్శి శ్యామ్ తదితరులు, కరీంనగర్‌లోని మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## యశోద అస్పత్రిలో ఇన్‌హౌస్ జన్యు విశ్లేషణ సదుపాయం




- వేగవంతమైన, ఖచ్చితమైన క్యాన్సర్ నిర్ధారణకు అత్యాధునిక జన్యు క్రమ విశ్లేషణ సాంకేతికత
- క్యాన్సర్ నిపుణుడు, డాక్టర్ శిఖర్ కుమార్

**కరీంనగర్, సెప్టెంబర్ 10(సింగిడి):** క్యాన్సర్ చికిత్సలో రోగి జన్యు లక్షణాలకు అనుగుణంగా వ్యక్తిగతీకరించిన వైద్యం అందించేందుకు యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీలో అత్యాధునిక ఇన్‌హౌస్ జన్యు క్రమ విశ్లేషణ సదుపాయాన్ని ప్రారంభించినట్లు క్యాన్సర్ నిపుణుడు డాక్టర్ శిఖర్ కుమార్ తెలిపారు. గురువారం కరీంనగర్‌లోని యశోద హాస్పిటల్స్ శాఖలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ సాంకేతికత ద్వారా క్యాన్సర్‌కు సంబంధించిన జన్యు మార్పులను వేగంగా, ఖచ్చితంగా గుర్తించి, రోగికి సరైన చికిత్సను ఎంపిక చేసేందుకు వైద్యులకు సహకారం అందుతుందని వివరించారు. ఊపిరితిత్తులు, రొమ్ము, జీర్ణాశయ క్యాన్సర్లతో పాటు ఇతర క్యాన్సర్ల నిర్ధారణలోనూ ఈ సదుపాయం ఉపయోగ పడుతుందని తెలిపారు. రోగి జన్యు లక్షణాల ఆధారంగా చికిత్సను రూపొందించే వ్యక్తిగతీకరించిన వైద్యం, ఖచ్చితత్వ ఆధారిత క్యాన్సర్ చికిత్సలో జన్యు క్రమ విశ్లేషణ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీలో క్యాన్సర్ నిపుణుల బృందంతో పాటు రోబోటిక్ క్యాన్సర్ శస్త్రచికిత్స, ఆధునిక కిరణ చికిత్స వంటి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఇన్‌హౌస్ జన్యు విశ్లేషణ సదుపాయం ప్రారంభంతో క్యాన్సర్ రోగులకు నిర్ధారణ నుంచి చికిత్స వరకు మరింత సమగ్ర సేవలు అందించే అవకాశం ఏర్పడిందన్నారు. సమావేశంలో మేనేజర్ రాజేందర్, కంది శ్రీనివాస్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భక్తి, సంస్కృతికి ప్రతీకగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు

అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ఘనంగా ముందస్తు వినాయక చవితి వేడుకలు




**కరీంనగర్, సెప్టెంబర్10(సింగిడి):** గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తి, ఆధ్యాత్మికత, ఐక్యత, సాంస్కృతిక వైభవంతో పాటు సామాజిక సేవకు ప్రతీకగా నిలుస్తాయని అల్ఫోర్స్ విద్యాసంస్థల నిర్వాహకులు డాక్టర్ వి. వనజా నరేందర్ రెడ్డి అన్నారు. కరీంనగర్‌లోని అల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌తో పాటు కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ–టెక్నో పాఠశాలలో వినాయక చవితిని పురస్కరించుకుని నిర్వహించిన ముందస్తు వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి, గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ వనజా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, విఘ్నేశ్వరుడు విఘ్నాలను తొలగించే దేవుడిగా, జ్ఞానం, విజయం, శుభారంభాలకు అధిదేవతగా భక్తులచే ఆరాధించబడుతున్నారని తెలిపారు. గణేష్ నవరాత్రుల్లో మట్టి గణపతి విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమం, పుష్పార్చన, కుంకుమార్చన, ప్రసాద వితరణ, అన్నదానం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారని చెప్పారు. ప్రతిరోజూ భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సవాలను నిర్వహించడం ద్వారా చిన్నారులు, యువత, మహిళల్లోని ప్రతిభను వెలికితీసేందుకు వేదికగా నిలుస్తాయని తెలిపారు. శాస్త్రీయ, జానపద నృత్యాలు, భక్తిగీతాలు, నాటికలు, హరికథలు, కీర్తనలు, సంగీత కార్యక్రమాలు వంటి వివిధ కళారూపాలను ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు తల్లిదండ్రుల పట్ల విధేయత, సోదరుల పట్ల ఆప్యాయత వంటి విలువలను తెలియజేస్తాయని, భారతీయ సంస్కృతికి ప్రతిబింబంగా నిలిచే ఈ వేడుకలను విదేశాల్లోనూ వైభవంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు గణనాథుని వేషధారణలో పాల్గొని వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాలను కొనసాగించాలి

బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఇన్చార్జి రామారావు

ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి...



**జమ్మికుంట, సెప్టెంబర్ 10 (సింగిడి):** తెలంగాణ వీరనారి భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన చాకలి ఐలమ్మ అని ఆమె ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఇన్చార్జ్ ఇంగిలే రామారావు అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఇందిరానగర్ చౌక్ వద్దగల చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, సబ్బండ వర్గాల ఆత్మగౌరవానికి, మహిళా చైతన్యానికి ప్రతీక భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ తెగువను ప్రపంచానికి చాటిచెప్పి మహిళా లోకానికి స్ఫూర్తినిచ్చిన ధీరవనిత దొరల గడీలను ఎదురించి పోరాట పటిమ మనందరికీ స్ఫూర్తిదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్, గోపాల్, రెడ్డి, సందీప్, అన్వేష్, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపల్లి చెరువు నిమజ్జన ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి

భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్, సెప్టెంబర్9(సింగిడి):** గణేష్ నిమజ్జనోత్సవం నేపథ్యంలో కరీంనగర్ నగరంలోని కొత్తపల్లి చెరువు నిమజ్జన ప్రాంగణాన్ని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చేపట్టాల్సిన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నిమజ్జనోత్సవాన్ని ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిమజ్జన ప్రాంగణంలో నిరంతర విద్యుత్ సరఫరా, తగినంత వెలుతురు, స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రాంగణంలో పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రత్యేక పారిశుద్ధ్య బృందాలను ఏర్పాటు చేసి నిరంతరం శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని సూచించారు. భక్తులు, వినాయక విగ్రహాలతో వచ్చే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని మేయర్ అధికారులను ఆదేశించారు. చిన్నపాటి లోటుపాట్లకు కూడా అవకాశం లేకుండా నిమజ్జన ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప మేయర్ వై. సునీల్ రావు, 17వ డివిజన్ కార్పొరేటర్ వేముల కవిత–చంద్రశేఖర్, 18వ డివిజన్ కార్పొరేటర్ వాసాల రమేష్, మున్సిపల్, పోలీసు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నిస్వార్ధ సేవకునికి దక్కిన అరుదైన దక్కిన గౌరవం

ఉమ్మడి జిల్లా కాటన్ వెల్ఫేర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బచ్చు భాస్కర్

జమ్మికుంట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం



**జమ్మికుంట, సెప్టెంబర్ 10 (సింగిడి):** జమ్మికుంట పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త బచ్చు భాస్కర్‌కు అరుదైన గౌరవం దక్కింది. వ్యాపార రంగాల్లో స్వార్థం లేని సేవలు అందించే వ్యక్తికి తగిన గుర్తింపు, గౌరవం ఎల్లప్పుడూ లభిస్తాయని ప్రముఖ వ్యాపారవేత్త, సమాజ సేవకుడు బచ్చు భాస్కర్ నిరూపించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాటన్ వెల్ఫేర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బచ్చు భాస్కర్ ను ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జమ్మికుంట ప్రాంతంలో ఏ రకమైన సామాజిక, సేవా, తోపాటు సాంస్కృతిక సేవలు చేయడం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి కావలసిన సదుపాయాలు ఏర్పాటు చేసి వారికి అండగా నిలిచిన గొప్ప మానవతావాది బచ్చు భాస్కర్. జమ్మికుంట మండల పరిసర ప్రాంతాలలో ఏ కార్యక్రమాలు జరిగినా ఆయన ప్రమేయం లేకుండా ఏ ఒక్క కార్యక్రమం విజయవంతం కాదని అనడం అతియో శక్తి కాదు. గతంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వ్యాపారుల సంక్షేమానికి రైతులకు, మిల్లర్లకు మధ్య మంచి సంబంధాలు నెలకొల్పడానికి ఎనలేని సేవలు అందించారు. భాస్కర్ కు ఈ గౌరవం దక్కడం తో పట్టణంలోని వ్యాపారులు కార్మికులు కర్షకులు రాజకీయ నాయకులు రైతులు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ అభినందించారు.

**ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం**

ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాటన్ మిల్లర్స్ వెల్ఫే ర్ అధ్యక్షుడిగా ఎన్నికైన బచ్చు భాస్కర్ ను జమ్మికుంట ఆర్యవైశ్య సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు లెంకలపల్లి శరత్ మాట్లాడుతూ, వ్యాపార రంగంలో తనదైన ముద్ర వేసుకొని ఎంతో మందికి ఆదర్శంగా నిలిచిన బచ్చు భాస్కర్ కు దక్కిన ఈ గౌరవం ప్రతి వ్యాపారికి అంకితం అని ఆయన ఎంతోమందికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. భవిష్యత్తు తరాలకు మార్గదర్శకులు గా బచ్చు భాస్కర్ తన సేవలను అందించి మరింత ఉన్నతమైన పదవులు పొంది సేవలను అందించాలని అన్నారు. అనంతరం బచ్చు భాస్కర్ మాట్లాడుతూ, ఉమ్మడి జిల్లా కాటన్ వెల్ఫేర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో కాటన్ రంగ అభివృద్ధికి, వ్యాపారుల హక్కుల పరిరక్షణకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు లెంకలపల్లి శరత్, నగేష్, రవీందర్, శ్యామ్, శ్రీధర్, కృష్ణమూర్తి, శ్రీనివాస్, రమేష్, సురేందర్ పట్టణ ప్రముఖులు పాల్గొని భాస్కర్ కు శుభాకాంక్షలు తెలిపారు.

**బచ్చు భాస్కర్ ను సన్మానించిన మున్సిపల్ కౌన్సిలర్**

జమ్మికుంట పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాటన్ మిల్లర్స్ అసోసియేషన్ వెల్ఫేర్ అధ్యక్షుడిగా ఎన్నికైన బచ్చు భాస్కర్ ను మున్సిపల్ కౌన్సిలర్ ఒగ్గు రమేష్ ప్రముఖ వ్యాపారవేత్త ఎలిమిళ్ళ రాజేంద్రప్రసాద్ శాలువాతో ఘనంగా సన్మానించి సత్కరించారు. భవిష్యత్తులో వారు మరిన్ని ఉన్నతమైన పదవులు పొందాలని ప్రజలకు వ్యాపారులకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.

## తెలంగాణ భాషా వైభవాన్ని చాటిన పారమిత విద్యార్థులు

కాళోజీ జయంతి సందర్భంగా భాషా దినోత్సవ వేడుకలు, విజేతలకు బహుమతులు ప్రదానం



**కరీంనగర్, సెప్టెంబర్ 10(సింగిడి):** ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ భాష, యాస, సాహిత్యం, సంస్కృతిపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు వివిధ పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. వేడుకల్లో భాగంగా “తెలంగాణ భాషా ప్రాముఖ్యత” అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తెలంగాణ భాష, యాస, సంస్కృతి, సంప్రదాయాల ప్రత్యేకతను తమ రచనల ద్వారా వ్యక్తపరిచారు. కార్యక్రమానికి ప్రముఖ తెలుగు రచయిత, అధ్యాపకులు, పరిశోధకులు డా. మచ్చ హరిదాసు, ప్రముఖ కవి, కథారచయిత, సాహితీవేత్త, విమర్శకులు దాస్యం సేనాధిపతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు తెలంగాణ కవులు, కళాకారుల వేషధారణలో పాల్గొని ఆకట్టుకున్నారు. నృత్యాలు, ఉపన్యాసాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. ముఖ్యంగా “గ్రాంధిక భాష -- వ్యావహారిక భాష, మన యాస” అంశంపై ప్రదర్శించిన నాటకం విశేషంగా ఆకట్టుకుంది. డా. మచ్చ హరిదాసు మాట్లాడుతూ, తెలంగాణ భాష, యాస, సంస్కృతికి ప్రత్యేక చరిత్ర, వైభవం ఉందన్నారు. దాస్యం సేనాధిపతి మాట్లాడుతూ కాళోజీ రచనల్లో సామాజిక స్పృహ, మానవత్వం, ప్రజల పట్ల ప్రేమ ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. తెలంగాణ భాషను కేవలం యాసగా కాకుండా ప్రజల జీవన సంస్కృతికి ప్రతిరూపంగా చూడాలని సూచించారు. పాఠశాల చైర్మన్ డా. ఇ. ప్రసాదరావు మాట్లాడుతూ భాషా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీలు విద్యార్థుల్లో సృజనాత్మకత, భాషా నైపుణ్యాలను వెలికితీసేందుకు దోహదపడ్డాయని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రష్మిత, వినోద్ రావు, వి.యు.యం. ప్రసాద్, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ, సమన్వయకర్తలు నాగరాజు, రాము, తెలుగు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

బహుజన ఆత్మగౌరవానికి ప్రతీక వీరనారి ఐలమ్మ బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం



**కరీంనగర్, సెప్టెంబర్10(సింగిడి)** బహుజన ఆత్మగౌరవానికి ప్రతీక తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ అని, ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి అని బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం అన్నారు. కొడిమ్యాల, చింతకుంట, కరీంనగర్ ప్రాంతాల్లో నిర్వహించిన చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ఐలమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ఐలమ్మ చూపిన ధైర్యసాహసాలు, పోరాట పటిమ అనన్య సామాన్యమని కొనియాడారు. అణచివేతకు వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం బహుజనులకు నేటికీ స్ఫూర్తిదాయకమన్నారు. అణగారిన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఐలమ్మ చేసిన పోరాటాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు, రజక సంఘం అధ్యక్షుడు రాచకొండ శశిధర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాచకొండ కొమురయ్య, గుంజేటి శివకుమార్, కుంట తిరుపతి, సత్యనారాయణ రెడ్డి, రేణయ్య సదానందం నాయక్, పరశు రాం, లుక్క విజయ్, శ్రీనివాస్ నాయక్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్వి నాయకుల అక్రమ అరెస్టు హేయమైన చర్య

బీఆర్ఎస్వి పట్టణ అధ్యక్షుడు కొమ్ము నరేష్




**జమ్మికుంట, సెప్టెంబర్ 10 (సింగిడి):** రాష్ట్ర ముఖ్యమంత్రి నివాసాన్ని ముట్టడిస్తారన్న ముందస్తు సమాచారంతో బిఆర్ఎస్వి నాయకులను అక్రమంగా తెల్లవారుజామున 4 గంటలకు ఇళ్లలోకి వచ్చి అరెస్టు చేయడం దిక్కుమాలిన చర్య అని బిఆర్ఎస్వి పట్టణ అధ్యక్షుడు కొమ్ము నరేష్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ తెల్లవారుజామున నాలుగు గంటలకి బిఆర్ఎస్వీ నాయకులను అక్రమంగా అరెస్టు చేసి జమ్మికుంట పోలీస్ స్టేషన్ కు తరలించారని బిఆర్ఎస్ పార్టీ నుండి కానీ ఎమ్మెల్యే నుండి కూడా మాకు ఎలాంటి ఆదేశాలు లేవని అయినప్పటికీ పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి స్టేషన్కు తరలించడం దిక్కుమాలిన చర్య అని మండిపడ్డారు. ఇలాంటి అక్రమ అరెస్టులకు భయపడేది లేదని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని అక్రమ అరెస్టులకు భయపడి లేదని హెచ్చరించారు. ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు విద్యార్థులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లేకపోతే ప్రజాక్షేత్రంలో ప్రభుత్వానికి ప్రజలు విద్యార్థులు గుణపాఠం చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వి నాయకులు కొమ్ము నరేష్ నల్లగాశ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఐలమ్మ స్ఫూర్తి ప్రజలకు ఆదర్శం

• మున్సిపల్‌చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని

**జమ్మికుంట, సెప్టెంబర్ 10: (సింగిడి):** వీరనారి చిట్యాల ఐలమ్మ స్ఫూర్తి ప్రజలకు ఆదర్శంగా నిలిచిందని హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని కొనియాడారు. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ పట్టణంలో రజక యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నిమ్మటూరి సాయి కృష్ణ అధ్యక్షతన వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని, పట్టణ సీఐ కరుణాకర్ హాజరై రజక సంఘం పట్టణ అధ్యక్షుడు కొండపాక శ్రీనివాస్ తో కలిసి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.

భూమి కోసం.. భుక్తి కోసం.. వెట్టిచాకిరీ విముక్తి కోసం పోరాడిన ఘనత వీరనారి చాకలి ఐలమ్మకే దక్కుతుందని అన్నారు. తెలంగాణ ప్రజల తెగువను ప్రపంచానికి చాటిన నిప్పుకణికగా చాకలి ఐలమ్మ చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె ప్రదర్శించిన ధైర్యం,



పోరాట పటిమ, త్యాగం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

**ఐలమ్మ పోరాటం చరిత్రలో చిరస్థానం**

దొరల పెత్తనం, వెట్టిచాకిరీ, సామాజిక వివక్షకు వ్యతిరేకంగా ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిందని తెలిపారు. సాధారణ కుటుంబంలో జన్మించిన ఐలమ్మ అన్యాయాన్ని ఎదిరించి, తన హక్కుల కోసం వెనుకడుగు వేయకుండా పోరాడిన ధీరవనిత అని గుర్తుచేశారు.

ఐలమ్మ చూపిన తెగువ వల్ల అణగారిన ప్రజల్లో హక్కుల కోసం పోరాడాలనే చైతన్యం పెరిగిందని అన్నారు. ఆమె జీవిత చరిత్రను నేటి యువత తెలుసుకొని, సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఐలమ్మ ఆశయాలను కొనసాగించడమే ఆమెకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావడానికి ఐలమ్మ వంటి వీరనారుల పోరాట చరిత్ర స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కోయాల్కర్ భారతి, సొల్లు సునీత, వెంకన్న, రజక సంఘం ప్రధాన కార్యదర్శి కొలిపాక శ్రీనివాస్, కొలిపాక సారయ్య, నల్ల బాలరాజు, కొలిపాక శంకర్, సుంకరి రాజమౌళి, కొలిపాక పోచయ్య, కొలిపాక శ్రీనివాస్, కొలిపాక రవి, ప్రజా సంఘాల నాయకులు, జనార్ధన్, తాళ్లపల్లి శ్రీనివాస్, తాళ్లపల్లి రమేష్, వేల్పుల ప్రభాకర్, రత్నం, కొలిపాక సమ్మయ్య, సొల్లు బాబు, చిలకమర్రి శ్రీనివాస్, కొండపాక పవన్ కుమార్, కే క్రాంతి కుమార్, కొలిపాక రంగయ్య, సైదాపూర్ మాజీ ఎంపీపీ వెంకట్రాజం, చిలకమర్రి శ్రీనివాస్ తో పాటు నాయకులు, యువజన సంఘం ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, విద్యావంతులు, మహిళలు, వివిధ వర్గాల ప్రజలు పాల్గొని ఐలమ్మకు ఘనంగా నివాళులర్పించారు.

## రైస్‌మిల్లర్ల సమస్యలు పరిష్కరించాలి

### జాయింట్ కలెక్టర్‌కు వినతి



**హన్మకొండ, సెప్టెంబర్ 10 (సింగిడి):** రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ వరంగల్ హనుమకొండ జిల్లాల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ధాన్యం సేకరణ, మిల్లింగ్ ప్రక్రియకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని కోరారు. మిల్లింగ్ సమయంలో డ్యామేజ్, నూకలు తదితర కారణాలతో ఏర్పడే షార్ట్‌ఫాల్‌పై మిల్లర్లపై చర్యలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. అలాగే రబీ 2025-26 సీజన్‌కు సంబంధించిన బాయిల్డ్ రైస్, రా రైస్ డెలివరీ సమస్యలను పరిష్కరించాలని, ఓ టీ ఆర్ టెస్ట్ మిల్లింగ్‌కు సంబంధించిన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. గత కొన్ని సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న మిల్లింగ్, డ్రైయిజ్, కస్టోడియన్, రవాణా చార్జీలను కూడా తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు సానుకూలంగా స్పందించి, త్వరితగతిన పరిష్కారం చూపాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. రాష్ట్రవ్యాప్తంగా రైస్ మిల్లర్ల సమస్యల పరిష్కారం కోసం అసోసియేషన్ ఆందోళనలు కొనసాగిస్తున్న నేపథ్యంలో హనుమకొండలో జాయింట్ కలెక్టర్‌కు సమర్పించిన ఈ వినతిపత్రం ప్రాధాన్యత సంతరించుకుంది.


## అయ్యప్ప సన్నిధిలో అన్నప్రసాద వితరణ



**కోదాడ, సెప్టెంబర్ 10 (సింగిడి):** తెలంగాణ శబరిమల అనంతగిరి శ్రీ అయ్యప్ప సన్నిధిలో ప్రతి బుధవారం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ 35వ వారానికి చేరుకుంది. ఈ కార్యక్రమానికి కోదాడకు చెందిన పత్తి నరేందర్, ఖానాపురానికి చెందిన జొన్నలగడ్డ శ్రీనివాసరావు--అంజలి దంపతులు దాతలుగా వ్యవహరించారు. అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి జిల్లా అధ్యక్షుడు అర్వపల్లి సత్యనారాయణతో పాటు జగిని ప్రసాద్, గింజుపల్లి రఘు, చాపల శ్రీనివాసరావు, యత్తపు యశ్వంత్, బానోతు శివాజీ, దండు రమేష్, గరిడేపల్లి ఉపేందర్, భక్తులు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

## అన్ని ప్రభుత్వ సంస్థల్లో యూరియా లభ్యతపై రైతులకు ముఖ్య సమాచారం

### ఎంఎఓ ఋష్యేంద్రమణి



**మిర్యాలగూడ సెప్టెంబర్ 10 (సింగిడి):** ప్రస్తుతం రైతులు రెండవ దశ (సెకండ్ డోస్) యూరియా కోసం అడుగుతున్నందున, అన్ని పాక్స్, ఎన్డిసిఎంఎస్, ఎఫ్పిఓ ప్రైవేట్ ఎరువుల డీలర్లు ముందుగానే యూరియా స్టాక్ ఏర్పాటు చేసుకొని, రైతులకు సకాలంలో అందే విధంగా చర్యలు తీసుకోవాలని డీలర్లను కోరినట్టు మండల వ్యవసాయాధికారి (ఎంఏఓ) ఎం. ఋష్యేంద్రమణి అన్నారు. వెంకటరమణ ఏజెన్సీస్ ను తనిఖీ చేసిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్డిసిఎంఎస్, పాక్స్, ఎఫ్పిఓలు తమకు కేటాయించిన యూరియా కోసం అవసర పేమెంట్ పూర్తి చేసి, యూరియా స్టాక్ తెప్పించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. యూరియా పంపిణీ జరగనున్న పాక్స్, ఎన్డిసిఎంఎస్ ప్రైవేట్ ఎరువుల దుకాణాల వివరాలను ఒక రోజు ముందుగానే తెలియజేయాలన్నారు. తద్వారా క్షేత్రస్థాయిలో రైతులకు ముందస్తు సమాచారం అందించి, సంబంధిత కేంద్రాలకు మార్గనిర్దేశం చేయడం సాధ్యమవుతుందన్నారు. రైతులకు ఇబ్బంది కలగకుండా అందుబాటులో ఉన్న స్టాక్‌ను సకాలంలో పంపిణీ చేయాలన్నారు. రైతులకు యూరియా కొరత లేకుండా అందుబాటులో ఉంచడం అందరి బాధ్యత అని ఆమె అన్నారు.

# ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షుడిగా ఎండి ఇమ్రాన్

- నియామక పత్రం అందించిన రాష్ట్ర అధ్యక్షుడు
- అభినందించిన మంత్రి పొన్నం ప్రభాకర్
- ప్రణవ్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఇమ్రాన్

**జమ్మికుంట, సెప్టెంబర్ 10 (సింగిడి):** కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ కార్యకర్తకు సరైన సమయంలో సరైన గుర్తింపు లభిస్తుందని అందుకు నిదర్శనమే విద్యార్థి నాయకుడు ఎండి ఇమ్రాన్ ను ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షుడిగా నియమించడం. విద్యార్థి దశ నుండి విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషిచేసిన యువ నాయకుడు జమ్మికుంట పట్టణవాసి ఎండి ఇమ్రాన్ కు



కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థ అయిన ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షుడిగా నియమించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేస్తూ తన నియామకానికి సహకారం అందించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఇమ్రాన్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీలో విద్యార్థి నాయకుడిగా కాలేజీ అధ్యక్షుడిగా మొదలై ఆ తర్వాత ఎన్ ఎస్ యు ఐ నియోజకవర్గ కోఆర్డినేటర్గా జిల్లా ప్రధాన కార్యదర్శిగా జిల్లా ఉపాధ్యక్షులుగా హుజరాబాద్ ఎమ్మెల్యే ఎన్నికల ఇన్చార్జిగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కరీంనగర్ జిల్లా కోఆర్డినేటర్ గా విశిష్ట సేవలు అందించడం జరిగిందని తెలిపారు. గత పది సంవత్సరాలుగా విద్యార్థులకు చేస్తున్న సేవలను విద్యార్థుల పక్షాన చేస్తున్న పోరాటానికి ప్రతిఫలంగా కష్టపడ్డ కార్యకర్తను గుర్తించి ఎన్ఎస్యుఐ జిల్లా అధ్యక్షుడిగా నియమించడం సంతోషంగా ఉందని ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడు ఎడవెల్లి వెంకటస్వామి కి మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కు కరీంనగర్ జిల్లా డీసీసీ అధ్యక్షులు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆల్ ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి తోపాటు హుజరాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ యువ నాయకుడు ప్రణవ్ లకు రుణపడి ఉంటానని వారి ఆదేశాల మేరకు నడుచుకుంటూ విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని తెలిపారు.

# ప్రజాకవి కాళోజీ జీవితం ఆదర్శనీయం

• వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

**హన్మకొండ, సెప్టెంబర్ 10 (సింగిడి):** ప్రజాకవి కాళోజీ నారాయణరావు తన కలం ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని, చైతన్య స్ఫూర్తిని కలిగించిన కాళోజీ జీవితం ఆదర్శనీయమని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. కాళోజీ జయంతిని పురస్కరించుకుని హనుమకొండ నక్కలగుట్టలోని కాళోజీ విగ్రహానికి ఎంపీ డాక్టర్ కడియం కావ్య, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ ఎన్. రవి, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత అంపశయ్య నవీన్, తదితర ప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ తెలంగాణ భాషా దినోత్సవాన్ని కాళోజీ జయంతి సందర్భంగా నిర్వహించుకోవడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు, ఇబ్బందులను తన రచనల ద్వారా ఎప్పటికప్పుడు ప్రజల ముందుకు తీసుకువెళ్లి, వారిలో చైతన్యం నింపిన కాళోజీ నేటి తరానికి ఆదర్శప్రాయుడని అన్నారు. తెలంగాణ



సాధన ఉద్యమంలో కాళోజీ సాహిత్య స్ఫూర్తి, ఆయన రచనలు ప్రజల్లో గొప్ప చైతన్యాన్ని నింపాయన్నారు. కాళోజీ వరంగల్‌కు చెందిన వారు కావడం గర్వకారణమని తెలిపారు. ప్రజాకవి కాళోజీ రచనలు, సాహిత్యాన్ని ప్రతి ఒక్కరూ చదవాలని, ముఖ్యంగా యువత కాళోజీ ఆలోచనా విధానాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి శుభాకాంక్షలను ప్రజలందరికీ ఎంపీ కడియం కావ్య తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కాళోజీ నారాయణ రావు ఆశయాలను కొనసాగిద్దామని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, కాళోజీ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగిళ్ల రామశాస్త్రి, వీఆర్ విద్యార్థి, కోశాధికారి పందిళ్ల అశోక్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఆగపాటి రాజ్ కుమార్, సంయుక్త కార్యదర్శి పొట్లపల్లి శ్రీనివాస రావు, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఈ.వి. శ్రీనివాసరావు, హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఇతర అధికారులు, పలువురు కవులు, కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

**కలెక్టర్ నివాళులు**

కాళోజి కళాక్షేత్రంలో ప్రజాకవి కాళోజీ జయంతిని పురస్కరించుకొని హనుమకొండ బాలసముద్రంలోని కాళోజి కళాక్షేత్రంలో కాళోజీ నారాయణ రావు విగ్రహానికి హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి బుధవారం పూలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కుడా సీపీవో అజిత్ రెడ్డి, ఈఈ బీమ్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# నల్లగొండ బస్టాండ్‌కు మహర్దశ

• రూ.54 కోట్లతో బస్టాండ్ ఆధునికరణ

**నల్లగొండ ప్రతినిధి సెప్టెంబర్ 10 (సింగిడి):** ఎన్నోఏళ్లుగా అభివృద్ధి కోసం ఎదురు చూస్తున్న నల్గొండ బస్టాండ్‌కు ఎట్టకేలకు మోక్షం లభించనుంది. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్ర త్యేక చొరవతో నల్గొండలో ఆధు నిక హంగులతో నూతన బస్టాండ్ నిర్మాణానికి మార్గం సుగమ మైంది. ప్రస్తుత బస్టాండ్‌ను పూర్తి స్థాయిలో ఆధునీకరించి, ప్రయా ణికులకు మెరుగైన సౌకర్యాలు అందించేలా భారీ ప్రణాళిక సిద్ధ మైంది. ఇందుకోసం సుమారు రూ. 54 కోట్ల నిర్మాణ వ్యయాన్ని ప్రభుత్వం మంజూరు చేసినట్లు సమాచారం.

**భారీ నిర్మాణం,అధునాతన సౌకర్యాలు**

నూతన బస్టాండ్‌లో సుమారు 49,280 చదరపు అడుగుల బి ల్ట్‌అప్ ఏరియా ఉండనుంది. అం



తేకాకుండా 32,000 చదరపు అ డుగుల బేస్‌మెంట్ పార్కింగ్ సౌ కర్యాన్ని ఏర్పాటు చేయనున్నా రు. ప్రయాణికుల సౌకర్యాలు, పార్కింగ్, రాకపోకలు, ఆధునిక వ సతులకు ప్రాధాన్యం ఇస్తూ బస్టాండ్‌ను తీర్చిదిద్దనున్నారు. నూతన బస్టాండ్ నమూనాను అత్యాధునికంగా, ప్రత్యేక ఆ కర్ష ణగా ఉండేలా రూపొందిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

**కార్పొరేషన్ అభివృద్ధిలో మరో మైలురాయి**

నల్గొండ నగర అభివృద్ధిలో నూ తన బస్టాండ్ నిర్మాణం మరో కీ లక ముందడుగుగా నిలవ నుం ది. బస్టాండ్ ఆధునీకరణ పూర్త యితే నగరానికి కొత్త రూపు రా వడంతో పాటు, ప్రతిరోజూ రా క పోకలు సాగించే వేలాది మంది ప్రయాణికులకు మెరుగైన సౌక ర్యాలు అందుబాటులోకి రాను న్నాయి. నూతన బస్టాండ్ ఏర్పా టుకు ప్రత్యేక చొరవ చూపిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపా రు. మొత్తంగా రూ. 54 కోట్లతో రూపు దిద్దుకోనున్న ఈ నూతన బస్టాం డ్ నల్గొండ నగర అభివృ ద్ధికి కొత్త చిరునామాగా మార నుందనే అంచనాలు వ్యక్తమవు తున్నాయి.

# వెయ్యి రోజుల పాలనలో ప్రజలను వంచించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం

### మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన ఘటనపై చర్యలు తీసుకోవాలని కొమరం ధనలక్ష్మి డిమాండ్

**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 10 (సింగిడి):** వెయ్యి రోజుల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వారిని వంచించిందని బీఆర్ఎస్ నాయకురాలు కొమరం ధనలక్ష్మి ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేలైన సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలపై పోలీసుల ద్వారా దాడులు చేయించారని ఆరోపిస్తూ ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందని, వాటిలో కనీసం కొన్ని ప్రధాన హామీలనైనా అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని మహిళలకు నెలకు రూ. 2,500, వికలాంగులకు రూ. 6,000, వృద్ధులకు రూ. 4,000 పింఛన్, నిరుద్యోగ యువతకు రూ. 3,500 భృతి, రైతులకు ఎకరానికి సంవత్సరానికి రూ. 15,000, ఆటో కార్మికులకు రూ. 12,000 ఆర్థిక సాయం, మహిళలకు తులం బంగారం, ఆడపిల్లలకు స్కూటీల పథకం వంటి హామీలను కాంగ్రెస్ పార్టీ ఇచ్చిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం కలిసి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆమె డిమాండ్ చేశారు. హామీల అమలులో విఫలమై ప్రజా సమస్యలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలపై జరిగినట్లు ఆరోపిస్తున్న పోలీసు చర్యలను ఆమె తీవ్రంగా ఖండించారు. మహిళల పట్ల గౌరవం ఉందని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఘటనపై స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రి సీతక్క కూడా మహిళలపై జరిగినట్లు ఆరోపిస్తున్న దాడిని ఖండించాలని కొమరం ధనలక్ష్మి కోరారు. శాసనసభ ఎదుట మహిళా ప్రజాప్రతినిధులతో పోలీసులు వ్యవహరించిన తీరుపై విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర పోలీసు యంత్రాంగం ప్రభుత్వ ఒత్తిళ్లకు లోనుకాకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఆమె అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చకపోతే తగిన సమయంలో ప్రజలే సమాధానం చెబుతారని కొమరం ధనలక్ష్మి హెచ్చరించారు.




## పంటలు ఎండుతుంటే.. పాలకులెక్కడ?

### ఎండిపోతున్న పంటలతో రైతుల ఆగ్రహం..

### ఖమ్మం- కోదాడ జాతీయ రహదారిపై ధర్నా



**కోదాడ, సెప్టెంబర్ 9 ( నినాదం):** కొత్తగూడెం మేజర్ కాలువకు వెంటనే సాగర్ నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు బుధవారం ఖమ్మం--కోదాడ జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. కాలువలో నీరు లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని, మరోవైపు విద్యుత్ కోతలు, లోఓల్టేజీతో బోర్లు, మోటార్లు సక్రమంగా పనిచేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు బొల్లు ప్రసాద్ మాట్లాడుతూ.. సాగునీరు, విద్యుత్ సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పంటలు చేతికొచ్చే దశలో నీరు అందకపోతే పెట్టుబడులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొత్తగూడెం మేజర్ కాలువకు సాగర్ నీటిని విడుదల చేయడంతోపాటు వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాతో జాతీయ రహదారిపై కొంతసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు రైతులతో మాట్లాడి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

# వినాయక విగ్రహాలకు కేరాఫ్ లక్ష్మీ భవాని ట్రేడర్స్...

### జమ్మికుంటలో జోరుగా గణపతి విగ్రహాల విక్రయాలు...



**జమ్మికుంట, సెప్టెంబర్ 10 (సింగిడి) :** జమ్మికుంట పట్టణంలో వినాయక విగ్రహాల కు భారీ డిమాండ్ ఏర్పడింది. ఈనెల 14న వినాయక చవితి సందర్భంగా జమ్మికుంట పట్టణంతోపాటు చుట్టుపక్క ప్రాంతాల నుండి ప్రజలు భారీ ఎత్తున వినాయక విగ్రహాలను కొనుగోలు చేయడానికి జమ్మికుంట పట్టణానికి రావడం జరుగుతుంది. పట్టణంలో చాలామంది వర్తకులు వినాయక విగ్రహాల విక్రయాలు చేస్తున్నారు. కొండూరు కాంప్లెక్స్ లోని లక్ష్మీ భవాని ట్రేడర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాల విక్రయాలు జోరుగా జరుగుతుంది. ఈ సందర్భంగా లక్ష్మీ భవాని ట్రేడర్స్ యజమాని నీరజ్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం వినాయక విగ్రహాలను తీసుకుని వచ్చి విక్రయిస్తామని అతి తక్కువ ధరలో నాణ్యమైన విగ్రహాలను తీసుకురావడం జరుగుతుందని జమ్మికుంట పట్టణంతోపాటు మండలంలోని వివిధ ప్రాంతాలకు చెందిన గ్రామాల నుండి చాలామంది మా వద్దకు వచ్చి విగ్రహాలను కొనుగోలు చేస్తారని మా పై నమ్మకంతో ప్రతి సంవత్సరం వారు రావడం జరుగుతుందని తెలిపారు. మావద్ద 500 నుండి మొదలుకొని 20 వేల వరకు విగ్రహాలు అమ్మడం జరుగుతుందని ఈ అవకాశాన్ని పట్టణ మండల పరిధిలోని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. గురువారం ఇల్లందకుంట మండలంలోని పాతర్లపల్లి గ్రామానికి చెందిన యువకులు, కోడం నవీన్ ఆధ్వర్యంలో వినాయక విగ్రహాన్ని కొనుగోలు చేసి తమ గ్రామానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్కువ ధరకు నాణ్యమైన విగ్రహాలను లక్ష్మీ భవాని ట్రేడర్స్ వారు అందిస్తున్నారని ఇక్కడ చాలా వెరైటీలు లభిస్తున్నాయని తెలిపారు. ఇందులో యజమాని నీరజ్ కోడం రాజు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలు

### ఘన నివాళులర్పించిన కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్



**జమ్మికుంట, సెప్టెంబర్ 10 (సింగిడి) :** భూమికోసం భుక్తి కోసం విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తొలి పోరాటానికి నాంది పలికిన గొప్ప మహిళ యోధురాలు చాకలి ఐలమ్మ అని అలాంటి మహిళను నేటి మహిళా లోకం ఆదర్శంగా తీసుకోవాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్ జమ్మికుంట మాజీ మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వరరావు అన్నారు. చాకలి ఐలమ్మ 41 వ వర్ధంతి సందర్భంగా మున్సిపల్ పరిధిలోని మారుతి నగర్ లో గల చాకలి ఐలమ్మ విగ్రహానికి జిల్లా రజక సంఘం యూత్ నాయకులు ఆలేటి శ్రీరామ్ గూడపు దేవేందర్ తో కలిసి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నిజాం పాలన వ్యక్తి చాకిరికి భూస్వాముల అణచివేతకు వ్యతిరేకంగా తన భూమి హక్కుల కోసం ఐలమ్మ చేసిన పోరాటం అభినందనీయమని పేర్కొన్నారు. విస్నూరు దేశ్ ముక్ రామచంద్రారెడ్డి వంటి దొరల దౌర్జన్యాలను ఎదిరించి పేదలు రైతులు హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం నేటికి స్ఫూర్తి దాయకమని తెలిపారు. ఆమె పోరాట ప్రతిమను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని ఆమె ఆశయాలను కొనసాగించాలని తెలిపారు.

## ఎల్ఎండీ నుంచి కాకతీయ కాలువకు వెంటనే నీటిని విడుదల చేయాలి

### బీఆర్ఎస్ రైతు సంఘం అధ్యక్షుడు ఎడవెల్లి కొండల్ రెడ్డి

**జమ్మికుంట, సెప్టెంబర్ 10 (సింగిడి):** హుజూరాబాద్ నియోజకవర్గంలో తాగు, సాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఉన్నాయని కనీసం రెండు తడుల నీళ్లు పంటలకు ఇచ్చి చెరువులు నింపాలని.. బీఆర్ఎస్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎడవెల్లి కొండల్ రెడ్డి డిమాండ్ చేశారు. లోయర్ మానేరు డ్యామ్ (ఎల్ఎండీ)లో ప్రస్తుతం సుమారు 10 టీఎంసీల మేర నీరు నిల్వ ఉన్నందున, ప్రభుత్వం వెంటనే



స్పందించి కాకతీయ కాలువ ద్వారా నీటిని విడుదల చేయాలని కొండల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుజూరాబాద్ నియోజకవర్గ పరిధిలో తాగునీటికి, సాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాలువల ద్వారా కనీసం రెండు తడులైనా నీటిని విడుదల చేస్తే గ్రామాల్లోని చెరువులు, కుంటలను నింపుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. చెరువులు నింపడం వల్ల భూగర్భ జలాలు పెరిగి, అటు రైతులకు పంటలకు మరియు ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయని పేర్కొన్నారు. ఎల్ఎండీలో తగినంత నీరు అందుబాటులో ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వహించకుండా, వెంటనే యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి కాకతీయ కాలువ ద్వారా నీటిని విడుదల చేసి రైతాంగాన్ని, ప్రజలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## మృతుడి పార్థివదేహానికి మున్సిపల్ చైర్మన్ నివాళులు

**జమ్మికుంట, సెప్టెంబర్ 10 (సింగిడి):** జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో ఇన్వర్డ్ సెక్షన్లో విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ ఉద్యోగి సురేష్ అకాలమరణం చెందగా వారి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల మరణం చెందిన సురేష్ కుటుంబానికి మున్సిపల్ పక్షాన అన్ని విధాల సహాయ




సహకారాలు అందిస్తామని అలాగే వారు ఎక్కడున్నా వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, శానిటరీ ఇన్స్పెక్టర్ ఇల్లందుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బరువుతగ్గడానికి 'ఓట్స్‌రోటీ'.!

ప్రస్తుతం మైదా లేదా గోధుమ పిండితో పోలిస్తే ఓట్స్‌ను డైట్‌లో భాగం చేసుకునే వారి సంఖ్య విపరీతంగా పెరిగింది. ఆరోగ్య నివేదికల ప్రకారం ఓట్స్‌లో పీచుపదార్థం (ఫైబర్), ప్రోటీన్, విటమిన్లు, ముఖ్యమైన ఖనిజ లవణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి తిన్న తర్వాత కడుపును ఎక్కువసేపు నిండుగా ఉంచి, పదే పదే ఆకలి వేయకుండా నియంత్రిస్తాయి. సాధారణంగా ఓట్స్‌ను గంజి లేదా ఉప్మా రూపంలో తినడానికి చాలా మంది ఇష్టపడరు. అలాంటి వారు ఈ సులభమైన పద్ధతి ద్వారా ఎంతో సాఫ్ట్ ఓట్స్ రొట్టెలను ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు.






### కావలసిన పదార్థాలు

ఓట్స్ పిండి (ఓట్స్‌ను మిక్సీ పట్టి జల్లించినది): 1 కప్పు

నీరు: 1 కప్పు

నెయ్యి: 1 టేబుల్ స్పూన్

ఉప్పు: 1/4 టీస్పూన్

### ఓట్స్ రోటీ తయారీ విధానం

**పిండి ముద్దను సిద్ధం చేయడం**

మొదటగా ఇళ్లలో ఉండే రోల్డ్ ఓట్స్ లేదా ఇన్‌స్టంట్ ఓట్స్‌ను ఒక మిక్సీ జార్‌లో వేసి మెత్తటి పౌడర్‌లా గ్రైండ్ చేసుకోవాలి. ఆ తర్వాత జల్లెడ సహాయంతో పిండిని జల్లించి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు స్టవ్ ఆన్ చేసి ఒక పాత్రలో ఒక కప్పు నీటిని బాగా మరిగిం చాలి. నీరు మరుగుతున్న సమయంలో అందులో ఒక చెంచా నెయ్యి రుచికి తగినంత ఉప్పు వేసి బాగా కలపాలి.

**ఓట్స్ పిండిని కలపడం**

నీరు బాగా మరిగాక స్టవ్ మంటను పూర్తిగా తగ్గించి, జల్లించి పెట్టుకున్న ఓట్స్ పిండిని కొద్దికొద్దిగా వేస్తూ ఉండలు కట్టకుండా గరిటెతో బాగా తిప్పాలి. పిండి అంతా నీటిని పీల్చుకున్న తర్వాత స్టవ్ ఆపేసి, పాత్రపై మూత పెట్టి ఒక 10 నిమిషాల పాటు అలాగే వదిలేయాలి. ఆ వేడి ఆవిరికే పిండి మరింత సాఫ్ట్‌గా మారుతుంది.

**రొట్టెలు ఒత్తడం కాల్చడం**

పిండి మిశ్రమం కొద్దిగా చల్లారిన తర్వాత, దానిని ఒక వెడల్పాటి గిన్నెలోకి తీసుకొని చేతులతో బాగా నొక్కుతూ మెత్తటి చపాతీ పిండి ముద్దలా కలుపుకోవాలి. ఆ తర్వాత చిన్న చిన్న ఉండలుగా చేసుకోవాలి. ఓట్స్ పిండిలో గ్లూటెన్ ఉండదు కాబట్టి చపాతీ కర్రతో ఒత్తేటప్పుడు అంచులు విరిగిపోయే అవకాశం ఉంది. అందువల్ల ఒక నూనె రాసిన బటర్ పేపర్ లేదా ప్లాస్టిక్ కవర్‌పై కొద్దిగా పొడి పిండి చల్లి, ఈ పిండి ముద్దను ఉంచి, పైన మరొక కవర్ వేసి మెల్లగా గుండ్రని రొట్టె ఆకారంలో ఒత్తుకోవాలి. చివరగా స్టవ్ మీద పెనాన్ని బాగా వేడి చేసి, సిద్ధం చేసుకున్న రొట్టెను జాగ్రత్తగా పెనంపై వేయాలి. దీనిని మీడియం ఫ్లేమ్‌పై రెండు వైపులా అటుఇటు తిప్పుతూ మంచి రంగు వచ్చే వరకు బాగా కాల్చుకోవాలి. ఎంతో మృదువైన, వేడివేడి ఓట్స్ రోటీ ఇప్పుడు వడ్డించడానికి సిద్ధంగా ఉంది. దీనిని మీకు ఇష్టమైన పల్లి చట్నీ, కూరగాయల కుర్మా లేదా తాజా పెరుగుతో తింటే రుచి అద్భుతంగా ఉంటుంది.






## మారుతీ సుజుకీ నుంచి తొలి ఫ్లెక్స్ ఫ్యూయల్ కారు

చమురు దిగుమతులు తగ్గించి, ఇథనాల్ వినియోగాన్ని పెంచాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఆటోమొబైల్ కంపెనీలు ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాలను రూపొందిస్తున్నాయి.




ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని (జూన్ 5) పురస్కరించుకుని హీరో మోటోకార్ప్ రెండు ఫ్లెక్స్ ఫ్యూయల్ మోటార్ సైకిళ్లను బుధవారం లాంచ్ చేయగా.. తాజాగా ప్రముఖ కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ తొలి ఫ్లెక్స్‌ఫ్యూయల్ కారు వ్యాగనార్ (ఔఖ్రీశీఅ=)ను పరిచయం చేసింది. కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, హర్‌దీప్ సింగ్ పురి ఈ కారును గురువారం ఆవిష్కరించారు. భారతదేశ ఇంధనరంగంలో సరికొత్త అధ్యాయం మొదలైందని మారుతీ సుజుకీ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ హిసాషీ టకేయుచి ఈసందర్భంగా పేర్కొన్నారు. క్రూడాయిల్ దిగుమతులు తగ్గించుకోవడం, కర్బన ఉద్గారాలు తగ్గించుకోవడం భారత్ ముందున్న రెండు ప్రధాన లక్ష్యాలని వివరించారు. ఈ రెండూ ఫ్లెక్స్ ఫ్యూయల్‌తో సాకారం అవుతాయన్నారు. బయో ఫ్యూయల్, ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వైపు మళ్లేలా ఆటోమొబైల్ కంపెనీలకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మార్గనిర్దేశం చేశారని చెప్పారు. ఫ్లెక్స్‌ఫ్యూయల్ టెక్నాలజీ వల్ల ఆటోమొబైల్‌కు మాత్రమే కాకుండా రైతులకు, ఇథనాల్ ఉత్పత్తిదారులకూ మేలు చేకూరుతుందన్నారు. ఇందులోభాగంగా మారుతీ సుజుకీ ఆ దిశగా కీలక ముందడుగు వేసిందన్నారు.

ఇక ఈ కారు విషయానికొస్తే.. 1.2 లీటర్ పెట్రోల్ ఇంజిన్ కలిగిన ఈ కారు సాధారణ పెట్రోల్‌తో పాటు 85 శాతం వరకు ఇథనాల్ బ్లెండ్ చేసిన జు85 ఫ్యూయల్‌తోనూ నడుస్తుంది. డిజైన్ పరంగా జు20 మోడల్‌ను పోలి ఉంది. ధర, ఇతర వివరాలు వెల్లడించలేదు. అయితే, రూ. 8.50 లక్షల వరకు ఉండొచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఫ్లెక్స్ ఫ్యూయల్ కారు లాంచ్ చేసిన నేపథ్యంలో మారుతీ సుజుకీ కంపెనీ షేర్లు రాణించాయి. ఓ దశలో 1.5 శాతం లాభంతో షేరు విలువ రూ. 13,250కి పెరిగాయి. మధ్యాహ్నం 12.50 గంటల సమయానికి దాదాపు ఒక శాతం లాభంతో రూ. 13,152 వద్ద ట్రేడవుతోంది.

## ప్రమాదకరంగా భారీ వృక్షం

**భారీ వర్షాలతో పొంచి ఉన్నపెను ప్రమాదం**

**జమ్మికుంట, (సింగిడి) :** జమ్మికుంట పట్టణంలోని స్థానిక వర్తక సంగం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఒక మహా వృక్షం ఏ క్షణమైనా విరిగిపడే పరిస్థితి నెలకొంది. వర్తక సంఘం ఎదురుగా రెండంతస్తుల భవనం పక్కన భారీ వృక్షం గురువారం కురిసిన మనకు ఒక వైపుకు వంగి పోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్న వర్షానికి చెట్టు వంగిపోవడం భారీ వర్షాలు పడితే పూర్తిగా పడే అవకాశం ఉందని వెంటనే సంబంధిత శాఖ అధికారులు స్పందించి చెట్టుకొమ్మలు తీసివేయడం లేదా పూర్తిగా చెట్టును తీసివేయడం చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించే కంటే ప్రమాదం జరగకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత శాఖ అధికారులపై ఉందని రాబోయే వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని అధికారులు వెంటనే స్పందించాలని వారు కోరుతున్నారు.

## ఫ్లాట్‌గా ముగిసిన మార్కెట్ సూచీలు



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. రోజంతా మోస్తరు శ్రేణిలో కదలాడిన సూచీలు.. స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (=ది×) ద్వైమాసిక పరపతి విధాన సమీక్ష నిర్ణయాలు శుక్రవారం వెలువడనున్న వేళ మదుపర్లు అప్రమత్తత పాటించారు. డాలరుతో రూపాయి మారకం విలువ 95.84గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 96.61 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4,469 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

సెన్సెక్స్ ఉదయం 73,935.83 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,346.17) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభనష్టాల మధ్య కదలాడింది. ఇంట్రాడేలో 73,807.30 – 74,544.24 మధ్య కదలాడిన సూచీ.. చివరికి 13.84 పాయింట్ల లాభంతో 74,360.01 వద్ద ముగిసింది. నిఫ్టీ 10.95 పాయింట్ల లాభంతో 23,416.55 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో టైటాన్, ఎటర్నల్, ఐటీసీ, టెక్ మహీంద్రా, ఎస్‌బీఐ షేర్లు లాభపడ్డాయి. ఇన్ఫోసిస్, బజాజ్ ఫిన్‌సర్వ్, అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, అదానీ పోర్ట్స్ షేర్లు నష్టాలు చవిచూశాయి.

## 6500 mAh బ్యాటరీ, 50MP కెమెరాతో మోటోరొలా ఎడ్జ్ 70 ప్రోం



ప్రముఖ మొబైల్ తయారీ కంపెనీ మోటోరొలా తన ఎడ్జ్ సిరీస్‌లో కొత్త స్మార్ట్‌ఫోన్‌ను లాంచ్ చేసింది. ఎడ్జ్ 70 ప్రోం పేరిట ప్రీమియం సెగ్మెంట్‌లో కొత్త ఫోన్‌ను విడుదల చేసింది. 6500పొూష్ర బ్యాటరీ, 50 ఎంపీ కెమెరా, మీడియాటెక్ డైమెన్సిటీ ప్రాసెసర్‌తో ఈ ఫోన్‌ను తీసుకొచ్చింది. ధర, ఇతర వివరాలు ఇవీ..

**మోటో ఎడ్జ్ 70 ప్రోం ప్రత్యేకతలు**

6.8 అంగుళాల 1.5ని సూపర్ ఎణం ఎక్స్‌ట్రీమ్ అమోలెడ్ క్వాడ్–కర్వ్‌డ్ డిస్‌ప్లే
144Hz రిఫ్రెష్ రేటు, 5,200 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్
కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 7ఐ ప్రొటెక్షన్
6500 ఎంఏహెచ్ సిలికాన్ కార్బన్ బ్యాటరీ
90W వైర్డ్ టర్బో ఛార్జింగ్ + 15W వైర్‌లెస్ ఛార్జింగ్ సదుపాయం
సోనీ ఎల్‌వైటీ–710తో కూడిన 50MP ప్రధాన కెమెరా+ 50MP టెలిఫొటో కెమెరాం 50పీ అల్ట్రావైడ్, మ్యాక్రో కెమెరాముందువైపు 50పీ సెల్ఫీ కెమెరా
మిలిటరీ గ్రేడ్ డ్యూరబిలిటీ, IP68, IP69రేటింగ్
ఆండ్రాయిడ్ 16 ఆధారిత హలోయూఐ
3 ఓఎస్ అప్‌డేట్స్, ఐదేళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్లు
మీడియాటెక్ డైమెన్సిటీ 8500 ఎక్స్‌ట్రీమ్ ప్రాసెసర్
డాల్బీ అట్మాస్, హై రిజల్యూషన్ ఆడియోతో కూడిన స్టీరియో స్పీకర్స్ సదుపాయం

**ధర ఎంత?**

Motorola Edge 70 Pro+ సింగిల్ వేరియంట్‌లో వస్తోంది. 12జీబీం256జీబీ వేరియంట్ ధర రూ. 47,999గా కంపెనీ నిర్ణయించింది. ఇది మూడు రంగుల్లో లభిస్తుంది. యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ కార్డ్ హోల్డర్స్‌కు రూ. 3వేల వరకు ఇన్‌స్టంట్ డిస్కౌంట్ రానుంది. లేదా ఎక్స్ఛేంజ్ బోనస్ కింద రూ. 3 వేలు పొందొచ్చు. జూన్ 11 నుంచి ఫ్లిప్‌కార్ట్, మోటోరొలా వెబ్‌సైట్, సంబంధిత రిటైల్ స్టోర్‌లలో విక్రయానికి రానుంది.

# రోడ్డు ప్రమాదాలపై ఉక్కుపాదం..!

**42 బ్లాక్ స్పాట్ల వద్ద భద్రతా చర్యలు వేగవంతం**
**జనవరి-ఆగస్టు వరకు 349 ప్రమాదాలు.. 164 మంది మృతి**
**నిబంధనల ఉల్లంఘనలపై కఠిన చర్యలు**
**గోల్డెన్ అవర్‌లో వైద్యం అందేలా ఆసుపత్రుల మ్యాపింగ్**
**అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్**
**జిల్లా స్థాయి రహదారి భద్రతా కమిటీ సమావేశం**



**భద్రాద్రి కొత్తగూడెం(సింగిడి):** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. ప్రమాదాలు తరచూ చోటుచేసుకుంటున్న ప్రాంతాలను గుర్తించి, వాటికి గల కారణాలను క్షేత్ర స్థాయిలో సమగ్రంగా విశ్లేషించి, పునరావృతం కాకుండా శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. రోడ్డు భద్రత ఒక్క శాఖ బాధ్యత కాదని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించగలమని స్పష్టం చేశారు.

**8 నెలల్లో 349 ప్రమాదాలు.. 164 మంది మృతి**
ఐడీఓసీ కార్యాలయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి రహదారి భద్రతా కమిటీ సమావేశంలో జిల్లాలో నమోదైన ప్రమాదాలు, వాటి కారణాలు, ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాలు, బ్లాక్ స్పాట్ల వద్ద చేపట్టాల్సిన భద్రతా చర్యలపై అధికారులతో సమీక్షించారు. జనవరి 1 నుంచి ఆగస్టు 31 వరకు జిల్లాలో 349 రోడ్డు ప్రమాదాలు జరగగా 164 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వివరించారు. ఒక్క ఆగస్టు నెలలోనే 36 ప్రమాదాలు చోటుచేసుకోగా 14 మంది మృతి చెందినట్లు తెలిపారు. ఈ గణాంకాల నేపథ్యంలో ప్రమాదాల తీవ్రతను తగ్గించేందుకు తక్షణ, పటిష్ట చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.

**42 బ్లాక్ స్పాట్లపై ప్రత్యేక దృష్టి**
జిల్లాలో ఇప్పటికే 42 బ్లాక్ స్పాట్లను గుర్తించినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఆయా ప్రాంతాల్లో గతంలో జరిగిన ప్రమాదాలకు గల కారణాలను విశ్లేషించి, ఇంజినీరింగ్, రహదారి భద్రతా చర్యలను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలని సూచించారు. హెచ్చరికలు, సూచిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, రహదారి మార్కింగ్, అవసరమైన ఇతర భద్రతా సదుపాయాలను ఏర్పాటు చేసి, పనుల పురోగతిని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అతివేగం, మైనర్లకు వాహనాలు అప్పగించడం, హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగించకపోవడం వంటి నిబంధనల ఉల్లంఘనలే అనేక ప్రమాదాలకు కారణమవుతున్న నేపథ్యంలో విస్తృత అవగాహన కార్యక్రమాలతో పాటు కఠిన తనిఖీలు నిర్వహించాలని సూచించారు. రహదారులపై పశువుల సంచారం, ముఖ్యంగా రాత్రివేళల్లో ప్రమాదాలకు కారణమవుతున్నందున పశువులను రోడ్లపైకి వదిలే యజమానులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రహదారులపై ఏర్పడిన గుంతలను తక్షణమే పూడ్చివేయాలని, రహదారుల ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలు, పొదలను ఎప్పటికప్పుడు తొలగించాలని అధికారులను ఆదేశించారు.

**'గోల్డెన్ అవర్'పై ప్రత్యేక ప్రణాళిక**
ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులకు అత్యవసర వైద్యం అందేలా 'గోల్డెన్ అవర్'లో చికిత్స కీలకం కావడంతో బ్లాక్ స్పాట్లకు సమీపంలోని ఆసుపత్రులను మ్యాపింగ్ చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. అంబులెన్స్ సేవలు వేగంగా అందుబాటులోకి వచ్చేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేసి, నవీకరించాలని తెలిపారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అన్నారు. అధికారులు, వాహనదారులు, ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తేనే ప్రమాదాలను గణనీయంగా తగ్గించగలమని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా రవాణా అధికారి వెంకటరమణ, జిల్లా పంచాయతీ అధికారి అనూష, జిల్లా ఇంటర్మీడియట్ శాఖాధికారి వెంకటేశ్వర్లు, ఆర్‌అండ్‌బీ ఈఈ నాగేశ్వరరావు, కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్ఐ గడ్డం ప్రవీణ్‌కుమార్, ఐఆర్ఏడీ జిల్లా మేనేజర్ బాలాజీతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భూనిర్వాసితులకు ఎకరాకు 20 లక్షల పరిహారం ఇవ్వాలి

### ఎమ్మెల్యే కసిరెడ్డికి బాధితులు వినతి



**కల్వకుర్తి (సింగిడి):** వెల్దండ మండలంలోని అజిలాపూర్ గ్రామానికి చెందిన రైతుల భూములు డిండి-నార్లాపూర్ ఐ-82 ప్రాజెక్టులో భాగంగా ఇర్విన్-అజిలాపూర్ రిజర్వాయర్ నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న అజిలాపూర్ భూనిర్వాసితులు తమకు న్యాయమైన పరిహారం అందించాలని కోరారు. ఈ మేరకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని కలిసి సర్పంచ్ రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. నారాయణపేట్-కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.20 లక్షల పరిహారం కేటాయించిన విధంగానే, ఇర్విన్-అజిలాపూర్ రిజర్వాయర్ కోసం భూములు కోల్పోతున్న తమకు కూడా ఎకరాకు రూ.20 లక్షల పరిహారం అందించాలని భూనిర్వాసితులు ఎమ్మెల్యేను కోరారు. తమ భూములపై ఆధారపడి జీవిస్తున్న రైతులు ప్రాజెక్టు కారణంగా భూములను కోల్పోతున్న నేపథ్యంలో, ప్రభుత్వం తమ పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని సముచిత పరిహారం అందించాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లి, న్యాయం జరిగేలా కృషి చేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కోరారు.
ఈ కార్యక్రమంలో సిద్ధగోని రమేష్ గౌడ్, సర్పంచ్, భూనిర్వాసితులు గునిగంటి మహేష్, గుడిసె వెంకటయ్య, నెల్లపల్లి వెంకటయ్య, సల్వాది ప్రవీణ్, సల్వాది సురేష్, గునిగంటి గణేష్, గునిగంటి తిరుపతయ్య, జి. వెంకటయ్య, జి. దావలయ్య, జి. జంగయ్య, మాదారు, తోకల యాదయ్య, తోకల నర్సింహా, చాట్ల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## శంకర్ భవన్ పాఠశాలలో విద్యార్థుల నుండి జరిమానాల వసూళ్లపై విచారణ చేపట్టాలి



**నిజామాబాద్ ప్రతినిధి,(సింగిడి):** నిజామా బాద్ నగరంలోని కోటగల్లిలోని శంకర్ భవన్ ఉన్నత పాఠశా లలో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, సమగ్ర విచారణ చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా పీఈటి, హెచ్ఎం లు డబ్బుల వసూళ్లు చేస్తున్నారనీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పీడీఎస్ యు నగర కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ సురేష్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్ యు నగర సహాయ కార్యదర్శి ఆల్గోట్ సృజన్ మాట్లాడుతూ కోటగల్లిలోని శంకర్ భవన్ పాఠశాలలో విద్యార్థుల నుంచి నిబంధనలకు విరుద్ధంగా వివిధ రకాల జరిమానాలు, ఫీజులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. యూనిఫాం ధరించకుండా వచ్చిన విద్యార్థుల నుంచి రూ.10, రెండు జడలు వేసుకోకుండా వచ్చిన బాలికల నుంచి రూ.20 చొప్పున జరిమానాలు వసూలు చేస్తున్నట్లు విద్యార్థులు తెలిపారని పేర్కొన్నారు. పాఠశాలలో క్రమశిక్షణ ఉండాలి, విద్యార్థులు యూనిఫాం ధరించడం, పాఠశాల నిబంధనలను పాటించడం వంటి విషయాల్లో అవగాహన కల్పించడంలో తప్పులేదని, అయితే క్రమశిక్షణ పేరుతో విద్యార్థులపై బలవంతం చేయడం, ఆర్థిక జరిమానాలు విధించడం మాత్రం సమంజసం కాదన్నారు. చాలామంది విద్యార్థుల తల్లిదండ్రులు పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారని, యూనిఫాం కొనడానికి కూడా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలు ఉన్నప్పుడు, యూనిఫాం ధరించలేదనే కారణంతో జరిమానా ఎలా చెల్లించగలరని ప్రశ్నించారు. విద్యార్థుల కుటుంబ ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా వారిపై ఒత్తిడి చేయడం సరికాదన్నారు. విద్యార్థుల హక్కులను పరిరక్షిస్తూ, వారికి భయరహితమైన, ఆహ్లాదకరమైన , నాణ్యమైన విద్యా వాతావరణం కల్పించేందుకు జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని, సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. విద్యార్థులపై ఆర్థిక భారం మోపే విధానాలను నిలిపివేసి, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యు నాయకులు నితిన్, శ్రీశాంత్,రంజిత్,మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం

### అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం చిరస్మరణీయం: కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్



**నాగర్కర్నూల్ (సింగిడి):** వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ హాజరై చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....., చాకలి ఐలమ్మ తెలంగాణలో సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన మహనీయురాలని, అన్యాయం, దోపిడీ, అణచివేతకు వ్యతిరేకంగా ఆమె ప్రదర్శించిన తెగువ, పోరాట పటిమ, ఆత్మవిశ్వాసం సమాజానికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని జిల్లా కలెక్టర్ అన్నారు. సమాజంలో వెనుకబడిన, అణగారిన వర్గాలకు సామాజిక గౌరవం, సమాన హక్కులు, అభివృద్ధి అవకాశాలు కల్పించడంలో చాకలి ఐలమ్మ వంటి మహనీయుల పోరాటాలు కీలక పాత్ర పోషించాయని కలెక్టర్ తెలిపారు. ఆమె ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమాజంలోని ప్రతి ఒక్కరూ సమానత్వం, సామాజిక న్యాయం కోసం కృషి చేయాలని సూచించారు. చాకలి ఐలమ్మ జీవిత చరిత్ర, ఆమె పోరాటం, సమాజం పట్ల ఆమెకున్న నిబద్ధతను యువత తెలుసుకోవాల్సిన అవసరం ఉందని, ఆమె చూపిన ధైర్యం, ఆత్మగౌరవం, పట్టుదల నేటి తరానికి మార్గదర్శకంగా నిలవాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. ప్రభుత్వం బీసీ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ వివిధ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. విద్య, ఉపాధి, ఆర్థిక సాధికారత వంటి రంగాల్లో అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఇందిర, గిరిజన సంక్షేమ శాఖ అధికారి కోటయ్య, బీసీ సంక్షేమ సహాయ అధికారి శ్రీరాములు ,సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు, బీసీ సంఘాల ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొని చాకలి ఐలమ్మకు ఘనంగా నివాళు లర్పించారు.

## హాస్టల్‌లో బాలుడికి పాముకాటు

### వసతి గృహాలలో శుభ్రత లేకపోవడం కారణం



**కల్వకుర్తి (సింగిడి):** కల్వకుర్తి పట్టణ పరిధిలోని ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల బాలుర వసతి గృహంలో పాముకాటు ఘటన కలకలం రేపింది. హాస్టల్‌లో ఉంటూ 9వ తరగతి చదువుతున్న శివ (14) అనే విద్యార్థి ప్రమాదవశాత్తు పాముకాటుకు గురయ్యాడు. హాస్టల్ గదిలో విద్యార్థి ఉన్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. పాముకాటుకు గురైన విషయాన్ని గమనించిన వార్డెన్, హాస్టల్ సిబ్బంది, తోటి విద్యార్థులు వెంటనే స్పందించి శివను అత్యవసర వైద్యం కోసం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో వైద్యులు విద్యార్థికిఅవకాశం అత్యవసర చికిత్స అందించడంతో పాటు యాంటీ స్నేక్ వెనమ్ ఇంజెక్షన్లు ఇచ్చి వైద్య పర్యవేక్షణలో ఉంచారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విద్యార్థిని నాగర్ కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. సకాలంలో వైద్యం అందడంతో విద్యార్థికి ప్రాణాపాయం తప్పిందని, ప్రస్తుతం ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపినట్లు సమాచారం. దీంతో విద్యార్థి కుటుంబ సభ్యులు, హాస్టల్ సిబ్బంది, తోటి విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ప్రభుత్వ హాస్టల్ లో పాముకాటు ఘటన చోటుచేసుకోవడంతో అక్కడ వసతి పొందుతూ చదువుకుంటున్న ఇతర విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. హాస్టల్ పరిసరాలు, విద్యార్థులు నివసించే గదులను అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి, పాములు లోపలికి రాకుండా తగిన ముందస్తు చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ హాస్టల్ పరిసరాల్లో పరిశుభ్రత, పొదల తొలగింపు, గదుల తనిఖీలు వంటి చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# యంగ్ ఇండియా పాఠశాల భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

### ఎస్ఐఆర్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



**గద్వాల బ్యూరో (సింగిడి)::** కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ లో విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యాబోధన చేసేందుకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ముందుకెళ్తోందని భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం కేటి దొడ్డి మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన పనులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అకాడమిక్ బ్లాక్, డైనింగ్ హాల్, డార్మెటరీ, స్టాఫ్ క్వార్టర్స్, తదితర భవనాల పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. స్కూల్ పూర్తి డిజైన్ మ్యాప్ ను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఒప్పందం ప్రకారం భవన నిర్మాణాలను సకాలంలో పూర్తిచేసి అప్పగించాల్సిందిగా సంబంధిత గుత్తేదారును ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ సమీపంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. మండలంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై తహసిల్దార్ తో మాట్లాడారు. మ్యాపింగ్ కానీ, అనామిలిస్ జాబితాలో ఉన్న వారందరికీ నోటీసులు జారీ చేశాక నిర్దేశిత తేదీల్లో హియరింగ్ కు హాజరయ్యేలా చూడాలన్నారు. అవసరమైన వారికి కులధృవీకరణ పత్రాలను రెండు రోజుల్లోనే మంజూరు చేయాలని సూచించారు. అనంతరం కార్యాలయంలోని రికార్డు గది తో పాటు వివిధ విభాగాల్లో తిరిగి సిబ్బంది విధులపై ఆరా తీశారు. భూభారతి, సాదా బైనమా, తదితర దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. కార్యాలయాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో తహసిల్దార్ కరుణాకర్, ఎంపీడీవో రమణారెడ్డి, టీజీ డబ్ల్యూఐడిసి ఏఈ మోహన్ రెడ్డి, తదితరులున్నారు.

## కారేగాం తండాలో పర్యావరణ పరిరక్షణపై రైతులతో సమావేశం



**నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి):** చందూర్ మండలం కారేగాం తండాలో పృథ్వీ సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై రైతులతో గురువారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణాన్ని కాపాడుకోవా ల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అధికారులు రైతులకు వివరించారు. చెట్లు నరకడం చేయకూడదు, అక్రమంగా అటవీ భూమిని కబ్జా చేయకూడదు అలాంటి వారి మీద చట్టం ప్రకారం కఠినంగా శిక్ష విధించడం జరుగుతుందని అటవి అధికారులు హెచ్చరించారు. భూమి, నీరు, గాలి కాలుష్యాన్ని నివారించడం, ప్రకృతి వనరులను పరిరక్షించడం, పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణలో రైతులు భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఓ వీరసింగ్, సర్పంచ్ డా. రామావత్ లాల్ సింగ్, పుండలిక్ -ఎఫ్ఆర్ఓ, రాజు - ఎఫ్ఎస్ఓ, జాదవ్ కోటేశ్ - ఎఫ్ఎస్ఓ, ముంతాజ్, ఉప సర్పంచ్ తారాచంద్, వార్డు సభ్యులు, పెద్దలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రీయ విద్యాలయం కోసం.. విజయ డెయిరీ కేంద్రం మార్పు!

**లక్ష్మీదేవిపల్లి నుంచి చుంచుపల్లికి పాల శీతలీకరణ కేంద్రం మార్పు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ అంకిత్ ఆదేశం**
**30 గ్రామాలు.. 400 మంది రైతులకు అనుసంధానం**
**ప్రస్తుతం రోజుకు 500 లీటర్లు.. సీజన్‌లో 4 వేల లీటర్ల వరకు సేకరణ**



**భద్రాద్రి కొత్తగూడెం, (సింగిడి)::** కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని త్వరగా అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా విజయ మినీ పాల శీతలీకరణ కేంద్రాన్ని చుంచుపల్లికి తరలించే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. లక్ష్మీదేవిపల్లి మండల కేంద్రంలోని ప్రస్తుత విజయ మినీ పాల శీతలీకరణ కేంద్రాన్ని గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన.. కేంద్రం తరలింపు, కొత్త కేంద్రం ఏర్పాటుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.

**కేవీ కోసం స్థలం ఖాళీ.. డెయిరీకి కొత్త వేదిక**
లక్ష్మీదేవిపల్లిలో ప్రస్తుతం విజయ మినీ పాల శీతలీకరణ కేంద్రం కొనసాగుతున్న స్థలాన్ని కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు అందుబాటులోకి తీసుకురావాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు. చుంచుపల్లిలో విజయ డెయిరీ కోసం ఇప్పటికే స్థలం కేటాయించినందున, అదే ప్రాంతంలో మినీ పాల శీతలీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించే కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు స్థలం అందుబాటు లోకి రావడంతోపాటు, పాల రైతులకు కూడా ప్రయోజనం కలిగేలా ప్రత్యామ్నాయ కేంద్రం సిద్ధం చేయాలని ఆదేశించారు.

**30 గ్రామాలు.. 400 మంది రైతులు**
లక్ష్మీదేవిపల్లి కేంద్రం పరిధిలో సుమారు 30 గ్రామాలకు చెందిన 400 మంది రైతులు పాల సేకరణకు అనుసంధానమై ఉన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుతం రోజుకు సుమారు 500 లీటర్ల పాలు సేకరిస్తుండగా, పాల ఉత్పత్తి అధికంగా ఉండే సీజన్‌లో రోజువారీ సేకరణ 4,000 లీటర్ల వరకు పెరుగుతుందని తెలిపారు. ఉదయం, సాయంత్రం నిర్ణీత సమయాల్లో పాలు సేకరించి ఖమ్మం డెయిరీకి తరలిస్తున్నట్లు వివరించారు.

**కూలింగ్ ట్యాంకులు.. పరికరాల పరిశీలన**
కేంద్రంలోని కూలింగ్ ట్యాంక్, స్టోరేజ్ వ్యవస్థ, కంప్రెసర్ తదితర పరికరాలను కలెక్టర్ పరిశీలించారు. పాల సేకరణ, శీతలీకరణ ప్రక్రియతో పాటు ప్రస్తుతం అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, పరికరాల పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా చుంచుపల్లిలో కొత్త కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సిన అంశంపై అధికారులతో చర్చించారు. కేంద్రాన్ని తరలించే సమయంలో పాల సేకరణకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులు ఇబ్బందులు పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పూర్తి చేసి, నూతన కేంద్రం అందుబాటులోకి వచ్చిన వెంటనే మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాల సేకరణ, రవాణా, శీతలీకరణ వ్యవస్థలో ఎలాంటి అంతరాయం రాకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

**విద్యార్థులకు విద్య.. రైతులకు ప్రయోజనం**
చుంచుపల్లిలో విజయ మినీ పాల శీతలీకరణ కేంద్రం ఏర్పాటు చేయడం ద్వారా పాల రైతులకు మరింత సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఒకవైపు కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు అవసరమైన స్థలం అందుబాటులోకి తీసుకురావడం, మరోవైపు పాల రైతుల ప్రయోజనాలను కాపాడటం లక్ష్యంగా పనులను సమన్వయంతో వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్ శిరీష, విజయ డెయిరీ మేనేజర్ సౌజన్య, సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



**కల్వకుర్తి (సింగిడి):** తుక్కుగూడ లోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుంకిరెడ్డి జాబ్ డ్రైవ్‌లు నిరంతరంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం తుక్కుగూడలోని ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీలో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూ కార్యక్రమం నిర్వహించారు. ఈ జాబ్ డ్రైవ్‌కు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
కల్వకుర్తి నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి మొత్తం 35 మంది నిరుద్యోగ యువత ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఇందులో వెల్దండ మండలం నుంచి 11 మంది, కల్వకుర్తి మండలం నుంచి 7 మంది, ఆమనగల్ మండలం నుంచి 16 మంది, తలకొండపల్లి మండలం నుంచి ఒకరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించ డమే ప్రధాన లక్ష్యంగా జాబ్ డ్రైవ్‌లను నిరంతరంగా కొనసాగిస్తున్నామని తెలిపారు. ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న యువతకు అందుబాటులోకి వచ్చే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని సూచించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. యువత తమ అర్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా లభించే ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు వీర, మహేష్, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు చంద్రశేఖర్‌తోపాటు ఇంటర్వ్యూలకు హాజరైన నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి




**కల్వకుర్తి (సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేదలకు మేలు జరుగుతోందని పడకల్ గ్రామ సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి అన్నారు. తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో గురువారం అర్హులైన లబ్ధిదా రులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ రాఘవేందర్ గౌడ్, వార్డు సభ్యులతో కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సంద ర్భంగా సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ,ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత వేగంగా, పారదర్శకంగా అందించేందుకు స్మార్ట్ రేషన్ కార్డులు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డులు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తమ కుటుంబాలకు ఉపయోగపడే రేషన్ కార్డులు అందించినందుకు సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, జీపీఓ, రేషన్ డీలర్లు, వార్డు సభ్యులు, లబ్ధిదారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంబిబిఎస్‌లో సీటు సాధించిన నారాయణ బెస్ట్ ఫౌండేషన్ స్కూల్ విద్యార్థికి సన్మానం

**మధిర, (సింగిడి):** దెందుకూరు గ్రామానికి చెందిన చుంచు వేణుగోపాల్ కుమారుడు సాయి గోకుల్ ఖమ్మం మమతా మెడి కల్ కాలేజీలో ఎంబిబిఎస్‌లో ఫ్రీ సీట్ సాధించిన సందర్భంగా మధిర నారాయణ బెస్ట్ ఫౌండేషన్ స్కూల్ యాజమాన్యం బోనగిరి నారాయణ రావు, ప్రిన్సిపాల్ వనజ, అధ్యాపక బృందం సాయి గోకుల్ ను ఘనంగా సన్మానించారు.





# ప్రభుత్వ విద్యా సంస్థలకు కనీస సౌకర్యాలు కల్పించాలి

### ప్రైవేటు పాఠశాలల ఫీజు దోపిడీలను అరికట్టాలని సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా



**నారాయణపేట ప్రతినిధి,(సింగిడి):** ప్రభుత్వ విద్య సంస్థలలో కనీస సౌకర్యాలు కల్పించాలని, ప్రైవేట్ పాఠశాలల ఫీజు దోపిడిని అరికట్టాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు (సిపిఎం )పార్టీ ఆధ్వర్యంలో గురువారం రోజు నారాయణపేట జిల్లా కేంద్రంలోని మునిసిపల్ పార్క్ దగ్గర ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా నుద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి జి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ....నారాయణపేట జిల్లా లోని ప్రభుత్వ పాఠశాలలో, కాలేజీలలో కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పిఈటి, ఎం ఈ ఓ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యాసం వత్సరం ప్రారంభంలో ప్రతి విద్యార్థికి పుస్తకాలు, నోట్ పుస్తకాలు ,ఏకరూప దుస్తులు, బూట్లు అందించడంలో విఫలమయ్యారని అన్నారు. అన్ని విధాలుగా వెనుక బాటుకు గురైన నారాయణపేట జిల్లాకు ప్రభుత్వ డీఈడీ ,బీఈడీ, పీజీ ఇంజనీరింగ్ ,పాలిటెక్నిక్ తదితర విద్యాసంస్థలను నెలకొల్పాలన్నారు. జిల్లా నుంచి తరలించిన సైనిక పాఠశాల పాలిటెక్నిక్ కాలేజీలను వెనక్కి తీసుకొని రావలన్నారు. ప్రైవేటు పాఠశాలలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న జిల్లా విద్య అధికారులు నిమ్మకు నీరెత్తిన్నట్లు ఉండడం శోచనీయమన్నారు. నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలల పైన జిల్లా విద్యాధికా రులు చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారని విమర్శించారు . జిల్లాలో చాలా ప్రైవేట్ పాఠశాలలకు క్రీడ మైదానం ట్రైనింగ్ టీచర్లతో విద్యాబోధన చేయకపోవడం, ల్యాబ్ కంప్యూటర్ తదితర అసౌకర్యాలతో నడుపుతున్నప్పటికీని యజమాన్యం ఫీజు లు మాత్రము విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని అప్పుడే బడుగు బలహీన వర్గాలకు చదువు అందుతుందన్నారు. నాడు విద్యా దానం మహాదానం అన్న నానుడి నుంచి నేడు విద్య ధనం ద్వారానే సిద్ధిస్తుంది అనే నానుడికి చేరిందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం విద్యకు అరకొర నిధులు కేటాయిస్తున్నదని బడ్జెట్లో 10 శాతం నిధులు కేటాయించడం కేటాయించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో మంచినీరు విద్యుత్తు ప్రహరీ గోడలు వంట గదులు తదితర కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇటీవల పాఠశాలలో పాఠం వింటున్న విద్యార్థి పాము కాటుకు బలి అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని పాఠశాలల కిటికీలు జాలీలు ఏర్పాటు చేయాలని అన్ని పాఠ శాలల చుట్టూ పరిశుభ్రతను కాపాడాలని అన్నారు. ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఉద్మల్గిద్దా గోపాల్ ,బండమీది బలరాం, అంజిలయ్య గౌడ్ ,పుంజనూర్ ఆంజనేయులు ప్రసంగించారు.
అనంతరం వివిధ డిమాండ్లతో కూడుకున్న వినతి పత్రం కలెక్టరేట్కు వెళ్లి ఏవో అనిల్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు కే కాశప్ప జోషి,నరహరి, శివకుమార్, దస్తప్ప గోవింద్ రాజ్,సోఫీ మజార్ హుస్సేన్,హన్మంతు, ప్రకాష్,చుక్క గోవిందు,పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ రామావత్ లాల్‌సింగ్‌కు ఘన సన్మానం



**నిజామాబాద్ ప్రతినిధి,(సింగిడి):** చందూర్ మండలం కారేగాం తండా సర్పంచ్ డాక్టర్ రామావత్ లాల్‌సింగ్ పి. హెచ్.డి డాక్టరేట్ పొందడంతో మండల కేంద్రంలో మాజీ డిసిసిబి అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి లాల్‌సింగ్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతం నుంచి కష్టపడి ఉన్నత విద్యను అభ్యసించి డాక్టరేట్ సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్ర మంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డా.కడాక్టర్ కూనిపూర్ రాజారెడ్డి, మాజీ సర్పంచ్ సాయి రెడ్డి, చందూర్ సొసైటీ చైర్మన్ అశోక్, సర్పంచులు రవి, ఉమారాణి, సంజీవ్, కృష్ణ, రవి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీనివాస్ లు డాక్టర్ రామావత్ లాల్‌సింగ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభాతనవ సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శుక్రవారం
11-9-2026

మట్టి గణపతిని పూజిద్దాం

# పర్యావరణాన్ని రక్షిద్దాం

**ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్**

**ఘనంగా ముందస్తు వినాయక చవితి సంబరాలు**



**జమ్మికుంట, (సింగిడి):** జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి.రమేష్ అధ్యక్షతన గురువారం ముందస్తు వినాయక చవితి పండుగ సంబరాలు జరుపుకున్నారు. దీనిలో భాగంగా విద్యార్థులు పర్యావరణ హితమైన మట్టి వినాయకులను తయారు చేసి పువ్వులు పత్రాలతో అందంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి. రమేష్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మన అందరి భాధ్యతగా ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. సీసం, క్రోమియం, పాదరసం వంటి మూలకాలు భూమిలో చేరడం వల్ల మానవుడు తీసుకొనే ఆహారం తో మనిషిలోకి విష రసాయనాలు చేరుతున్నాయన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ తో తయారు చేసే విగ్రహాలు నీటిలో కరగడానికి సంవత్సరాలు పడుతుందని అన్నారు. మట్టి తో తయారు చేసే విగ్రహాలు నీటిలో త్వరగా కరుగుతాయన్నారు.మట్టి గణపతులను వినియోగించే విధంగా విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ - ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ఓదెలు కుమార్ , స్టాఫ్ సెక్రటరీ డాక్టర్ కే గణేష్, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎంబాడి రవి. లోఖండే రవీందర్,అధ్యాపకులు డాక్టర్ ఏం శ్యామల, డాక్టర్ కే మాధవి, డాక్టర్. సీ రాజకుమార్ , వి.కిరణ్ కుమార్, ఉమా కిరణ్ , ఏన్ మమత, డాక్టర్ పీ.సుష్మ, డాక్టర్ పీ.రవి ప్రకాశ్, డాక్టర్ ఏన్ శ్రీనివాస్, డాక్టర్. పీ స్వప్న, ఏ రమేష్, ఏం. సాయి కుమార్ , ఏస్ దీనా జీ అనూష, డాక్టర్.వీ వనిత , వలంటీర్లు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు..

పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా

# మట్టి గణపతుల పంపిణీ

**ప్రతి ఇంటా మట్టి గణపతిని ప్రతిష్ఠించాలి: మేయర్ కొలగాని శ్రీనివాస్**



**కరీంనగర్,(సింగిడి):** వినాయక చవితిని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నగరంలోని 66 డివిజన్ల ప్రజలకు మట్టి గణపతి ప్రతిమలను ఉచితంగా అందిస్తున్నట్లు మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు.గురువారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బందితో కలిసి మేయర్ విగ్రహాల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి ఏటా మట్టి గణపతులను పంపిణీ చేస్తున్నా మని తెలిపారు. ఈ ఏడాది సుమారు 15 వేల మట్టి గణపతి ప్రతిమలను సిద్ధం చేసి, ఒక్కో డివిజన్‌కు సుమారు 250 చొప్పున అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.రసాయన రంగులతో తయారయ్యే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమై పర్యావరణానికి హాని కలిగే అవకాశం ఉందన్నారు. మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా పర్యావరణంతో పాటు జలవనరులను పరిరక్షించవచ్చని చెప్పారు.భక్తితో పాటు పర్యావరణ హితాన్ని కూడా కాపాడాలి. ప్రతి ఇంటా మట్టి గణపతిని ప్రతిష్ఠించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి" అని మేయర్ ప్రజలకు పిలుపునిచ్చారు. నగరపాలక సంస్థ చేపడుతున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలకు ప్రజలు సహకరించి, వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో పాటు పర్యావరణ హితంగా నిర్వహించాలని కోరారు.కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, కార్పొరేటర్లు రవీందర్ సింగ్, చాడగొండ బుచ్చిరెడ్డి, సరిళ్ల ప్రసాద్, కాంతాల జగన్ రెడ్డి, తాటి ప్రభావతి, గుగ్గిళ్ల జయశ్రీతో పాటు పలువురు నాయకులు, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్ గారు స్పందించండి..

**ఓపెన్ జిమ్‌లో విరిగిన పరికరాలు**



**జమ్మికుంట,(సింగిడి):** ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఓపెన్ జిమ్ లో కొన్ని ఎక్సర్సైజు చేసే మిషన్లు రిపేర్ కు వచ్చి ఇక్కడికి వచ్చే వాకర్స్ తో పాటు జిమ్ చేసే వారికి ప్రమాదాలు జరుగుచు న్నవి. ప్రభుత్వ డిగ్రీ కళా శాల మైదానంలో ఏర్పాటు చేసిన ఓ పెన్ జిమ్ లో కొన్ని పరికరాలు రిపేరుకు రావడంతో ఆ విషయం తెలవని ప్రజలు వాటిని ఉపయోగించడం వల్ల ప్రమాదా లు జరుగుచున్నది. ముఖ్యంగా ఓ పెన్ జిమ్ లో మహిళలు పిల్లలు వృద్దులు ఉపయోగిస్తున్నారని వారికి తెలియక వాటి పైన వ్యాయా మం చేస్తున్న సమయంలో అవి విరిగి పడుతున్నాయి. కమిషనర్ గారు మీరు వెంటనే స్పందించి వాటిని సరి చేయాల్సిందిగా వాకర్స్ కోరుతున్నారు.

ఐలమ్మ పోరాట స్ఫూర్తితో

# ఉద్యమాలకు ఊపిరి పోయాలి..



**మోటకొండూరు: (సింగిడి):** మోటకొండూరు మండల పరిధిలోని వర్టూరు గ్రామ పంచాయతీ ఆవరణలో వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి కార్యక్రమాన్ని వర్టూరు గ్రామ రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వీరనారి చాకలి ఐలమ్మ తెలంగాణ రైతాంగ భూ పోరాటానికి ధైర్యం, తెగువకు ప్రతీకగా నిలిచారని కొనియాడారు. నాటి భూస్వామ్య, దొరల పెత్తనానికి వ్యతిరేకంగా ఐలమ్మ సాగించిన పోరాటం పేదలు, రైతులు,కూలీలలో ఆత్మవిశ్వాసాన్ని నింపిందన్నారు. తన భూమిని కాపాడుకోవడంతో పాటు అన్యాయానికి,అణచివేతకు వ్యతిరేకంగా ఆమె చూపిన ధైర్యం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. సామాజిక వివక్షను,దొరల పెత్తనాన్ని ఎదుర్కొంటూ ఐలమ్మ చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, భూమి కోసం,భుక్తి కోసం,వెట్టి చాకిరీ విముక్తి కోసం జరిగిన రైతాంగ పోరాటంలో ఆమె పాత్రను ఎప్పటికీ మరువరాదని అన్నారు. మహిళలు కూడా సామాజిక మార్పు కోసం ముందుండి పోరాడగలరని నిరూపించిన ధీశాలి చాకలి ఐలమ్మ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గట్టికొప్పుల సరిత మచ్చేందర్,వంగపల్లి పాక్స్ చైర్మన్ నెమ్మని సుబ్రహ్మణ్యం,గట్టికొప్పుల మల్లయ్య, వెంకన్న, మచ్చయ్య, జహంగీర్,మచ్చేందర్,నవీన్,స్వామి, శ్రీకాంత్,గ్రామ కుల సంఘాల పెద్దలు,గ్రామ వార్డు సభ్యులు పల్లె వెంకన్న,కడకంచి కుమార్,నోముల మహేందర్,కారోబార్ రోషయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడిగా ఎండి ఇమ్రాన్



**నియామక పత్రం అందించిన రాష్ట్ర అధ్యక్షుడు**
**అభినందించిన మంత్రి పొన్నం ప్రభాకర్**
**ప్రణవ్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఇమ్రాన్**

**జమ్మికుంట,(సింగిడి):** కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ కార్యకర్తకు సరైన సమయంలో సరైన గుర్తింపు లభిస్తుందని అందుకు నిదర్శనమే విద్యార్థి నాయకుడు ఎండి ఇమ్రాన్ ను ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షుడిగా నియమించడం. విద్యార్థి దశ నుండి విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషిచేసిన యువ నాయకుడు జమ్మికుంట పట్టణవాసి ఎండి ఇమ్రాన్ కు కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థ అయిన ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షుడిగా నియమించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేస్తూ తన నియామకానికి సహకారం అందించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఇమ్రాన్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీలో విద్యార్థి నాయకుడిగా కాలేజీ అధ్యక్షుడిగా మొదలై ఆ తర్వాత ఎన్ ఎస్ యు ఐ నియోజకవర్గ కోఆర్డినేటర్గా జిల్లా ప్రధాన కార్యదర్శిగా జిల్లా ఉపాధ్యక్షులుగా హుజరా బాద్ ఎమ్మెల్యే ఎన్నికల ఇన్చార్జిగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కరీంనగర్ జిల్లా కోఆర్డినేటర్ గా విశిష్ట సేవలు అందించడం జరిగిందని తెలిపారు. గత పది సంవత్సరా లుగా విద్యార్థులకు చేస్తున్న సేవలను విద్యార్థుల పక్షాన చేస్తున్న పోరాటానికి ప్రతిఫలంగా కష్టపడ్డ కార్యకర్తను గుర్తించి ఎన్ఎస్యుఐ జిల్లా అధ్యక్షుడిగా నియమించడం సంతోషంగా ఉందని ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడు ఎడవెల్లి వెంకటస్వామి కి మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌కు కరీంనగర్ జిల్లా డీసీసీ అధ్యక్షులు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆల్ ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి తోపాటు హుజరాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ యువ నాయకుడు ప్రణవ్ లకు రుణపడి ఉంటానని వారి ఆదేశాల మేరకు నడుచుకుంటూ విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని తెలిపారు.



## ఐలమ్మ స్ఫూర్తి ప్రజలకు ఆదర్శం: మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని

**జమ్మికుంట, (సింగిడి):** వీరనారి చిట్యాల ఐలమ్మ స్ఫూర్తి ప్రజలకు ఆద ర్శంగా నిలిచిందని హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని కొనియాడారు. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ పట్టణంలో రజక యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నిమ్మ టూరి సాయి కృష్ణ అధ్యక్షతన వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని, పట్టణ సీఐ కరుణాకర్ హాజరై రజక సంఘం పట్టణ అధ్య క్షుడు కొండపాక శ్రీనివాస్‌తో కలిసి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివా ళులర్పించారు. భూమి కోసం.. భుక్తి కోసం.. వెట్టిచాకిరీ విముక్తి కోసం పోరాడిన ఘనత వీరనారి చాకలి ఐలమ్మకే దక్కుతుందన్నా రు. తెలంగాణ ప్రజల తెగువను ప్రపంచా నికి చాటిన నిప్పుకణికగా చాకలి ఐలమ్మ చరి త్రలో నిలిచిపోయారని కొనియాడారు. అణగా రిన వర్గాల హక్కుల కోసం ఆమె ప్రదర్శించిన ధైర్యం, పోరాట పటిమ, త్యాగం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.



**ఐలమ్మ పోరాటం చరిత్రలో చిరస్థానం**

దొరల పెత్తనం, వెట్టిచాకిరీ, సామాజిక వివక్షకు వ్యతిరేకంగా ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ రైతాంగ పోరాటానికి స్ఫూర్తిని చ్చిందని తెలిపారు. సాధారణ కుటుంబంలో జన్మించిన ఐలమ్మ అన్యాయాన్ని ఎదిరించి, తన హక్కుల కోసం వెనుకడుగు వేయకుండా పోరా డిన ధీరవనిత అని గుర్తుచేశారు. ఐలమ్మ చూపి న తెగువ వల్ల అణగారిన ప్రజల్లో హక్కుల కోసం పోరాడాలనే చైతన్యం పెరిగిందని అన్నారు. ఆమె జీవిత చరిత్రను నేటి యువత తెలుసుకొని, సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఐలమ్మ ఆశయాలను కొనసాగించడమే ఆమెకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావడానికి ఐలమ్మ వంటి వీరనారుల పోరాట చరిత్ర స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో కౌన్సి లర్లు కోయాల్కర్ భారతి, సొల్లు సునీత, వెంక న్న, రజక సంఘం ప్రధాన కార్యదర్శి కొలిపాక శ్రీనివాస్, కొలిపాక సారయ్య, నల్ల బాలరాజు, కొలిపాక శంకర్, సుంకరి రాజమౌళి, కొలిపాక పోచయ్య, కొలిపాక శ్రీనివాస్, కొలిపాక రవి, ప్రజా సంఘాల నాయకులు, జనార్ధన్, తాళ్లపల్లి శ్రీనివాస్, తాళ్లపల్లి రమేష్, వేల్పుల ప్రభాకర్, రత్నం, కొలిపాక సమ్మయ్య, సొల్లు బాబు, చిలకమర్రి శ్రీనివాస్, కొండపాక పవన్ కుమా ర్, కే క్రాంతి కుమార్, కొలిపాక రంగయ్య, సైదాపూర్ మాజీ ఎంపీపీ వెంకట్రాజం, చిల కమర్రి శ్రీనివాస్‌తోపాటు నాయకులు, యువజన సంఘం ప్రతినిధులు, ప్రజా సం ఘాల నాయకులు, విద్యావంతులు, మహిళలు, వివిధ వర్గాల ప్రజలు పాల్గొని ఐలమ్మకు ఘనంగా నివాళులర్పించారు.

# క్రీడలతో మానసిక ఉల్లాసం, వ్యక్తిత్వ వికాసం

**అల్ఫోర్స్ పాఠశాలలో 70వ ఎస్‌జీఎఫ్ మండలస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం**

**అల్ఫోర్స్ విద్యాసంస్థల నిర్వాహకులు మల్లారెడ్డి**



**కరీంనగర్,(సింగిడి):** విద్యా ర్థుల జీవితంలో క్రీడలు కీలకపాత్ర పోషిస్తా యని, క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు ఒత్తిడి నుంచి ఉపశమనం, వ్యక్తిత్వ వికాసం, పోటీ తత్వం, సోదరభావం పెంపొందుతా యని అల్ఫోర్స్ విద్యాసంస్థల నిర్వాహకులు మల్లా రెడ్డి అన్నారు. స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో 70వ ఎస్‌జీఎఫ్ కొత్తపల్లి (హెచ్) మండల స్థాయి అండర్-14, అండర్-17 బాలికల కబడ్డీ, ఖోఖో, వాలీ బాల్, అథ్లెటిక్స్ పోటీలను మండల విద్యాశాఖ అధికారి తుమ్మ ఆనందం తో కలిసి ఆయన ప్రారంభించారు. మల్లారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు వివిధ క్రీడల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించడంతో పాటు క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలని సూచించారు. నేటి పోటీ ప్రపంచంలో క్రీడలు ప్రతి ఒక్కరికీ అవసరమని, క్రీడల ద్వారా సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందవచ్చని తెలిపారు. విద్యతో పాటు క్రీడలకు అల్ఫోర్స్ విద్యాసం స్థలు సమాన ప్రాధాన్యత ఇస్తున్నా యని, విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడా పోటీలు నిర్వహిస్తూ నిపుణులచే శిక్షణ అందిస్తున్నా మని చెప్పారు. మండల విద్యా శాఖ అధికారి తుమ్మ ఆనందం మాట్లాడుతూ క్రీడల్లో చురుకుగా పాల్గొనే విద్యార్థులు చదువులోనూ ముందంజలో ఉంటారని అన్నారు. విద్యార్థులకు నిపుణులైన కోచ్‌ల ద్వారా శిక్షణ అందించడం, వివిధ స్థాయిల్లో నిర్వహించే పోటీలకు ప్రోత్సాహం అందించడం అభినందనీయమ న్నారు. ఈ పోటీలకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన సుమారు 400 మంది క్రీడాకారులు హాజరయ్యారు. పోటీలకు వచ్చిన క్రీడాకా రులు, ఉపాధ్యాయులు, కోచ్‌లు, జట్టు నిర్వా హకులకు అల్ఫోర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బస్సీలాల్, మండల నిర్వహణ కార్యదర్శి గిన్నె లక్ష్మణ్, పీడీలు ఎల్.వి. రమణ, వి. శ్రీనివాస్, ఏ. శ్రీనివాస్, సుష్మ, ఓం ప్రకాష్, వివిధ పాఠశాలల ప్రతినిధులు, జట్టు నిర్వాహకులు, కోచ్‌లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సైబర్ భద్రతపై విద్యార్థులకు అవగాహన

**డిజిటల్ యుగంలో వ్యక్తిగత సమాచారం, మహిళల ఆన్‌లైన్ భద్రతపై ఒకరోజు శిక్షణ**

**శాతవాహన విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్**



**కరీంనగర్, (సింగిడి):** డిజిటల్ యుగంలో సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండటంతో పాటు వ్యక్తిగత సమాచారాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందని శాతవాహన విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ యు. ఉమేష్‌కుమార్ అన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయం 100 రోజుల విద్యా సాధికారత కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల స్వయంప్రతిపత్తి సామాజిక శాస్త్రాల విభాగం, శాతవాహన విశ్వవిద్యాలయ న్యా య కళాశాల సహకారంతో గురువారం కళా శాల ప్రాంగణంలో 'డిజిటల్ యుగంలో సైబర్ భద్రత' అంశంపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫె సర్ ఉమేష్‌కుమార్ మాట్లా డుతూ, సైబర్ భద్రతతో పాటు డిజిటల్ సాంకేతికతను బాధ్యతాయుతంగా విని యోగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. విద్యార్థుల్లో సైబర్ అవగాహన, డిజిటల్ బాధ్య తను పెంపొం దించాల్సిన అవసరం ఉందని ప్రిన్సిపాల్ వరలక్ష్మి పేర్కొన్నారు. శాతవాహన విశ్వ విద్యా లయ న్యాయ విభాగానికి చెందిన ఫబ్హా అఫ్రీన్, ప్రియా రాఘవేంద్ర శిక్షణ ఇచ్చారు. సైబర్ నేరాలు,ఆన్‌లైన్ భద్రత, వ్యక్తిగత సమా చార పరిరక్షణ, మహి ళల ఆన్‌లైన్ భద్రత, సైబర్ ముప్పుల నివారణ, న్యాయ సహాయం తదితర అంశాలపై విద్యా ర్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి విశ్వ విద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. సతీష్ కుమార్, న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. పద్మావతి హాజరై, సైబర్ భద్రత, న్యాయ అవగాహన, బాధ్యతాయుతమైన డిజిటల్ పౌరసత్వం ప్రాధాన్యతను వివరిం చారు. కార్యక్రమంలో కళాశాల ఉప ప్రిన్సిపాల్, కార్యక్రమ సమన్వ యకర్త డాక్టర్ అఫ్సరీ ఉస్మాని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిస్వార్థ సేవకునికి దక్కిన అరుదైన దక్కిన గౌరవం

**ఉమ్మడి జిల్లా కాటన్ వెల్ఫేర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బచ్చు భాస్కర్**

**జమ్మికుంట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం**



**జమ్మికుంట, (సింగిడి):** జమ్మికుంట పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త బచ్చు భాస్కర్‌కు అరుదైన గౌరవం దక్కింది. వ్యాపార రంగా ల్లో స్వార్థం లేని సేవలు అందించే వ్యక్తికి తగిన గుర్తిం పు, గౌరవం ఎల్లప్పుడూ లభిస్తాయని ప్రముఖ వ్యాపా వేత్త, సమాజ సేవకుడు బచ్చు భాస్కర్ నిరూపించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాటన్ వెల్ఫేర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బచ్చు భాస్కర్ ను ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జమ్మికుంట ప్రాంతంలో ఏ రకమైన సామాజిక, సేవా, తోపాటు సాంస్కృతిక సేవలు చేయ డం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి కావలసిన సదుపాయాలు ఏర్పాటు చేసి వారికి అండగా నిలిచిన గొప్ప మానవతావాది బచ్చు భాస్కర్. జమ్మికుంట మండల పరిసర ప్రాంతాలలో ఏ కార్యక్ర మాలు జరిగినా ఆయన ప్రమేయం లేకుండా ఏ ఒక్క కార్యక్రమం విజయవంతం కాదని అనడం అతియో శక్తి కాదు. గతంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్య క్షుడిగా వ్యాపారుల సంక్షేమానికి రైతులకు, మిల్లర్లకు మధ్య మంచి సంబంధాలు నెలకొల్పడానికి ఎనలేని సేవలు అందించారు. బస్సు భాస్కర్ కు ఈ గౌరవం దక్కడంతో పట్టణంలోని వ్యాపారులు కార్మికులు కర్షకులు రాజకీయ నాయకులు రైతులు ఆయనకు శు భాకాంక్షలు తెలుపుతూ అభినందించారు.

**ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం**

ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాటన్ మిల్లర్స్ వెల్ఫే ర్ అధ్య క్షుడిగా ఎన్నికైన బచ్చు భాస్కర్ ను జమ్మికుంట ఆర్య వైశ్య సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు లెంకల పల్లి శరత్ మాట్లాడుతూ, వ్యాపార రంగంలో తనదైన ముద్ర వేసుకొని ఎంతో మందికి ఆదర్శంగా నిలిచిన బచ్చు భాస్కర్‌కు దక్కిన ఈ గౌరవం ప్రతి వ్యాపారికి అంకితం అని ఆయన ఎంతోమందికి ఆదర్శంగా నిల వాలని ఆకాంక్షించారు. భవిష్యత్తు తరాలకు మార్గదర్శ కులు గా బచ్చు భాస్కర్ తన సేవలను అందించి మరింత ఉన్నతమైన పదవులు పొంది సేవలను అం దించాలని అన్నారు. అనంతరం బచ్చు భాస్కర్ మాట్లా డుతూ, ఉమ్మడి జిల్లా కాటన్ వెల్ఫేర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగిం చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో కాటన్ రంగ అభివృద్ధికి, వ్యాపారుల హక్కుల పరిరక్షణకు శక్తివంచన లేకుండా కృషి చేస్తా నని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు లెంకలపల్లి శరత్, నగేష్, రవీందర్, శ్యామ్, శ్రీధర్, కృష్ణమూర్తి, శ్రీనివాస్, రమేష్, సురేందర్ పట్టణ ప్రముఖులు పాల్గొని భాస్కర్ కు శు భాకాంక్షలు తెలిపారు.



**బచ్చు భాస్కర్ ను సన్మానించిన కౌన్సిలర్ రమేష్**

ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాటన్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన బచ్చు భాస్కర్ ను జమ్మికుంట మున్సిపల్ కౌన్సిలర్ ఒగ్గు రమేష్, ప్రముఖ వ్యాపారవేత్త ఆర్యవైశ్య సంఘం మాజీ మండలాధ్యక్షుడు ఎలిమిళ్ళ రాజేంద్రప్రసాద్ శాలువాతో సన్మానించి సత్కరించారు.

ఎల్ఎండీ నుంచి కాకతీయ కాలువకు

## వెంటనే నీటిని విడుదల చేయాలి

**బీఆర్ఎస్ రైతు సంఘం అధ్యక్షుడు కొండల్ రెడ్డి**



**జమ్మికుంట, (సింగిడి):** హుజూరాబాద్ నియోజ క వర్గంలో తాగు, సాగునీటికి తీవ్ర ఇబ్బం దులు ఉన్నాయనికనీసం రెండు తడుల నీళ్లు పంటలకు ఇచ్చి చెరువు లు నింపాలనిబీఆర్ఎస్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎడవెల్లి కొండల్ రెడ్డి డిమాండ్ చేశారు. లోయర్ మానేరు డ్యామ్ (ఎల్ఎండీ)లో ప్రస్తుతం సుమా రు 10 టీఎంసీల మేర నీరు నిల్వ ఉన్నందున, ప్రభుత్వం వెంటనే స్పందించి కాకతీయ కాలువ ద్వారా నీటిని విడు దల చేయాలని కొండల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆయన మాట్లా డుతూ... హుజూరాబాద్ నియోజకవర్గ పరిధిలో తాగునీటికి, సాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నా యని ఆందోళన వ్యక్తం చేశారు. కాలువల ద్వారా కనీసం రెండు తడులైనా నీటిని విడుదల చేస్తే గ్రామాల్లోని చెరు వులు, కుంటలను నింపుకోవడానికి అవకాశం ఉంటుంద న్నారు. చెరువులు నింపడం వల్ల భూగర్భ జలాలు పెరిగి, అటు రైతులకు పంటలకు మరియు ప్రజ లకు తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయని పేర్కొన్నారు. ఎల్ఎండీలో తగినంత నీరు అందుబాటులో ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వహించకుండా, వెంటనే యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి కాకతీయ కాలువ ద్వారా నీటిని విడుదల చేసి రైతాంగాన్ని, ప్రజలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన

## పూర్వ విద్యార్థినికి ఘన సన్మానం



**మల్లాపూర్, (సింగిడి):** ఎంబీబీఎస్‌లో సీటు సాధించి కేరళ హైస్కూల్‌కు గర్వకారణంగా నిలిచిన పూర్వ విద్యార్థిని మోతే హన్సికను పాఠశాల ప్రిన్సిపాల్ సీబీ అనిల్ సింగ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హన్సికకు శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సీబీ అనిల్ సింగ్ మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యనభ్యసించిన విద్యార్థిని ఎంబీబీఎస్‌లో సీటు సాధించడం ఎంతో ఆనం దదాయకమని అన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించు కుని క్రమశిక్షణతో, పట్టుదలతో కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు. హన్సిక సాధించిన విజయం ప్రస్తుతం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. వైద్య విద్యలో మరింత ప్రతిభ కనబర్చి భవిష్యత్తులో మంచి వైద్యురాలిగా ఎదిగి పేదలకు, ప్రజలకు సేవలు అందించా లని ఆకాంక్షించారు. పాఠశాల పూర్వ విద్యార్థులు వివిధ రంగాల్లో ఉన్నత స్థానాలకు చేరుకోవడం పాఠశాలకు గర్వకారణమని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయు లు హన్సికను అభినందిస్తూ ఆమె భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కోరుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు షీనా, సాయి రాణి, శ్వేత, రజిత తదితరులు పాల్గొన్నారు.

**తీజ్ వేడుకల్లో వెల్లివిరిసిన**

# బంజారా సంస్కృతి

**ఎన్నికల వరకే రాజకీయాలు,**
**ఆ తర్వాత అభివృద్ధే లక్ష్యం: మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సన్న**



**కరీంనగర్, (సింగిడి)::** పచ్చని ప్రకృతిని పలకరిస్తూ, బంజారా సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి బింబించే తీజ్ వేడుకలు కరీంనగర్ 11వ డివిజన్ రామచంద్రాపూర్ కాలనీలో గురువారం ఘనంగా జరి గాయి. మహిళలు సంప్రదాయ పాటలు, నృత్యాలతో వేడుకల్లో పాల్గొని బంజారా సంస్కృతి వైభవాన్ని చాటారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కరీంనగర్ వ్యవ సాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సన్న మాట్లాడు తూ, ఎన్నికల వరకే రాజకీయాలు పరిమితం కావాలని, అనంతరం పార్టీలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. బంజారా సమాజంలో ఒకడిగా ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపం చుకుంటానని తెలిపారు. బంజారా సమాజంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, తాను కూడా వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చినందున వ్యవసాయంపై ఆధా పడే కుటుంబాల సమస్యలు, కష్టాలు తెలుసునని పేర్కొ న్నారు. బంజారాల సంప్రదాయాలు, సంస్కృతిని గౌరవి స్తానని, వారి ప్రతి కార్యక్రమంలో భాగస్వామిగా ఉంటా నని చెప్పారు. ఇటీవల జరిగిన శీతల భవానీ వేడుకల్లోనూ పాల్గొన్న విషయాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో 11వ డివిజన్ కార్పొరేటర్ ఆకుల నర్మద, 12వ డివిజన్ కార్పొ రేటర్ చొప్పరి జయశ్రీతో పాటు బంజారా నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభాతనవ
SINGIDI తెలుగు దినపత్రిక
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శుక్రవారం 11-9-2026

కాటారంలో ప్రారంభమైన
## మండల స్థాయి క్రీడా పోటీలు



**కాటారం, (సింగిడి):**ఎస్‌జీఎఫ్ఐ మండల స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ గురువారం కాటారం మండల కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశా లలో ఉత్సాహంగా నిర్వహించారు. ఎంఈఓ శ్రీదేవి ఆదేశాల మేరకు కాటారం మండల ఎస్‌జీఎఫ్ఐ కన్వీనర్ గురుసింగా విజయలక్ష్మి ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాటారం సర్పంచ్ పంతకాని సడవలి, ఏఎంసీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమల సమ్మయ్య హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన బాలురు, బాలికలతో కలిపి మొత్తం 24 జట్లు పాల్గొన్నాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభను చాటారు. క్రీడా ప్రతిభను గుర్తించి తదుపరి స్థాయి పోటీలకు ఎంపిక చేసేందుకు సెలక్షన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ చైర్మన్ పంతకాని సమ్మయ్య, ఉప సర్పంచ్ కొండ గొర్ల బానయ్య, జిల్లా యోగ అసోసియేషన్ అధ్యక్షుడు జనగామ కరుణాకర్ రావు, జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు సోమలిం గం తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు మంథని శ్రీనివాస్, కోచ్ వెంకటేష్, శ్రీధర్, వీరన్న, రమేష్, శ్రీవిద్య, గౌతమి, రాజేశ్వరి, మహేందర్, కార్తీక్, చందు, నరేష్, ఉదయ్‌సింగ్ తదితరులు సమన్వయంతో నిర్వహించి విజయవంతం చేశారు.

## నేడు బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీల ధర్మ పోరాట దీక్ష



**నిజామాబాద్ ప్రతినిధి,(సింగిడి):** ఈ నెల 11న పులాంగ్ చౌరస్తాలోని గల అంబేడ్కర్ విగ్రహం వద్ద బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధర్మదీక్ష కార్యక్రమం చేపడుతున్నామని జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ తెలిపారు. గురువారం నగరంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపుమేరకు బీసీలను మోసం చేసే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని, నయవంచను వ్యతిరేకిస్తూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా, కేంద్రాల్లో.... "బీసీల ధర్మ పోరాట దీక్ష" చేపట్టనున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా జరిగే జాతి జనగణలో బీసీ కులగణన చేపడతామని కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో 1-5-2025 న నిర్ణయం తీసుకొని ప్రకటించిందని, కానీ ఇప్పుడు కులగణన శాస్త్రీయమైన పద్ధతిలో చేయకుండా, ఓబీసీ కుటుంబాలను లెక్కించకుండా, బీసీ కాలం లేకుండా, ప్రతి కులానికి ఒక యూనిక్ కోడ్ లేకుండా బీసీలకు అన్యాయం చేస్తుందని అన్నారు. రెండవసారి అప్పుడే జాతీయ జన గణన ఆగస్టు 17వ తేదీ నుండి ప్రారంభం మొదలుపెట్టిందన్నారు. కావున ఈ ధర్మ పోరాట దీక్షలో ప్రతి ఒక్క బీసీ బిడ్డ పాల్గొని విజయవంతం చేసి కేంద్ర ప్రభుత్వానికి బీసీల న్యాయమైన డిమాండ్ ను వినిపించాలని, కేంద్ర ప్రభుత్వం స్పందించే వరకు ఉద్యమాలను ఉదృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో బుస్స ఆంజనేయులు, ఆకుల ప్రసాద్, కొయ్యాడ శంకర్, శ్రీలత, కొట్టూర్ చంద్రకాంత్, సాయి, బసవ, రేఖ, దేశాయి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.


పర్యావరణహితంగా వినాయక చవితి
## ఉత్సవాలు జరుపుకోవాలి: డీసీ లక్ష్మారెడ్డి



**రాజేంద్రనగర్,(సింగిడి):** వినాయక చవితి పండగను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, ప్రశాంతమైన వాతావరణంలో, పర్యావరణహితంగా జరుపుకోవాలని సైబరా బాద్ మున్సిపల్ కార్పొరేషన్ నార్సింగి సర్కిల్-45 డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి సూచించారు. గురువారం నార్సింగి సర్కిల్ పరిధిలో ప్రజలకు ఉచితంగా పంపిణీ చేయడానికి ఏర్పాటు చేసిన 1,200 మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన సర్కిల్ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ.. రసాయనాలతో కూడిన ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమవు తాయని, అందుకే పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. భక్తులు, స్థానికులు సర్కిల్ కార్యాలయంలో అందుబాటులో ఉన్న ఈ మట్టి విగ్రహాలను ఉచితంగా తీసుకెళ్లవచ్చని కోరారు. పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే పూజించి పండగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

దివ్యాంగ విద్యార్థులకు ఉచితంగా సహాయ
## పరికరాల పంపిణీకి శ్రీకారం

ప్రత్యేక గుర్తింపు శిబిరాన్ని ప్రారంభించిన డీఈఓ వెంకటేశ్వర్లు



**రాజేంద్రనగర్,(సింగిడి):**ప్రత్యేక అవసరాలున్న దివ్యాంగ విద్యార్థులు సమాజంలో స్వతంత్రంగా ఎదిగేందుకు ప్రభుత్వం అన్ని విధాలా తోడ్పాటునందిస్తోందని రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం శంషాబాద్ మున్సిపల్ కమ్యూనిటీ హాల్‌లో సమగ్ర శిక్ష 'సహిత విద్య' విభాగం ఆధ్వర్యంలో, సీఎంఓ బత్తిని వెంకటేష్ పర్యవేక్షణ లో ఏర్పాటు చేసిన దివ్యాంగ విద్యార్థుల ప్రత్యేక గుర్తింపు, వ్యాధి నిర్ధారణ శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ, విద్యార్థుల వైకల్య స్వభావాన్ని బట్టి అలింకో సంస్థ సహకారంతో వీల్ చైర్లు, ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలు, బ్రెయిలీ కిట్లు, ఎమ్మార్ కిట్లను ఉచితంగా అందించేం దుకు అర్హులైన వారిని ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సహాయ పరికరాలను వినియోగించుకుని విద్యార్థులు శారీరక, మానసిక వికాసం సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్, జెడ్పీహెచ్ఎస్ కాంప్లెక్స్ హెచ్ఎం కిష్టారెడ్డి, సహిత విద్య వనరుల ఉపాధ్యాయులు , ప్రత్యేక ఉపాధ్యాయులతో పాటు దివ్యాంగ పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఫామ్ పాండ్‌లతో రైతులకు బహుళ ప్రయోజనాలు

నీటి నిల్వతో పాటు కూరగాయలు, తీగజాతి పంటలు, చేపల పెంపకానికి వినియోగించుకోవచ్చు,
ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి: కలెక్టర్ హేమంత కేశవ్ పా టిల్

**కోదేరు (సింగిడి):**కోదేరు మండల పరిధిలోని భావాయిపల్లి గ్రామంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ గురువారం నాడు ఆకస్మికంగా పర్యటించి వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. వి.బి.జి. రామ్‌జీ పథకంలో భాగంగా రైతు మహేశ్వరి పొలంలో నిర్మిస్తున్న ఫామ్ పాండ్ పనులను కలెక్టర్ పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫామ్ పాండ్ నిర్మాణం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకోవడంతో పాటు వాటిని వ్యవసా య అవసరాలకు సమర్థవంతంగా వినియోగించుకో వచ్చని కలెక్టర్ తెలిపారు. నీటి నిల్వకు మాత్రమే పరిమితం కాకుండా ఫామ్ పాండ్ చుట్టూ వివిధ రకాల తీగజాతి మొక్కలు, కూరగాయలు సాగు చేసుకోవడంతో పాటు చేపల పెంపకం చేపట్టి అదనపు ఆదాయం పొందే అవకాశం ఉందని రైతులకు సూచించారు. రైతులు ఫామ్ పాండ్‌లను సమర్థవంతంగా వినియోగించుకొని వ్యవసాయంలో అదనపు ఆదాయ మార్గాలను అభివృద్ధి



చేసుకోవాలని సూచించారు.
రైతు మహేశ్వరి భర్త బంగారయ్య పొలంలో 12ఐ12 మీటర్ల పరిమాణంలో రూ. 1.13 లక్షల అంచనా వ్యయంతో ఫామ్ పాండ్ నిర్మిస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. పనులను 15 రోజుల్లోగా పూర్తి చేస్తామని తెలిపారు. పనుల నాణ్యత విషయంలో రాజీ లేకుండా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిదారు లక్ష్మీకళ భర్త చంద్రయ్య నిర్మిస్తున్న ఇంటి పనులను కలెక్టర్ పరిశీలిం చారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. గ్రామంలో మొత్తం 14 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, రెండు ఇళ్లు రద్దు అయ్యాయని, మరో రెండు ఇళ్లు ఎల్-3 ఉన్నట్లు, మిగిలిన 10 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. రెండో విడతలో భాగంగా గుడిసెల్లో నివసిస్తున్న అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సహకారం అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ ఎం.డి. జమీల్, సర్పంచ్ పరశు రాములు, ఏపీవో, ఈసీ, ఏఈ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు యామ రాజు ఎంపిక

పాలమాకుల జెడ్పీహెచ్ఎస్‌లో హిందీ ఉపాధ్యాయుడిగా సేవలు.. 18 ఏళ్ల సుదీర్ఘ సేవలకు గుర్తింపు

**హుస్నాబాద్ (సింగిడి):** అక్కన్నపేట మండలం కట్కూర్ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు యామ రాజు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ప్రస్తుతం నంగునూరు మండలం పాలమాకుల జెడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో స్కూల్ అసిస్టెం ట్ హిందీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ఆయన విద్యారంగంలో అందిస్తున్న విశిష్ట సేవలు, సామాజిక బాధ్యత, విద్యార్థుల అభ్యున్నతికి చేస్తున్న కృషిని గుర్తిస్తూ జిల్లా విద్యాశాఖ, జిల్లా యంత్రాంగం ఈ అవార్డుకు ఎంపిక చేసి గురువారం ప్రకటించింది. 18 ఏళ్ల మూడు నెలలుగా విద్యాశాఖలో సేవలందిస్తున్న యామ రాజు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో నిరంతరం కృషి చేస్తున్నారు. గత విద్యా సంవత్సరంలో ఆయన బోధించిన విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు హిందీ సబ్జెక్టు లో పాఠశాల స్థాయిలో అత్యధికంగా 97 మార్కులు, అత్యుత్తమంగా 9.8 జీపీఏ సాధించారు. 2019లో జిల్లా విద్యాశాఖ నిర్వహించిన పదో తరగతి స్టార్ బ్యాచ్ 30 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని ప్రశంసా పత్రం అందుకున్నారు. ప్రభుత్వ విద్యపై ఉన్న నమ్మకంతో తన ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించిన ఆయన, తన స్వగ్రామమైన కట్కూర్‌లో మూతపడే దశకు చేరుకున్న ప్రాథమిక పాఠశాలను బలో పేతం చేసేం దుకు గ్రామస్తులు, యువత, విద్యావంతు లను చైతన్యపరిచారు. గడపగ డపకు తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలు, విద్యాబోధన గురిం చి వివరిస్తూ విద్యార్థుల నమోదును పెంచడంలో కృషి చేశారు. దీంతో పాఠశా లకు నలుగురు రెగ్యులర్ ఉపాధ్యాయులు కేటాయించ బడేలా చేశారు. ఆయన కుమార్తె కీర్తికా పూలే ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ ప్రతిష్టాత్మక జవహర్ నవోదయ విద్యాలయంలో సీటు సాధించగా, కుమారుడు శ్రీకాంత్ పూలే ప్రాథమిక విద్యను ప్రభుత్వ పాఠశాలలోనే పూర్తి చేశారు. తన 18 ఏళ్ల సర్వీసులో భార్య కూడా ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కావడంతో సుమారు పదేళ్లపాటు పనిచేసిన ప్రాంతంలోనే నివసిస్తూ స్థానికులకు అందుబా టులో ఉండి విద్యాబోధన చేశారు. ఉపాధ్యాయుడిగా మాత్రమే కాకుండా సామాజిక, పర్యావరణ రంగాల్లోనూ చురుగ్గా పనిచేశారు. ఉపాధ్యాయ సంఘంలో క్రియాశీలకంగా ఉంటూనే పాఠశాలలు, గ్రామాల్లో హరితహారం కార్యక్రమంలో మొక్కలు నాటడం, వాటి సంరక్షణలో పాల్గొన్నారు. విద్యా, సామాజిక సేవలను గుర్తిస్తూ బహుజన సాహిత్య అకాడమీ, న్యూఢిల్లీ ద్వారా మహాత్మా



జ్యోతిబా పూలే జాతీయ అవార్డు, తెలంగాణ ఆత్మబంధు ఫౌండేషన్ ద్వారా ప్రొఫెసర్ జయశంకర్ సర్ రాష్ట్ర స్థాయి అవార్డులను అందుకు న్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న యామ రాజు తెలంగాణ రాష్ట్ర ప్రతిపాదిత చిహ్నాల రూపకల్పనలో భాగస్వామ్యమ య్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనలో తెలంగాణ ఏర్పాటు జాప్యాన్ని నిరసిస్తూ 1,222 రోజుల పాటు నల్ల రిబ్బన్ ధరించి తన నిరసనను వ్యక్తం చేశారు. యామ రాజు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక కావడం పట్ల పాలమాకుల పాఠశాల ప్రధానోపా ధ్యాయులు పి. ప్రభాకర్ రావు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యారంగ ప్రముఖులు, కట్కూర్ గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యామ రాజు మాట్లాడుతూ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యతు లో ప్రభుత్వ పాఠశాలలు, విద్యారంగ బలోపేతానికి మరింత కృషి చేస్తానని తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయు నిగా ఎంపిక చేసిన జిల్లా విద్యాశాఖ, జిల్లా అధికార యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు.

కరెంటు కోతలకు వ్యతిరేకంగా రైతుల ఆందోళన
# వ్యవసాయానికి సరిపడా విద్యుత్ అందజేయాలి..

శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై రాస్తారోకో..

**కల్వకుర్తి,(సింగిడి):** కల్వకుర్తి మండలం తాండ్ర గ్రామంలో కరెంటు కోతలకు వ్యతిరేకంగా రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ శ్రీశైలం-- హైదరాబాద్ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు రైతులకు 24 గంటల విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చిందని, అయితే ప్రస్తుతం తరచూ విద్యుత్ కోతలు విధిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని రైతులు ఆరోపించారు. ఇప్పటికే వర్షాభావ పరిస్థితులతో ఇబ్బందులు పడుతున్న రైతులకు విద్యుత్ కోతలు మరింత సమస్యగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో పంటలు




ఎండిపోతున్నాయని, పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలను కాపాడుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు తెలిపారు. రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, వెంటనే కరెంటు కోతలను నిలిపివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు చేపట్టిన ధర్నా, రాస్తారోకోకు బీఆర్ఎస్ పార్టీ పూర్తి స్థాయిలో మద్దతు ప్రకటిస్తూ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, సాగుకు అవసరమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలని వారు కోరారు. ఈ సందర్భంగా రైతులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. రైతుల ఆందోళనతో జాతీయ రహదారిపై కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కార్యక్రమంలో, కొండారెడ్డిపల్లి, తాండ్ర పరిసర గ్రామాలకు చెందిన రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఎక్సైజ్ సీఐ జయశ్రీని కలిసిన కిరాణా వర్తక సంఘం



**దుగ్గొండి,(సింగిడి):**నర్సంపేటలో ఇటీవల ప్రొబేషనరీ అండ్ ఎక్సైజ్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన జయశ్రీను నర్సంపేట కిరాణా వర్తక సంఘం ప్రతినిధులు అధ్యక్షులు దాసరి నర్సింహా రెడ్డి ఆధ్వర్యంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నర్సంపేట ప్రాంతంలోని కిరాణా వ్యాపారులు ఎదుర్కొంటున్న పరిస్థితులు, వ్యాపార రంగానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. నర్సంపేటలో కిరాణా వ్యాపారులు నిబంధనలకు అనుగుణంగా వ్యాపార కార్యకలాపాలు నిర్వహించేలా సహకారం అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కిరాణా వర్తక సంఘం నాయకులు, సభ్యులు, స్థానిక కిరాణా వ్యాపారులు పాల్గొన్నారు.

## చిన్నారుల ఆరోగ్యమే లక్ష్యం పోషకాహారంపై అవగాహన



**పెబ్బేరు,(సింగిడి):**పట్టణంలోని 8వ వార్డు పరిధిలోని 3, 4, 8వ అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో గురువారం పోషకాహార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే 0 నుంచి 5 ఏళ్లలోపు చిన్నారుల బరువు, ఎత్తును కొలిచి, వారి శారీరక ఎదుగు దలను నమోదు చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ.. చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యం, శారీరక--మానసిక వికాసానికి పోషకాహారం ఎంతో కీలకమని తెలిపారు. "ఆరోగ్యమే మహాభాగ్యం" అనే విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించి పిల్లలకు సమతుల్య ఆహారం అందించాలని సూచించారు. రోజువారీ ఆహారంలో ఆకుకూరలు, గుడ్లు, పాలు, పండ్లు, మిల్లెట్లు, చిరుధాన్యాలు తదితర పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను చేర్చాలని చెప్పారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా సూచించిన ఆహార పట్టికను పాటించాలని, పోషకాహార లోపం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోషకాహారంతో పిల్లల్లో చురుకుదనం, రోగనిరోధక శక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది మిత్రన్, శ్రీరాములు, ఆర్పీలు ప్రణుల, అనూష, స్వాతి, అంగన్వాడీ ఉపాధ్యాయులు వెంకటేశ్వరమ్మ, ఉమ, మహేశ్వరి, రాధమ్మ, పాఠశాల ఉపాధ్యాయుడు బుసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ ఆశయాల
# సాధనకు ఉద్యమిస్తాం



**పెబ్బేరు,(సింగిడి):**తెలంగాణ సాయుధ పోరాట వీరవనిత చిట్యాల ఐలమ్మ 41వ వర్ధంతి కార్యక్రమాన్ని పెబ్బేరు మండల కేంద్రంలోని హమాలీ సంఘం కార్యాలయంలో గురువారం నిర్వహించారు. హమాలీ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆర్. భాస్కర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చిట్యాల ఐలమ్మ చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎంపీటీసీ మండ్ల రాజు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మండ్ల రాజు మాట్లాడుతూ.. భూమి, భుక్తి, వెట్టి చాకిరీ విముక్తి కోసం, దోపిడీ, పీడన, అంటరానితనం, కుల వివక్షకు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం సాగిందన్నారు. దున్నేవాడికే భూమి దక్కాలనే లక్ష్యంతో సాగిన ఈ పోరాటంలో దేశ్‌ముఖ్‌లు, దొరలు, పటేల్, పట్వారీ వ్యవస్థల నియంతృత్వాన్ని ప్రజలు ఎదిరించారని తెలిపారు. విసునూరు రామచంద్రారెడ్డి దొర ఆధిపత్యాన్ని వ్యతిరేకిస్తూ రజక కుటుంబంలో జన్మించిన చిట్యాల ఐలమ్మ తన వృత్తిని కొనసాగిస్తూనే భూమిని కౌలుకు తీసుకుని పంట సాగు చేశారని పేర్కొన్నారు. తాను కష్టపడి పండించిన పంటను భూస్వాములు స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నించగా, ఐలమ్మ ధైర్యంగా ఎదిరించి పోరాటం సాగించారని గుర్తుచేశారు. పేదలకు భూమి, పండించిన పంటకు న్యాయమైన ధర, మహిళలపై దౌర్జన్యాలకు అడ్డుకట్ట, సామాజిక సమానత్వం కోసం ఆమె చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఆంధ్ర మహాసభ పిలుపుతో, కమ్యూనిస్టు నాయకుల ఆలోచనా స్ఫూర్తితో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఉధృతమైందన్నారు. ఈ పోరాటాన్ని హిందువులు, ముస్లింల మధ్య జరిగిన ఘర్షణగా కొందరు వక్రీకరించడం సరికాదన్నారు. ప్రజలను చైతన్యపరిచిన ఈ మహత్తర పోరాటంలో వేలాది మంది ప్రాణత్యాగాలు చేశారని, పేదలకు భూములు పంచేందుకు, వెట్టి చాకిరీ నిర్మూలనకు ఉద్యమం దోహదపడిందని తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి కమ్యూనిస్టులు నాయకత్వం వహించారని, ఆ పోరాట వారసత్వాన్ని వక్రీకరించే ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని మండ్ల రాజు అన్నారు. చిట్యాల ఐలమ్మ స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా భవిష్యత్తులో ప్రజా ఉద్యమాలు చేపడతామని తెలిపారు. ప్రజలంతా ప్రజా సమస్యల పరిష్కారం కోసం జరిగే పోరాటాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హమాలీ సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు, పెద్దమన్యం రామస్వామి, సురేష్, వెంకటేష్, చెన్నయ్య, నరసింహ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులపై
## సమగ్ర విచారణ జరపాలి




**కాటారం,(సింగిడి):** బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు మధు తాత, నవీన్‌లు దళిత స్పీకర్‌ను ఉద్దేశించి అభ్యంతరకరంగా, బూతులు తిట్టారని ఏఎంసీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమల సమ్మయ్య ఆరోపించారు. ఈ మేరకు గురువారం కాటారం ఎస్‌హెచ్‌వోకు ఫిర్యాదు చేశారు. ఆమె మాట్లాడుతూ..స్పీకర్ దళితుడు అయినందున ఆయనను అవమానించే విధంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు మధు తాత, నవీన్‌లు అసభ్య పదజాలంతో దూషించారని పేర్కొన్నారు. అదేవిధంగా ఎర్రవెల్లి ఫామ్‌హౌస్ వద్ద నిరసన తెలిపిన తమ దళితులను అవమానపరిచేలా వ్యవహరించారని ఆరోపిం చారు. దళితులను అంటరానివారిగా చూపించే విధంగా పసుపు నీళ్లతో కడుగుతూ హేళన చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. దళిత, గిరిజన వర్గాల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా వ్యవహరించిన బీఆర్ఎస్ నాయకులపై సమగ్ర విచారణ జరిపి, చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చాకలి ఐలమ్మ పోరాట
## స్ఫూర్తిని కొనసాగిద్దాం

ఆర్ఎస్ పీ, ఎఐపీఎస్ యూ నాయకులు వీరనారి ఐలమ్మ విగ్రహానికి ఘన నివాళులు




**నిజామాబాద్ ప్రతినిధి (సింగిడి):** నగరంలోని వినాయక్ నగర్‌లో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీ, అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కటారి రాములు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ చూపిన ధైర్యం, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా చేసిన పోరాటం ప్రజలకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన త్యాగాలను నేటి తరాలు గుర్తు చేసుకోవాలని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం, సామాజిక న్యాయం కోసం చాకలి ఐలమ్మ ఆశయాలను కొనసాగిస్తూ పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో డి. కృష్ణ, సునీల్, సూర్యపాల్, రంజిత్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

డయల్ 100కు సమాచారం..
## మహిళ ప్రాణాలు కాపాడిన పోలీసులు




**కామారెడ్డి, (సింగిడి):**కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు యత్నించేందుకు రైల్వే స్టేషన్‌కు వెళ్లిన ఓ వివాహితను పోలీసులు సకాలంలో గుర్తించి కాపాడారు. లక్ష్మీదేవునిపల్లి గ్రామానికి చెందిన సంధ్యారాణి కుటుంబ కలహాల కారణంగా గురువారం సాయంత్రం 5 గంటల సమయంలో ఆత్మహత్య చేసుకునేందుకు రైల్వే స్టేషన్‌కు వెళ్లినట్లు డయల్ 100కు సమాచారం అందింది. సమాచారం అందుకున్న కామారెడ్డి టౌన్ ఇన్‌స్పెక్టర్ బి. నరహరి ఆదేశాల మేరకు పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేశారు. అప్రమత్తమైన పోలీసులు రైల్వే ట్రాక్‌పై సంధ్యారాణిని గుర్తించి వెంటనే అక్కడి నుంచి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. అనంతరం ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి, కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. సకాలంలో స్పందించి మహిళను కాపాడిన పోలీసుల చర్యను స్థానికులు అభినందించారు.

గ్రామ పంచాయతీ ఆవరణలో ఉన్న
## ప్రైవేట్ డెయిరీని తొలగించాలి



**భీమదేవరపల్లి (సింగిడి):** గ్రామపంచాయతీ అవసరాల కోసం కొనుగోలు చేసిన ఆరు గుంటల స్థలాన్ని పంచాయతీకే పూర్తి హక్కులతో అప్పగించాలని బీజేపీ సిద్ధిపేట జిల్లా కార్యదర్శి పైడిపెల్లి పృధ్వీరాజ్ గౌడ్ డిమాండ్ చేశారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగా పూర్‌లోని వివాదాస్పద స్థలంపై అధికారులు రికార్డులను పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. పంచాయతీ కార్యాలయ అవసరాల కోసం 1992లో గుంటకు రూ. 1,000 చొప్పున రూ. 6,000కు ఆరు గుంటల భూమిని వ్రాతపూర్వకంగా కొనుగోలు చేసినట్లు తెలిపారు. కార్యాలయం ఎదుట ఉన్న ప్రైవేట్ డెయిరీ భవనం, స్థల హక్కులు, వినియోగంపై కూడా సమగ్ర విచారణ జరపాలని కోరారు. పంచాయతీ స్థలం గ్రామసభలు, ప్రజా సమావేశాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగపడేలా చూడాలని పృధ్వీరాజ్ గౌడ్ పేర్కొన్నారు.

# గర్భిణుల్లో రక్తహీనతను గుర్తించి మెరుగైన చికిత్స అందించాలి

## పీహెచ్‌సీల్లోనే పాము కాటు బాధితులకు తక్షణ వైద్యం అందించాలి: జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం

**వనపర్తి ప్రతినిధి, (సింగిడి):** గర్భిణీల్లో రక్తహీనతను గుర్తించి మెరుగైన చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ వనపర్తి మండలం కడుకుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) సందర్శించి వైద్య సేవలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై వైద్య సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా పాము కాటు బాధితులకు అందిస్తున్న వైద్య సేవలపై కలెక్టర్ ఆరా తీశారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న మందులు, యాంటీ స్నేక్ వెనం (ఏఎస్‌వీ) నిల్వలు, వాటి వినియోగం, పాము కాటు కేసులు వచ్చినప్పుడు చేపడుతున్న వైద్య ప్రక్రియ తదితర అంశాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాము కాటు బాధితులకు పీహెచ్‌సీ స్థాయిలోనే తక్షణ వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన మందులు, యాంటీ స్నేక్ వెనం(పాము కాటు విరుగుడు టీకా) ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పాము కాటు కేసుల్లో ఎలాంటి జాప్యం లేకుండా ప్రాథమిక చికిత్స అందించి అవసరమైన సందర్భాల్లో ఉన్నత స్థాయి వైద్య సేవలకు తరలించేలా సమన్వయం చేసుకోవాలని తెలిపారు.

**గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి**

పీహెచ్‌సీ పరిధిలోని గర్భిణుల వివరాలు, వారి ఆరోగ్య పరిస్థితి, వారికి అందుతున్న వైద్య సేవలపై కలెక్టర్ సమీక్షించారు. ముఖ్యంగా రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులను గుర్తించి వారికి మెరుగైన వైద్యం అందించడంతో పాటు అవసరమైన పరీక్షలు నిర్వహించాలని వైద్యాధికారులను ఆదేశించారు. రక్తహీనత ఉన్న గర్భిణులకు వైద్యుల సూచనల మేరకు మందులు,





పోషకాహారంపై అవగాహన కల్పించాలని తెలిపారు. గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

**-పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి**

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు వైద్యులు, సిబ్బంది మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రి పరిసరాలు, వార్డులు, చికిత్సా గదులు, మరుగుదొడ్లు తదితర ప్రాంతాల్లో పారిశుధ్యాన్ని నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. రోగులకు పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలు, సౌకర్యాలను ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు.

**-పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి**

పదవ తరగతిలో ఈ ఏడాది జిల్లాలో 100 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కడుకుంట్లలోని జడ్పీ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫిజిక్స్, గణితం, ఇంగ్లీష్ సబ్జెక్టుల్లో ప్రత్యేకంగా రూపొందించిన మెటీరియల్ ఆధారంగా వెనుకబడిన విద్యార్థులకు బోధించాలని సూచించారు. ప్రత్యేక తరగతులు నిర్వహించి ఆయా సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులను పాఠ్యాంశాలు అర్థమయ్యే విధంగా బోధించి 100 శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా చొరవ తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా పాఠశాల ఆవరణలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు ఆడుకోవడానికి సౌకర్యంగా మైదానాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ భాస్కర్ నాయక్, వైద్యాధికారి డాక్టర్ రాకేష్ రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని పరిశీలించిన డా. లక్ష్మారెడ్డి

## మహిళలకు అందుతున్న ఉచిత వైద్య సేవలపై వైద్యులను అడిగి తెలుసుకున్న మాజీ మంత్రి









**జడ్చర్ల, (సింగిడి):** దివంగత శ్రీమతి చర్లకొల శ్వేత రెండో వర్ధంతి సందర్భంగా మహిళల కోసం నిర్వహిస్తున్న ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు రెండో రోజు కూడా కొనసాగాయి. జడ్చర్ల పట్టణంలోని గౌడ ఫంక్షన్ హాల్‌లో కొనసాగుతున్న క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని మాజీ మంత్రి డా. సి. లక్ష్మారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా మహిళలకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు, క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రక్రియ గురించి వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. శిబిరంలో కొనసాగుతున్న వైద్య సేవలను ఆయన పరిశీలించారు. మహిళల కోసం ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. మహిళలు ఆరోగ్యంపై అవగాహన కలిగి, అందుబాటులో ఉన్న ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

# మహ్మద్ అబ్దుల్ హదీ కుటుంబాన్ని పరామర్శించిన డా.సి.లక్ష్మారెడ్డి

## ఎంఐఎం జిల్లా అధ్యక్షుడి మృతి బాధాకరం: మాజీ మంత్రి.

**జడ్చర్ల, (సింగిడి):** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి చెందిన ఎంఐఎం పార్టీ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ హదీ అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర మాజీ మంత్రి డా. సి. లక్ష్మారెడ్డి ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా డా. సి. లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. మహ్మద్ అబ్దుల్ హదీ పార్టీలకతీతంగా ప్రజల కోసం పనిచేసిన నాయకుడని, ఆయన మృతి బాధాకరమని అన్నారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ కష్ట సమయంలో భగవంతుడు కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. అబ్దుల్ హదీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబి చైర్మన్ పట్ల ప్రభాకర్ రెడ్డి, రాంమోహన్, మహ్మద్ హాఫీజ్ ఉర్ రెహెమాన్, నందకిశోర్ గౌడ్, మహమ్మద్ అలీ దనీష్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



### బోయిన్‌పల్లి పాఠశాలకు హిందీ ఉపాధ్యాయుడిని వెంటనే నియమించాలి.

విద్యార్థులకు విద్యా నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలి: బీజేపీ మండల అధ్యక్షుడు నరేష్ నాయక్.



**జడ్చర్ల, (సింగిడి):** జడ్చర్ల నియోజవర్గం మిడ్జిల్ మండలం బోయిన్‌పల్లి ఉన్నత పాఠశాలలో హిందీ బోధించేందుకు ఉపాధ్యాయుడు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే హిందీ ఉపాధ్యాయుడిని నియమించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. పాఠశాలలో విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటున్నప్పటికీ, కీలకమైన హిందీ సబ్జెక్టుకు ఉపాధ్యాయుడు లేకపోవడంతో వారి చదువుకు ఆటంకం ఏర్పడుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు బీజేపీ నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. విద్యా సంవత్సరం నష్టపోకుండా సమస్యను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. ఈ సమస్యపై స్పందించిన బీజేపీ నాయకులు మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ), సహాయ సంచాలకులను కలిసి వినతిపత్రం అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు నరేష్ నాయక్, యువమోర్చా మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్, నరేష్ చారి కలిసి అధికారులను కలిశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఎలాంటి విద్యా నష్టం కలగకుండా తక్షణమే బోయిన్‌పల్లి ఉన్నత పాఠశాలకు హిందీ ఉపాధ్యాయుడిని నియమించాలని వారు అధికారులను కోరారు.

### 528 పేద కుటుంబాల ఇంటి కల నెరవేర్చేందుకు

# రూ.5.44 కోట్ల అదనపు నిధులు విడుదల చేయాలి

## పెండింగ్ ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు త్వరగా అందించాలి: ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి

**జడ్చర్ల, (సింగిడి):** జడ్చర్లలోని నేషనల్ దాబా వెనుక ప్రాంతంలో నిర్మిస్తున్న షీర్‌వాల్ టెక్నాలజీ హౌసింగ్ ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేసి, లబ్ధిదారులకు ఇళ్లను అందించేందుకు అవసరమైన అదనపు నిధులను విడుదల చేయాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి రాష్ట్ర గృహ, రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరారు. ఈ మేరకు మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ ప్రాజెక్టు కింద మొత్తం 528 ఇళ్లు (456o72) నిర్మాణంలో ఉన్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ. 27.984 కోట్లు కాగా, మిగిలిన నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు రూ. 26.236 కోట్ల నిధులు



అవసరమవుతున్నాయని వివరించారు. ఇప్పటివరకు కాంట్రాక్టర్‌కు రూ. 7.1909 కోట్ల నిధులు విడుదలయ్యాయని, పనుల పురోగతి ఆధారంగా ఎండీ కార్యాలయం ద్వారా విడుదల చేసేందుకు మరో రూ. 20.7931 కోట్ల నిధులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అయితే, మిగిలిన పనులను పూర్తిస్థాయిలో పూర్తి చేసేందుకు ఇంకా సుమారు రూ. 5.44 కోట్ల అదనపు నిధులు అవసరమని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా పెండింగ్ నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసి, 528 ఇళ్లను లబ్ధిదారులకు త్వరగా అప్పగించేలా అవసరమైన నిధులను అత్యవసరంగా మంజూరు చేసి విడుదల చేయా లని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరారు.

### జడ్చర్ల పాత బస్టాండ్‌కు

## పూర్వవైభవం తీసుకురావాలి

**పాత బస్టాండ్ నుంచి మళ్లీ బస్సులు నడపాలి..**
**ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలి: ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి...**



**జడ్చర్ల, (సింగిడి):** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని పాత బస్టాండ్‌ను అన్ని మౌలిక సదుపాయాలతో పునరుద్ధరించి, అక్కడి నుంచి యథావిధిగా బస్సుల రాకపోకలు జరిగేలా చర్యలు తీసుకోవాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని కోరారు. జడ్చర్ల పట్టణంలో రెండు బస్టాండ్లు ఉన్నాయని ఎమ్మెల్యే తెలిపారు. జాతీయ రహదారి-44 సమీపంలో కొత్త బస్టాండ్ ఉండగా, పాత బజార్ ప్రాంతంలో పాత బస్టాండ్ ఉందన్నారు. పాత బస్టాండ్ నుంచి ప్రస్తుతం బస్సుల రాకపోకలు లేకపోవడంతో పాత బజార్ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభ దృష్టికి తీసుకెళ్లారు. బస్సు ఎక్కేందుకు పాత బజార్ ప్రాంత ప్రజలు మెయిన్ రోడ్డుకు వెళ్లాల్సి వస్తోందని, దీంతో అదనంగా ఆటో చార్జీలు భరించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని పాత బస్టాండ్‌ను అన్ని సదుపాయాలతో అభి వృద్ధి చేసి, అక్కడి నుంచి నిరంతరం బస్సులు నడిచేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవా లని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కొత్త బస్టాండ్ పరిసరాల్లో ప్రజల భద్రత కోసం మరిన్ని సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో కొత్త బస్టాండ్ ప్రాంతంలో బస్సులో తరలిస్తున్న రూ. 50 లక్షల నగదు చోరీకి గురైన ఘటనను ఎమ్మెల్యే అసెంబ్లీ దృష్టికి తీసుకువచ్చారు. అక్కడ సీసీటీవీ నిఘా ఉండటంతో పోలీసులు నిందితులను గుర్తించి పట్టుకోగలిగారని తెలిపారు. జడ్చర్ల పట్టణ ప్రజలు, ప్రయాణికుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని పాత బస్టాండ్ పునరుద్ధరణతో పాటు బస్సుల రాకపోకలను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి కోరారు.

### గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో మాజీ కార్పొరేటర్ బొంతు సమీక్ష..



**కాప్రా, (సింగిడి):** గణేష్ ని ఉత్సవాలు ముగిసే వరకు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, కాలనీవాసులు సమన్వయంతో పనిచేసి గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చర్లపల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ కోరారు. గణేష్ ఉత్సవాలను పురస్కరిం చుకుని చర్లపల్లి డివిజన్ పరిధిలోని చర్లపల్లి పాండ్ (చెరువు) వద్ద జరుగుతున్న ముందస్తు నిమజ్జన ఏర్పాట్లు, మౌలిక వసతుల పనులను గురువారం మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ అన్ని శాఖల అధికారులతో క్షేత్రస్థాయి లో కూలంకషంగా పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌక ర్యం కలగకుండా, నిమజ్జన ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో వేగవంతంగా పూర్తయ్యేలా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. చర్లపల్లి సీఐ సుధాకర్ తో మాట్లాడి నిమజ్జనం రోజున ట్రాఫిక్ మళ్లింపులు, రద్దీ నియంత్రణ, చెరువు ప్రాంగణంలో సీసీ కెమెరాల ఏర్పాటు, భద్రతా చర్యలపై చర్చించారు. డి. బాలకృష్ణ ఏఈ అభిషేక్ తో కలిసి క్రెన్ల ఏర్పాటు, చెరువు గట్టు బలం, ఘాట్ల వద్ద నాణ్యతా ప్రమాణాలు, నిమజ్జన వాహనాల రాకపోకలకు అనువైన రహదారుల పరిస్థితిని తనిఖీ చేశారు. ఎలక్ట్రికల్ ఏఈ బాబూరావు గారితో మాట్లాడి, పాండ్ చుట్టూ విద్యుత్ దీపాల ఏర్పాటు, అదనపు జెనరేటర్ల అందుబాటు, ఫ్లడ్ లైట్లు మరియు ప్రమాదాలు జరగకుండా వైరింగ్ భద్రతను సమీక్షించారు. చెరువు పరివాహక ప్రాంతాల్లో భద్రత, అత్యవసర సమయాల్లో స్పందించేలా రెస్క్యూ టీమ్‌లు, బోట్లు, ఈతగాళ్ల అందుబాటుపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. పరిసరాల్లో దోమల నివారణకు ఫాగింగ్, బ్లీచింగ్ చల్లడం, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేందుకు పారిశుధ్య సిబ్బందిని షిఫ్టుల వారీగా కేటాయించడంపై చర్చించారు. నిమజ్జన ప్రాంగణంలో అత్యవసర వైద్య శిబిరం, అంబులెన్స్ సదుపాయం మరియు ప్రాథమిక చికిత్స మందులను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు ప్రభు గౌడ్, నాయకులు భానుచందర్, చెన్నం గోపి, సునీల్, పెంటేష్, లక్ష్మయ్య, వివిధ కాలనీల సంక్షేమ ప్రతినిధులు, భక్తులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

### ఇందూర్ హైస్కూల్‌లో ఆచార్య దేవోభవ కార్యక్రమం



**బోధన్ ప్రతినిధి, (సింగిడి):** బోధన్ పట్టణంలోని ఆచన్ పల్లి లో గల ఇందూర్ హైస్కూల్ లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని బోధన్ ప్రైవేటు పాఠశాలలు మరియు కళాశాలల యాజమాన్యాల సంఘం ఆధ్వర్యంలో ఆచార్యదేవోభవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యావ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తూ, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ఉత్తమ ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులను గుర్తించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, విశిష్ట అతిథులుగా హాజరైన బోధన్,సాలూరా ఎంఈవోలు నాగయ్య, రాజీ మంజూషాల చేతుల మీదుగా 25 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఆచార్యదేవోభవ అవార్డులతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షులు కొడాలి కిశోర్, బోధన్ గౌరవ అధ్యక్షులు యార్లగడ్డ శ్రీనివాస్ రావు,అధ్యక్షులు ముస్త్యాల హరికృష్ణ, కార్యదర్శి మంతె సురేష్,కోశాధికారి కృష్ణమోహన్,ట్రస్మా డివిజన్ అధ్యక్షులుమిద్దెల రాజు, సెక్రెటరీ అనిల్ కుమార్, కోశాధికారి సురేష్ గౌడ్,ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షులు జయ ప్రకాష్, ట్రస్మా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి , వివిధ పాఠశాలల కళాశాలల కరస్పాండెంట్లు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## డిజిటల్ క్రాప్ సర్వేకు రైతులు సహకరించాలి

**బోధన్ ప్రతినిధి, (సింగిడి):** రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను నమోదు చేసేందుకు నిర్వహిస్తున్న డిజిటల్ సర్వేకు రైతులు సహక రించాలని సాలూరా మండల వ్యవసాయ శాఖ అధికారిణి శ్వేత కోరారు. సాలూరామండలంలో కొనసాగుతున్న డిజిటల్ క్రాప్ సర్వే కార్యక్రమాన్ని ఆమె క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. సర్వే చేస్తున్న వాలంటీర్లకు పలు సూచనలు చేశారు. సాగులో ఉన్న పంట, పంట విస్తీర్ణం, సర్వే నెంబర్, తదితర వివరాలను ఎలాంటి పొరపాట్లు చేసుకోకుండా పగడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు. రైతుల సహకారంతో వారి పొలాలను క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించి, సంబంధిత రైతులతో డి సి ఎస్ సర్వే చేయించుకోవాలని,ప్రతి రైతు తమ పొలంలో సాగు చేస్తున్న పంటకు సంబంధించిన వివరాలను సర్వేలో ఖచ్చితంగా నమోదు చేయించుకోవాలని తెలిపారు. డిజిటల్ క్రాప్ సర్వేను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని వాలంటీర్లను ఆదేశించారు. సర్వే త్వరగా పూర్తయితే మండలంలోని పం టల వారీగా సాగు విస్తీర్ణంపై స్పష్టత ఏర్పడి, సంబంధిత కొనుగోలు సంస్థలు పంటల సేకరణను సులభంగా ప్రణాళిక చేసుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ముజామిల్, రైతులు పాల్గొన్నారు.



## నేటి నుంచి ఉచిత కంటి వైద్య శిబిరం



**ఆమనగల్లు , (సింగిడి):** కడ్తాల పట్టణ కేంద్రంలో ఐక్యతఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19 నుంచి తొమ్మిది రోజుల పాటు మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు టాస్క్ సిఓఓ,ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నియోజకవర్గ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసు కోవాలని సూచించారు. ఈ వైద్య శిబరానికి ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని రావాలని తెలిపారు. ప్రతిరోజు ప్రముఖ కంటి వైద్య నిపుణులు శంకర నేత్రాలయ ఆధ్వర్యంలో కంటి పరీక్ష లతోపాటు, శుక్లాలకు సంబంధించిన సర్జరీ లు నిర్వహిస్తామని తెలిపారు. తొమ్మిది రోజులపాటు నిర్వహించే శిబిరంలో ఉచిత కంటి పరీక్షలతో పాటు ఉచిత ఆపరేషన్లు, అద్దాలు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. కంటి సమస్యతో బాధపడుతున్న వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఎన్ఎస్‌యూఐ తెలంగాణ జాయింట్ సెక్రెటరీగా జుబేర్ అహ్మద్



**అమరచింత, (సింగిడి):** నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యూఐ) తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీగా జుబేర్ అహ్మద్ నియమితులయ్యారు. పార్టీ అధిష్ఠానం ఆయనకు కీలక బాధ్యతలు అప్పగించింది. విద్యార్థి ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొంటూ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన జుబేర్ అహ్మద్ కు రాష్ట్ర స్థాయి బాధ్యతలు దక్కడం పట్ల అనుచరులు, కాంగ్రెస్ నాయకులు, విద్యార్థి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జుబేర్ అహ్మద్ మాట్లాడుతూ విద్యార్థి, యువజన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు, పోటీ పరీక్షలకు సౌకర్యాలు కల్పించే దిశగా పనిచేస్తానని తెలిపారు. కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా అవగాహన కల్పించడం తన ప్రాధాన్యత అని పేర్కొన్నారు. జుబేర్ అహ్మద్ కు బాధ్యతలు రావడం పట్ల రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి, ఎన్ఎస్‌యూఐ నేషనల్ ప్రెసిడెంట్ వినోద్ జాకర్, తెలంగాణ రాష్ట్ర ప్రెసిడెంట్ వెంకటస్వామి, కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, యువజన నాయకులు అభినందనలు తెలిపారు. తనకు అవకాశం కల్పించిన పార్టీ నాయకత్వానికి జుబేర్ అహ్మద్ కృతజ్ఞతలు తెలిపారు.

### వ్యక్తిగత దూషణలు చేస్తే బీఆర్ఎస్

## నాయకులకు తగిన బుద్ధి చెబుతాం



**అమరచింత, (సింగిడి):** కాంగ్రెస్ నాయకులపై టిఆర్ఎస్ నాయకులు వ్యక్తిగత దూషణలు చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షులు నాగేశ్వర్, పట్టణ అధ్యక్షులు ఈర్లదిన్నె శ్రీనివాసులు హెచ్చరించారు. బుధవారం టిఆర్ఎస్ నాయకులు స్థానిక మీడియాతో మాట్లాడుతూ కొంతమంది కాంగ్రెస్ నాయకులను అలాగే మున్సిపల్ చైర్పర్సన్ వైస్ చైర్మన్ కాంగ్రెస్ పట్టణ మండల అధ్యక్షులను పురుష పదజాలంతో విమర్శించడానికి వారు తీవ్రంగా ఖండించారు. గత పది సంవత్సరాలు అధికారంలో ఉండి ఆత్మకూరు ని దోచుకున్నది ఈ ప్రాంత ప్రజలకు తెలుసు అని అన్నారు. అనంతరం మునిసిపల్ చైర్ పర్సన్ నాగమణి వైస్ చైర్మన్ నల్లగొండ శ్రీనివాసులు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రహమతుల్లా, డిసిసి కార్యదర్శి తులసిరాజ్ యాదవ్ మాట్లాడుతూ ఆత్మకూరులో వందల కోట్ల తో అభివృద్ధి పనులు చేస్తుంటే అది చూసి తట్టుకోలేక లేనిపోని ఆరోపణలు చేస్తూ వ్యక్తిగత దూషణ చేస్తున్నారని మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ తులసి సద్దల వెంకట రాములు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి

### ఘనంగా నిర్వహించిన ఎస్ఎఫ్ఐ



**అమరచింత, (సింగిడి):** ఆత్మకూరు మండల పరిధిలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ ఎఫ్ ఐ) ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ వనపర్తి జిల్లా ఉపాధ్యక్షు లు కె. రాఘవ మాట్లాడుతూ నిజాం పాలనలో పేద రైతాంగం భూస్వా ముల భూముల్లో వెట్టిచాకిరి చేసేవారని, చేతివృత్తిదారులు తమ ఉత్పత్తు లను దొరలకు ఉచితంగా ఇవ్వాల్సి వచ్చేదని, హరిజన, గిరిజనులు గడీల్లో పనిచేయాల్సిన దుస్థితి ఉండేదని గుర్తుచేశారు. అలాంటి దౌర్భాగ్య స్థితి నుంచి ప్రజలను చైతన్యం చేసి సాయుధ పోరాటంలో క్రియాశీలక పాత్ర పోషించిన వీరనారి ఐలమ్మ అని కొనియాడారు. వరంగల్ జిల్లా పాలకుర్తికి చెందిన చిట్యాల ఐలమ్మ అతి సామాన్య కుటుంబం నుంచి వచ్చి విసునూరు రామచంద్రారెడ్డికి వ్యతిరేకంగా పోరాడి పేదల భూమిని, పంటలను కాపాడిందని, భూమిలేని పేదల కోసం నిజాంకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేసిందని, ఆమె పోరాట స్ఫూర్తి నేటి విద్యార్థి, యువతకు ఆదర్శమని అన్నారు. సాయుధ పోరాటంతో సంబంధం లేని బీజేపీ, ఆర్ఎస్ఎస్ లు ఆ పోరాటాన్ని రెండు వర్గాల మధ్య ఘర్షణగా చిత్రీకరించడం సిగ్గుచేటని విమర్శించారు. ఐలమ్మ స్ఫూర్తితో తెలంగాణలో అన్ని సామాజిక వర్గాలకు భూమి కోసం చేసే పోరాటాలే ఆమెకిచ్చే నిజమైన నివాళి అని, విద్యార్థి, యువత ఆదర్శంగా తీసుకొని పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఐ మండల నాయకులు సాయి కృష్ణ, గణేష్, వెంకటేష్, జగదీష్, లోకేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### కల్వకుర్తికి అగ్రికల్చర్ పాలిటెక్నిక్

## కళాశాల మంజూరు చేయండి: కెఎన్ఆర్



**ఆమనగల్లు, (సింగిడి):** కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నియోజకవర్గ సమస్యలను అసెంబ్లీ వేదికగా ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కల్వకుర్తి నియోజకవర్గం వ్యవసాయ ఆధారిత ప్రాంతమని ఈ ప్రాంత ప్రజలకు జీవితకాలం ఆధారపడే ఇన్ఫ్రాస్ట్రక్చర్ అవసరమని వివరించారు. అందుకోసం కళాశాల మంజూరు చేయాలని ఆయన కోరారు. దీనివల్ల ప్రాంత అభివృద్ధితో పాటు నిరుద్యోగం తగ్గుతుందని పేర్కొన్నారు.

# అతన్ని ప్రేమించి మోసపోయా..



తాజాగా రిలేషన్‌పై ఐశ్వర్య చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. కేరళకు చెందిన ఐశ్వర్య లక్ష్మి.. మెడిసిన్ చదువుకున్నారు. అయితే డాక్టర్ కాకుండా యాక్టింగ్ వైపు వచ్చారు. అప్పటికే మోడలింగ్



చేస్తూ పలు టాప్ బ్రాండ్స్‌కు సంబంధించిన వాణిజ్య ప్రకటనల్లో నటించారు. 2017లో నవిన్ పౌలే సరసన నటించే అవకాశం ఐశ్వర్యకు దక్కింది. ఈ సినిమాలో ఆమె నటనకు మంచి గుర్తింపు రావడంతో పాటు మలయాళ, తమిళ భాషల్లో అనూహ్యంగా బిజీ అయ్యారు. మాయానంది, వారాతన్, పొన్నియన్ సెల్వన్, అమ్ము, కుమారి, గట్టా కుస్తీ, హలో మమ్మీ, మామన్ సినిమాలతో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు.

సత్యదేవ్ హీరోగా వచ్చిన గాడ్సే మూవీ ద్వారా తెలుగు వారిని పలకరించారు ఐశ్వర్య లక్ష్మి. ఈ ఏడాది తమిళంలో గట్టా కుస్తీ 2 సినిమాతో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. ప్రస్తుతం సాయిధరమ్ తేజ్ సరసన సంబరాల ఏటి గట్టు, మలయాళంలో ఆశా సినిమాలలో ఆమె నటిస్తున్నారు. సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉండే ఐశ్వర్య.. తన సినిమాలు, షూటింగ్స్, ఇతర వ్యక్తిగత వివరాలను అభిమానులతో పంచుకుంటూ ఉంటారు. 35 ఏళ్లు దాటి 40వైపు చేరుకుంటున్నా ఇంకా పెళ్లి చేసుకోకుండా బ్యాచిలర్‌గానే ఎంజాయ్ చేస్తున్నారు ఈ ముద్దుగుమ్మ. పలుమార్లు ఐశ్వర్య లక్ష్మి ప్రేమలో పడినట్లుగా రూమర్స్ రాగా.. వాటిని ఆమె ఖండించారు. నేను సింగిల్‌గా చాలా హ్యాపీగా ఉన్నాను.. నన్ను డబుల్ చేసేందుకు ప్రయత్నించొద్దని ఫ్యాన్స్‌పై విరుచుకుపడింది ఐశ్వర్య. జీవితంలో నేను పెళ్లి చేసుకోను.. ఎంతోమంది సన్నిహితులను చాలా దగ్గరి నుంచి చూశా. పెళ్లి కారణంగా కలల్ని చంపుకుని, వ్యక్తిగతంగానూ వారు ఎదగలేకపోతున్నారు. ఇవన్నీ చూసి, ఆలోచించి జీవితంలో పెళ్లి చేసుకోకూడదని నిర్ణయించుకున్నాను. సంతోషకరమైన జీవితాన్ని గడపటానికి పెళ్లి అనేది తప్పనిసరి కాదు. పెళ్లి చేసుకుని విడిపోవడం కంటే, సహజీవనం బెస్ట్ అని ఐశ్వర్య లక్ష్మి బోల్డ్ కామెంట్స్ చేశారు. తాజాగా ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన పెళ్లి, ప్రేమపై ఐశ్వర్య లక్ష్మి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నేను గతంలో ఓ రిలేషన్‌లో మోసపోయా, స్వతహాగా నేను ఆకర్షణలకు లొంగను, అలాంటి ఓ వ్యక్తిని పూర్తి నమ్మి అతని చేతిలో మోసపోయా. ఈ రిలేషన్ ముగిసిన తర్వాతే నా చుట్టూ ఏం జరుగుతుందో తెలుస్తోంది. ఓ మహిళ నన్ను కలిసిన తర్వాతే అతని మోసం బయటపడింది. ఇందులో తన తప్పు లేకపోవడం వల్లే ఆమెపై నాకెలాంటి కోపం రాలేదు. ఈ విషయం గురించి రెండు రోజులు మాత్రమే బాధపడ్డా.. ఆ తర్వాత దానిని మరిచిపోయానని ఐశ్వర్య లక్ష్మి పేర్కొన్నారు.

**విలక్షణ నటిగా గుర్తింపు తెచ్చుకుని దక్షిణాదిలోని అన్ని భాషల్లో సత్తా చాటుతున్నారు ఐశ్వర్య లక్ష్మి. నటనే కాదు ఏ విషయంపై అయినా కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడటం ఆమె స్టైల్. ఎవరు ఏమనుకున్నా సరే తన మనసులో ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడతారు ఐశ్వర్య. కొద్దిరోజుల క్రితం పెళ్లి, సహజీవనం విషయంలో ఆమె మాట్లాడిన మాటలు హాట్ టాపిక్‌గా మారాయి.**

## సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన స్వగత కృష్ణన్

తమిళ సినీ పరిశ్రమలో ఓ పోస్ట్ చర్చనీయంగా మారింది. ప్రముఖ గాయని స్వగత కృష్ణన్ చేసిన తాజా ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పేరు ప్రస్తావించకుండా ఓ వ్యక్తిపై ఆమె సంచలన ఆరోపణలు చేసింది. ఆ వ్యక్తి మహిళలపై లైంగిక దాడులు, బెదిరింపులు, బ్లాక్‌మెయిల్, బలవంతపు మత మార్పిడి చేశాడని, అలాంటి వ్యక్తికి ఇండస్ట్రీ కి సపోర్టుగా నిలిచిందని అసంతృప్తి వ్యక్తం చేసింది.సింగర్ స్వగత కృష్ణన్ గతంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తనకు ఎదురైన చేదు అనుభవాలను వెల్లడించింది. ఓ సంగీత దర్శకుడి స్టూడియోలో తనను లైంగిక వేధించాడనీ, స్టూడియోలో సౌండ్‌ప్రూఫ్ గది, సీసీటీవీ కెమెరాలు ఉన్నాయని.. అక్కడ జరిగిన ఘటనను రికార్డు చేసి, ఆ ఫుటేజ్‌ను ఉపయోగించి తనను బెదిరించారని ఆమె పేర్కొన్నారు. తనకు మాత్రమే కాకుండా మరికొంతమంది మహిళలకు కూడా ఇదే వ్యక్తి వల్ల ఇబ్బందులు ఎదురయ్యాయని స్వగత ఆరోపించారు. ఈ పరిణామాల కారణంగానే తాను చెన్నైని విడిచి రిషికేశ్‌కు వెళ్లినట్లు వెల్లడించారు. ఇప్పుడు స్వగత చేసిన తాజా ఇన్‌స్టాగ్రామ్ స్టోరీతో ఆ వ్యవహారం మరోసారి చర్చలోకి వచ్చింది. పేరు చెప్పకుండా ఓ వ్యక్తిపై సంచలన ఆరోపణలు చేసింది. పలువురు బాధిత మహిళలు ఆరోపణలు చేసినప్పటికీ ఆ వ్యక్తికి సినీ పరిశ్రమలో మద్దతు లభిస్తుంది. ఆ వ్యక్తి ప్రస్తుతం తన సామాజిక ప్రతిష్ట, పీఆర్, ప్రజాభిప్రాయం గురించి ఇంటర్వ్యూలు ఇస్తుండటం ఎలా సాధ్యమవుతోందని ఆమె ప్రశ్నించారు. ఒకవైపు ఇలాంటి ఆరోపణలు ఉండగా.. మరోవైపు పరిశ్రమలో అతడికి గౌరవం, స్వాగతం లభిస్తుండటంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేసింది. స్వగత తాజా పోస్టులో మరో కీలక విషయాన్ని ప్రస్తావించింది. ఆ వ్యక్తి ప్రస్తుతం ఓ భక్తి ప్రధానమైన సినిమాకు సంగీతం అందిస్తున్నారని తెలిపింది. ఈ ఒక్క అంశం సోషల్ మీడియాలో చర్చకు మరింత ఆజ్యం పోసింది. అంతే కాదు.. తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని బహిరంగ కార్యక్రమాలకు ఆహ్వానించడం, వేదికపై అతడికి కేక్ తినిపిస్తున్నారనీ తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో సినీ పరిశ్రమ ఎవరి పక్షాన నిలబడుతుందనీ ప్రశ్నించింది. ఇక చివరిలో 'నెక్స్ట్..' అంటూ తన ట్వీట్ ముగించింది సింగర్ స్వగత. ఇలాంటి ఉత్కంఠ రేపడంతో త్వరలో మరిన్ని వివరాలను వెల్లడించబోతున్నారా? ఇప్పటివరకు చెప్పని విషయాలను బయటపెట్టబోతున్నారా? అనే చర్చ మొదలైంది. ఇప్పటికే ఆమె గత ఆరోపణలపై కూడా సోషల్ మీడియాలో చర్చ జరిగిన నేపథ్యంలో.. తాజా పోస్టు మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ముఖ్యంగా ఆమె తదుపరి పోస్టులో ఏదైనా వ్యక్తి పేరు లేదా కీలక ఆధారం బయటపెడతారా అన్నదే ఇప్పుడు ఉత్కంఠగా మారింది.

## 'సీక్రెట్ సోల్జర్' నుంచి సాంగ్ రిలీజ్



నిహాల్ కోదాటి, సూర్య శ్రీనివాస్ హీరోలుగా తెరకెక్కుతున్న సినిమా 'సీక్రెట్ సోల్జర్'. మూన్ లైట్ డ్రీమ్స్ బ్యానర్‌పై అక్కి విశ్వనాథ్ రెడ్డి దర్శకత్వంలో స్పై డ్రామాగా ఈ సినిమా తెరకెక్కుతుంది. కమల్ కామరాజు, రఘుబాబు, రంగస్థలం మహేష్, శ్రీనివాస్ వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్.. పలువురు ఈ సినిమాలో కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజయిన సాంగ్స్, టీజర్, ట్రైలర్స్ అంచనాలు పెంచగా తాజాగా ఈ సినిమా నుంచి ఓయ్ ఓయ్.. అంటూ సాగే సాంగ్ ని రిలీజ్ చేశారు. కార్తీక్ రోడ్రిగ్జ్ సంగీత దర్శకత్వం అందిస్తూ రెహమాన్ రాసిన ఈ సాంగ్ ని కార్తీక్ స్వయంగా పాడాడు. ఈ సినిమా సెప్టెంబర్ 18న థియేటర్స్ లో రిలీజ్ కానుంది.

## స్టైల్‌ని బాగానే వాడేశారు

కంటెంట్ ఉన్నోడికి కటౌట్ చాలు.. ఈ సినిమా డైలాగ్‌ను సినిమాలకే ఆపాదిస్తే.. 'కంటెంట్ మీద నమ్మకం తక్కువ ఉన్నప్పుడు కాంట్రవర్సీ చాలు' అని మార్చొచ్చు. ఇది ఏ ఒకరినో ఉద్దేశించి అన్న మాట కాదు. ఇప్పటివరకు టాలీవుడ్‌లో జరిగిన సినిమా



కాంట్రవర్సీలు, ఆ తర్వాత ఆ సినిమాలు పొందిన లాభాలు చూసి అన్నమాట ఇది. ఇక్కడ పేర్లు చెప్పం కానీ.. యువ హీరోలు.. యువ స్టార్ హీరోలు, యువ ప్రామిసింగ్ హీరోలుగా మారడానికి ఈ స్టైల్‌ని బాగానే వాడేశారు. ఇప్పుడు ఎందుకు ఈ చర్చ అనుకుంటున్నారా? ఇప్పుడు టాలీవుడ్‌లో రిలీజ్‌కి రెడీ అవుతున్న ఓ సినిమాకు సంబంధించి ఇదే మాట వినిపిస్తోంది. సమాజంలో చర్చని లేవనెత్తే సినిమా ఇది. ఎంతగా చర్చ జరిగితే మా సినిమాకి అంత మంచిది. ట్రైలర్ విడుదలైన వెంటనే మా సినిమాపై చర్చ మొదలైంది. అది మంచిదే. ఒక రకంగా ట్రైలర్‌తో మేం ప్రేక్షకుల్ని ముందుగానే సిద్ధం చేశాం అని హీరో ఆ సినిమా గురించి ఇటీవల మాట్లాడారు. ఈ మాటల వెనుక అర్థం డిస్కషన్ ఆ తర్వాత ఫుట్‌ఫాల్స్ అని అర్థమవుతోంది. ఇక ఆ సినిమా నిర్మాత అయితే.. సినిమాలో ప్రేక్షకులు ఊహించని విషయాలు, షాకులు మరిన్ని ఉంటాయనేలా మాట్లాడారు. ప్రేక్షకులను ముందే ప్రిపేర్ చేసే ప్రయత్నం ఇది అనిపిస్తోంది. ఈ సినిమాకు రెగ్యులర్ సినిమాల తరహా ముగింపు ఉండదని చెప్పిన నిర్మాత.. సినిమా ఉన్నట్లుండి, ఆగిపోయినట్లు అనిపిస్తుందని, ప్రేక్షకులు అనుకున్నట్లుగా క్లైమాక్స్ ఉండదని చెప్పారు. అలాగే కాస్త 'అతి' డైలాగ్‌లు అనిపించుకున్నవి సినిమాలో ఇంకా బాగుంటాయి అని కూడా చెప్పారు. ఈ సినిమాలోని సీన్స్, మాటలు ఇప్పటివరకు ఎక్కడా చూసి ఉండరని.. అంత సహజంగా తీశారని కూడా ఆ నిర్మాత చెబుతున్నారు. ఇదంతా చూస్తుంటే సినిమా విడుదల తర్వాత 'బేబీ' తరహా చర్చ, రచ్చ అయితే పక్కా అనిపిస్తోంది. మరి ఏమవుతుందో చూడాలి.

## ఫ్యామిలీతో కలిసి చూడదగ్గ మూవీ మండాడి



సూరి, సుహాస్ మెయిన్ లీడ్స్‌గా తెరకెక్కిన తమిళ్ సినిమా 'మండాడి'. ఎల్రెడ్ కుమార్ సమర్పణలో ఆర్ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ బ్యానర్ పై ఎల్రెడ్ కుమార్ నిర్మాణంలో మతిమారన్ పుగళేంది దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కింది. ఈ సినిమాలో మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటించగా.. సత్యరాజ్, రవీంద్ర విజయ్, మిథున్, బాల శరవణన్.. పలువురు కీలక పాత్రలను పోషించారు. మండాడి సినిమా నేడు సెప్టెంబర్ 10న తమిళ్, తెలుగులో రిలీజ్ అయింది. కళింగపట్నంను సట్టపులి(సుహాస్) రూల్ చేస్తూ ఉంటాడు. ఆ ఊళ్ళో సముద్రంలో జరిగే పడవపోటీలు ఎన్నో ఏళ్లుగా చాలా ఫేమస్. 20 ఏళ్లుగా సట్టపులి సునామి రైడర్స్ టీమ్‌తో ఆ ఊరిని గెలిపిస్తూ ఉంటాడు. శ్రీను(రవీంద్ర విజయ్) కొడుకు మల్లేష్ (మిథున్ జై శంకర్) పడవల పోటీకి సంబంధిం చిన ఓ విషయంలో గొడవ జరిగి సట్టపులి కొడుకుపై దాడి చేస్తాడు. అది మిస్ అవ్వడంతో ఓ అమ్మాయి సాయంతో హైదరాబాద్ లో ఉన్న ముత్తు కాళీ(సూరి) దగ్గర తలదాచుకుని ఉంటాడు. ముత్తుకాళీ పెళ్లి చేసుకోకుండా సింగిల్ గా ఉంటూ ఓ స్విమ్మింగ్ పూల్ లో పనిచేస్తూ ఉంటాడు. కానీ సట్టపులి మనుషులు మల్లేష్ ని చంపడానికి అక్కడికి కూడా రావడంతో 20 ఏళ్లుగా ఊరికి వెళ్లని ముత్తుకాళీ మల్లేష్ ని తీసుకొని ఊరికి వస్తాడు. అక్కడ పెద్దలు సట్టపులికి ముత్తుకాళీ మధ్య రాజీ కుదర్చాలని ట్రై చేసినా అక్కడ పెద్ద గొడవ అవుతుంది. దాంతో కళింగపట్నం నుంచి రెండు టీమ్స్ పోటీ చేయాలి ఎవరు ఓడిపోతే వాళ్ళు ఆటని వదిలేయాలి అని నిర్ణయిస్తారు. పోటీకి కొన్ని రోజులు సమయం ఉండటంతో కొత్తవాళ్లకు ముత్తుకాళీ తన కళింగ వారియర్స్ టీమ్ గా ట్రైనింగ్ ఇస్తూ ఉంటాడు. సట్టపులి, అతని కొడుకు పోటీ ఎలాగైనా గెలవాలని కుట్రలు పన్నుతూ ఉంటారు. ఓ ప్రాక్టీస్ మ్యాచ్ లో ముత్తుకాళీ టీమ్ పడవ బోల్తా పడి పోటీలో ఉన్నవాళ్లు హాస్పిటల్ పాలవుతారు. దీంతో కళింగ వారియర్స్ కి పోటీల్లో ఎలా పాల్గొనాలో అర్థం కాదు. మరోవైపు 20 ఏళ్ళ క్రితం ముత్తుకాళీ ఒకప్పుడు తన తల్లి ఏంజిల్ (మహిమా నంబియార్)ని ప్రేమించిన వ్యక్తి అని తెలిసి మల్లేష్ ముత్తుకాళీ పై కోపంగా ఉంటాడు. అసలు 20 ఏళ్ళ క్రితం ఆ ఊళ్ళో ఏం జరిగింది? బెస్ట్ ఫ్రెండ్స్‌గా ఉండే సట్టపులి – ముత్తుకాళీ శత్రువులు ఎలా అయ్యారు? ఏంజిల్ – ముత్తుకాళీ ప్రేమ ఎందుకు విఫలమైంది? పోటీలో గెలవడానికి సట్టపులి చేసే కుట్రలు ఏంటి? ఫైనల్ పోటీలో ముత్తుకాళీ టీమ్ గెలుస్తుందా? సముద్రంలో జరిగే సంఘటనలు ఏంటి.. ఇవన్నీ తెలియాలంటే తెరపై చూడాల్సిందే.

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala mohan, PRGI.REGN.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737